ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
ఆదివారం 16, ఫిబ్రవరి 2025


ఒంగోలులో సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కలిపి మొత్తం 719 సచివాలయాలు ఉన్నాయి. ఈనెల 3 నుంచి 10వ తేదీ వరకు వారం రోజుల్లో ఒకటి మినహా మిగిలిన 718 సచివాలయాల సిబ్బంది హాజరు వివరాలు అధికారులకు అందాయి. వాటిలో 6,078 మంది ఉద్యోగులు ఉంటే కేవలం 4,292 మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు వేశారు. దాదాపు 30 శాతం మంది బయోమెట్రిక్ గురించి పట్టించుకోలేదు.

ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం నగరంలోని గాంధీనగర్, శివప్రసాద్ కాలనీ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాంధీనగర్‌లోని సచివాలయంలో పనిచేసే సెక్రటరీల్లో ఒక్కరు కూడా అక్కడ కన్పించలేదు. దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ నోటీసులు ఇవ్వాలని నోడల్ ఆఫీసర్ బాషాను ఆదేశించారు.

జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనేక మంది విధులకు అతిథులుగా మారారు. మరి కొంత మంది సమయపాలన పాటించడం లేదు. ఈ విషయాలను గుర్తించిన ప్రభుత్వం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టినా చాలా మంది బేఖాతరు చేస్తున్నారు. వారంవారం సచివాలయ ఉద్యోగుల హాజరుపై కలెక్టర్ నిర్వహిస్తున్న సమీక్షలో ఈ విషయం స్పష్టమవుతోంది. అధికార వర్గాల సమాచారాన్ని బట్టి జిల్లాలో దాదాపు 30 శాతం మంది సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరును పట్టించుకోవడం లేదన్న విషయం వెల్లడవుతోంది.

- సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు
- పలు ప్రాంతాల్లో మూడో వంతు డుమ్మా
- అనధికారికంగా కొందరు విధులకు గైర్హాజరు
- వారంవారం ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా 70శాతం మించని హాజరు
- పనితీరూ అంతంతమాత్రమే


ఒంగోలులోని సచివాలయం

# బయోమెట్రిక్ బేఖాతర్!



ఒంగోలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల తీరులో ఏమాత్రం మార్పు కన్పించడం లేదు. వారిని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ కొందరు 'మేమింతే.. మారమంతే' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వారు ఏమేరకు విధి నిర్వహణలో సక్రమంగా పనిచేస్తున్నారు, పౌర సేవలు అందించడంలో ఎంత క్రియాశీలకంగా ఉంటున్నారన్న విషయాన్ని అలా ఉంచితే అనేక మంది అసలు సచివాలయానికే రాని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయగా గ్రామీణ ప్రాంతాల్లో 14 మంది, పట్టణాలలో 10 మంది ఉద్యోగులను సగటున నియమించారు. వివిధ శాఖల పనుల కోసం ఈ సిబ్బంది నియామకం జరిగింది. అయితే వారి పర్యవేక్షణ విషయంలో స్పష్టత లేకపోవడం, ఉద్యోగుల వారీ విధుల నిర్వహణపై సరైన శిక్షణ ఇవ్వకపోవడంతో పనితీరు అస్తవ్యస్తంగా మారింది. పేరుకు సచివాలయ అడ్మిన్ సెక్రటరీ ఉన్నప్పటికీ మిగతా సిబ్బంది నియంత్రణ ఆచరణలో సక్రమంగా లేదు.

## గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు


ఈ విషయాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈక్రమంలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల తరహాలో వీరు కూడా సచివాలయానికి ఉదయం 10 గంటలకల్లా వచ్చి బయోమెట్రిక్ హాజరు వేయాలి. ఒకవేళ వివిధ సర్వేలు, ఇతర పనులకు క్షేత్రస్థాయిలో ఉంటే మొబైల్ యాప్‌లో హాజరు వేయాలి. వారంవారం కలెక్టర్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ హాజరును సమీక్షిస్తున్నారు. ప్రభుత్వం కూడా అన్ని జిల్లాల హాజరును పరిశీలిస్తోంది. అయినా అనేక మంది బయోమెట్రిక్ హాజరును బేఖాతర్ చేస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ నిర్వహించే సమీక్ష నివేదికలను పరిశీలిస్తే బయోమెట్రిక్ హాజరు నిబంధనను సచివాలయ ఉద్యోగులు ఏ స్థాయిలో ఉల్లంఘిస్తున్నారోనన్న విషయం అర్థమవుతోంది.

## 70.76 శాతం మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు

జిల్లాలో ఉన్న 719 సచివాలయాలలో నెట్ సౌకర్యం లేనివి 11 ఉన్నాయి. వాటిలో రిజిస్టర్ హాజరు నమోదు చేయాలి. 718 సచివాలయాల నుంచి అందిన సమాచారం మేరకు మొత్తం 6,078 మంది ఉద్యోగులలో ఈనెల 3తో ముగిసిన వారానికి 70.76 శాతం మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు వేశారు. 10వ తేదీతో ముగిసిన వారానికి 70.62 శాతంతో 4,292 మంది మాత్రమే హాజరైనట్లు సమాచారం. ఆయా ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. ఎస్.ఎన్.పాడు మండలంలో గరిష్ఠంగా 3వ తేదీ నాటికి 47.27 శాతం

మిగతా 6లో...

---



# రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

- మీసేవా కేంద్రాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- సాఫ్ట్‌వేర్‌లో సమస్యతో జాప్యం
- త్వరలోనే దరఖాస్తులను పరిష్కరిస్తామంటున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ ప్రక్రియ సక్రమంగా సాగలేదు. దరఖాస్తులు చేసుకున్న ఆరు నెలల తర్వాత కొత్తకార్డులు ఇస్తామని చెప్తూ కాలయాపన చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్ కార్డులు లేని ప్రజల్లో ఆశలు చిగురించాయి. అందుకు అనుగుణంగా నూతన సంవత్సరం కానుకగా కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు చేర్పులు, మార్పులకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాఫ్ట్‌వేర్‌లో ఉత్పన్నమైన కొన్ని సమస్యలతో ఆ ప్రక్రియ చేపట్టడంలో జాప్యమవుతోంది. విషయం తెలియని ప్రజలు రేషన్ కార్డుల కోసం మీసేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. వాటి నిర్వాహకులు ఇంకా సైట్ ఓపెన్ కావడం

మిగతా 6లో...


# చీపుర్లు పట్టి.. రోడ్లను ఊడ్చి..

- విద్యార్థులతో ర్యాలీలు, ప్రతిజ్ఞలు
- పెద్దఎత్తున ఇంకుడు గుంతలకు శంకుస్థాపనలు
- ఉద్యమంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర
- జాళ్లపాలెంలో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా
- అన్నిచోట్లా టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు భాగస్వామ్యం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'ను శనివారం జిల్లా వ్యాప్తంగా ఉద్యమంలా నిర్వహించారు. ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. చీపుర్లుపట్టి రోడ్లను ఊడ్చారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీలు చేపట్టారు. వారితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కొండపి మండలం జాళ్లపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా

మిగతా 6లో...


జాళ్లపాలెంలో రోడ్డును శుభ్రం చేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, అధికారులు



# ఎయిడెడ్ మిగులు టీచర్లు 205 మంది!

- జీవో నంబర్-1 ప్రకారం తేల్చిన విద్యాశాఖ అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 205 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు సర్ ప్లస్ (మిగులు)గా ఉన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్-1 ప్రకారం ఈమేరకు తేల్చారు. ఎర్రగొండపాలెం మండలంలో 8 మంది, మార్కాపురంలో 14, అర్ధవీడులో 3, కొమరోలులో 16, రాచర్లలో 5, గిద్దలూరులో 18, కంభంలో 18 మంది, పుల్లలచెరువులో 3, వెలిగండ్లలో 7, హనుమంతునిపాడులో 5, కనిగిరి మండలంలో ఏడుగురు ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నారు. దర్శి మండలంలో 3, దొనకొండలో 5, ఒంగోలులో 20 మంది, కొత్తపట్నంలో 3, మద్దిపాడులో ఒకరు, నాగులుప్పలపాడు మండలంలో 24మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు సర్‌ప్లస్‌గా ఉన్నారు. వేటపాలెం మండలంలో 3, చీరాలలో 20 మంది, పర్చూరులో 3, ఇంకొల్లు 10 మంది, యద్దనపూడిలో 4, జె.పంగులూరులో 4, అద్దంకి మండలంలో నలుగురు ఎయిడెడ్ ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నారు. వీరందరి సీనియారిటీ జాబితాను తయారు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డిలు ఒక ప్రకటనలో కోరారు.


సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యేలు ఉగ్ర, బీఎన్, ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

# కందుకూరును ప్రకాశంలో కలుపుతాం..

## అందుకు సమయం ఉంది!

- రామాయపట్నం టౌన్ షిప్‌నకు సహకరించండి : సీఎం చంద్రబాబు
- వినూత్నరీతిలో సాగిన కందుకూరు పర్యటన
- ఒంగోలుకు ఆకస్మికంగా వస్తా.. స్వచ్ఛాంధ్ర అమలును చూస్తా..
- తనను కలిసిన ఎమ్మెల్యే దామచర్లతో ముఖ్యమంత్రి
- చుక్కలు చూపుతున్నావంటూ ఉగ్రపై చలోక్తి

7

# భళా.. బాలోత్సవం..

జిల్లాస్థాయి బాలోత్సవం శనివారం ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ పాఠశాలలు, డ్యాన్స్ అకాడమీలకు చెందిన చిన్నారులు చేసిన నృత్యాలు, వేషధారణలు, ఏకపాత్రాభినయాలు అదుర్స్ అనిపించాయి.

వివరాలు 6వ పేజీలో





హత్య జరిగిన ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు

# మద్యానికి బానిసై.. ఉన్మాదిగా మారి!

- వేధింపులు తట్టుకోలేక మిగిలిన కుమారులతో కలిసి హత్య చేసిన తల్లి
- శ్యాంప్రసాద్ హత్య కేసులో కీలక విషయాలు వెల్లడి

7



రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా వేదికపై మేయర్ సుజాత, రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ సుశీల

## రహదారి భద్రత అందరి బాధ్యత

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

● ముగిసిన మాసోత్సవాలు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రత అందరి బాధ్యత అని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధలను పాటించాలని సూచించారు. స్థానిక రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడపవద్దన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని వివరించారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వాహనచోదకులు రోడ్డు భద్రత నిబంధలను విధిగా పాటించాలన్నారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల నెల రోజుల్లో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, రైజ్ కాలేజీ ప్రిన్సిపాల్ భాస్కరరావు, మార్కాపురం ఆర్టీవో అమర్ నాయక్, వాహన తనిఖీ అధికారులు రామచంద్రరావు, కిరణ్ ప్రభాకర్, సురేంద్రప్రసాద్, రవికుమార్, మాధవరావు, జయప్రకాష్, ధర్మేంద్ర, సిబ్బందితోపాటు విద్యార్థులు, ఆటో, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు. .



భోజనాన్ని పరిశీలిస్తున్న సీడీఎంఏ సంపత్‌కుమార్

## అన్నక్యాంటీన్లలో నాణ్యమైన ఆహారం అందించాలి

● సీడీఎంఏ సంపత్‌కుమార్

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్లలో పేదలకు నాణ్యమైన ఆహారం అందిచాలని కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) సంపత్‌కుమార్ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం ఒంగోలులోని కర్నూలురోడ్‌లో గల అన్న క్యాంటీన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి భోజనాన్ని ఆయన స్వయగా రుచి చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు రూ.5లకే అన్నం పెట్టి ఆకలి తీర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులోభాగంగా అన్నక్యాంటీన్ల ద్వారా అందజేస్తున్న ఆహారం బాగుండాలని చెప్పారు. క్యాంటీన్‌లో అందిస్తున్న సేవలు, ఆహార పదార్థాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే నగర కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం ప్రతి అన్న క్యాంటీన్‌ను స్వయంగా తనిఖీ చేసి, ఆహారపదార్థల తయారీ, సేవలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా క్యాంటీన్‌కు విచ్చేసేవారితో మాట్లాడి వారి అభిప్రాయాన్ని స్వీకరిస్తున్నట్లు వివరించారు. ఎక్కడైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే వాటిని సవరించి నాణ్యమైన భోజనం అందిస్తున్నామని ఆయన వెల్లడించారు.

## బయోమెట్రిక్ బేఖాతర్!

(5వ పేజీ తరువాయి)

హాజరు ఉంది. 10వతేదీ నాటికి 51.35 శాతానికి మెరుగుపడింది. ఈ మండలంలో రెండు సచివాలయాలు ఆఫ్‌లైన్‌లో ఉన్నాయి. ఇక ఈ నెల 10 నాటికి వారం రోజుల హాజరు శాతాన్ని పరిశీలిస్తే అర్థవీడు మండలంలో 50 శాతం మంది హాజరు మాత్రమే కనిపిస్తోంది. ఆ మండలంలోని 8 సచివాలయాల్లో నాలుగు చోట్ల మాత్రమే ఆన్‌లైన్ సౌకర్యం ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇక అన్ని సచివాలయాలకు నెట్ సౌకర్యం ఉన్నప్పటికీ కొత్తపట్నం మండలంలో 15 సచివాలయాల పరిధిలో 139 మంది ఉద్యోగులు ఉంటే 56.12 శాతంతో 78 మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు వేశారు. పెద్దారవీడులో 62.04 శాతం, తర్లుపాడులో 65.03, పొదిలిలో 65.48, కురిచేడులో 65.48, సింగరాయకొండలో 65.97, ఒంగోలు రూరల్‌లో 66.02 శాతం హాజరు ఉంది. పట్టణాలలో పరిశీలిస్తే.. మార్కాపురం పట్టణంలో 81.87 శాతం మంది హాజరు ఉండగా ఒంగోలులో 74.92, చీమకుర్తిలో 72.68, కనిగిరిలో 72.58, గిద్దలూరులో 79.78 శాతం కనిపిస్తోంది. సెలవులో ఉండేవారు సైతం మొబైల్ ఫోన్‌లో ఆ విషయం నమోదు చేసే అవకాశం ఉన్నప్పటికీ అనేక మంది అలా చేయకుండా అనధికారికంగా గైర్హాజరవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే అంశాన్ని కలెక్టర్ అన్సారియా ఏడు రోజుల క్రితం వీసీలో గుర్తించి అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు.

## రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

(5వ పేజీ తరువాయి)

లేదని చెప్పి పంపుతున్నారు.

**అధికారులకు పెద్దఎత్తున అర్జీలు**

ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటుండటంతో కొత్తవి కోరుతూ మండల, జిల్లాస్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం లేకపోవడంతో ఇప్పుడు అందుకోసం అనేక మంది అటు తహసీల్దార్, ఇటు పౌరసరఫరాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కుటుంబంలో ఒకరు చనిపోయి ఉంటే వారి తొలగింపు, పుట్టిన వారి పేర్ల చేర్పు, కుటుంబంలో ఐదారుగురు గతంలో కలిసి ఉండి ఇప్పుడు విడిపోయి ఉంటే అటువంటి వారు కొత్త కార్డుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల పౌరసరఫరాల ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్‌కార్డులతోపాటు చేర్పులు, మార్పుల కోసం వస్తున్న అర్జీల విషయాన్ని జిల్లా అధికారులు వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆవిషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని, త్వరలోనే ప్రకటన వస్తుందని ఉన్నతాధికారులు చెప్పినట్లు సమాచారం.

## చీపురు పట్టి.. రోడ్లను ఊడ్చి..

(5వ పేజీ తరువాయి)

శ్రీబాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జిల్లావ్యాప్తంగా 15వేల ఇంకుడు గుంతలకు భూమి పూజ జరిగింది. జిల్లా కేంద్రమైన ఒంగోలులో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చీపురుపట్టి రోడ్లను శుభ్రం చేశారు. మార్కాపురంలో అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి నగర పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌లో చీపురు పట్టి శుభ్రం చేశారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడూరి ఎరిక్షన్‌బాబు మండల కేంద్రమైన ఎర్రగొండపాలెంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ ముఖ్యనాయకులు భాగస్వాములయ్యారు.

# పేరుకే ప్రాధాన్యత ప్రాజెక్టు.. పర్యవేక్షణ సిబ్బంది శూన్యం

● 16 మందికి గాను విధుల్లో ఒక్కరే ఏఈ

● వెలిగొండ ప్రాజెక్టు దోర్నాల డివిజన్‌లో దుస్థితి

మార్కాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రకాశంలో తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారంగా భావిస్తున్న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసే ప్రక్రియ నేటికీ నత్తనడకనే నడుస్తోంది. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం ఇదిగో, అదిగో అంటూ కాలయాపన చేసింది. చివరికి ఎన్నికలకు ముందు ప్రాజెక్టు పనులు కీలకమైనవి పెండింగ్‌లో ఉండగానే ప్రజల్ని మోసంచేస్తూ జాతికి అంకితమంటూ అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఈ ప్రాంత ప్రజల్ని వంచించాడు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లా డుతూ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని తప్పక తానే పూర్తిచేసి ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఈ ప్రభుత్వంపై పశ్చిమప్రాంత ప్రజలు గంపెడాశలు



వెలిగొండ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన దోర్నాలలోని టన్నెల్-2

పెట్టుకున్నారు. మూడు మాసాల క్రితం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంత్రుల బృందం పర్యటించి ప్రాజెక్టును పరిశీలించింది. చాలావరకు లోపాలను గుర్తించారు. ప్రభుత్వానికి ప్రాజెక్టు పరిస్థితిపై నివేదిక ఇచ్చారు. కానీ ఆ తర్వాత ఏ స్థాయి నాయకులు, అధికారులు ప్రాజెక్టు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. వాస్తవానికి ప్రాజెక్టులో అత్యంత కీలకమైనవి రెండు టన్నెల్ పనులు. ప్యాకేజీ-1లో ఈ పనులు ఉన్నాయి. ప్యాకేజీ-1లో ఏఈల కొరత వేధిస్తున్నా జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో పోలవరం తర్వాత అత్యంత ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టు వెలిగొండే అయినా సిబ్బంది కొరతపై దృష్టిపెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### 16 మందికిగాను ఒక్కరే విధుల్లో..

వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి ప్యాకేజీ-1లో 16 మంది ఏఈలు ఉండాలి. వీరిలో గతంలో సగానికిపైగానే ఉన్నా , కొంత మంది నీటిపారుదలశాఖకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఒక్క ఏఈ మాత్రమే ఇక్కడ విదుల్లో ఉన్నారు. అదేవిధంగా మార్కాపురం డివిజన్ పరిధిలో 16 మందికిగాను ఆరుగురు, కంభం డివిజన్ పరిధిలో 16 మందికిగాను ఐదుగురు ఏఈలు మాత్రమే ఉన్నారు. వాస్తవానికి మార్కాపురం, కంభం డివిజన్ల పరిధిలో పనులు నామమాత్రంగానే జరుగు తున్నాయి. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన దోర్నాల డివిజన్ పరిధిలోనే సిబ్బంది ఉండాల్సి ఉంది. ప్రాజెక్టును పర్యవేక్షించే జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ఈ విషయంపై దృష్టి సారించడం లేదు. వచ్చే వార్షిక బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుకు నిధులు కేటాయించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అందులోనూ టన్నెల్స్ పనులకే ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించే ఏఈల ఖాళీలను భర్తీ చేస్తేనే పనులు ముందుకు సాగుతాయి. తాత్కాలి కంగా అయినా మార్కాపురం, కంభం డివిజన్ల పరిధిలోని సిబ్బందిని అయినా దోర్నాల డివిజన్‌కు పంపితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అయితే క్షేత్రస్థాయిలో ఏఈలు పర్యవేక్షణ లేకపోగా, డీఈ, ఈఈ స్థాయి అధికారులు కనీసం ఫోన్లకు కూడా అందుబాటులో లేరు. ఇక మార్కాపురంలోని రాయవరం వద్ద ఉన్న వెలిగొండ ప్రాజెక్టు కార్యాలయాన్ని ఉన్నతాధికారులు కూడా తొంగిచూస్తున్న దాఖలాలు లేవు.

## భళా బాలోత్సవం

● అలరించిన చిన్నారుల ప్రదర్శనలు

● ఆకట్టుకున్న వేషధారణలు, నృత్యాలు



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బాలోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఒంగోలు నగరం పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రకాశంపంతులు వేదికపై వివిధ పాఠశాలలు, డాన్స్ అకాడమీలకు చెందిన చిన్నారులు తమ నృత్యాలు, వేషధారణలు, ఏకపాత్రాభినయాలతో ఆకట్టుకున్నారు. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే విధంగా రైతు వేషధారణలతో 10 మంది చిన్నారులు ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్‌లో పాల్గొని కనువిందు చేశారు. అదేవిధంగా వేదశ్రీ పబ్లిక్ స్కూలు, సాయి నాట్య కళాభారతి, నళినీ ప్రియ కూచిపూడి నృత్యనికేతన్‌లకు చెందిన పలువురు చిన్నారులు పలుకే బంగారమాయనా, విజయగణపతి, గాజులు తెచ్చే మామయ్య, ఇది మన భారతదేశం వంటి గీతాలకు చక్కటి నృత్యాభినయాన్ని ప్రదర్శించారు. ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్‌లో లేఖిత ప్రథమ బహుమతిని, సిద్ధార్థ కౌశిల్ ద్వితీయ, చైత్రశ్రీ తృతీయ బహుమతిని పొందినట్లు నిర్వాహకులు ప్రకటించారు. బాలోత్సవం నిర్వహణ కమిటీ అధ్యక్షులు బండారు లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, భాస్కర్, మాల్యాద్రి, సుబ్రహ్మణ్యం, దామా శ్రీనివాసరావు, రాంబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 4 వేల మంది విద్యార్థులతో 54 అకడమిక్, సాంస్కృతిక ఈవెంట్లు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.



బాలోత్సవంలో బుర్రకథ చెబుతున్న చిన్నారులు



భవ్యశ్రీ నృత్య ప్రదర్శన

## ఎస్టీలపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

● బాధితులకు ప్రజాసంఘాల పరామర్శ

చీమకుర్తి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బక్కిరెడ్డిపాలెంకు చెందిన ఎస్టీ మహిళలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు శనివారం డిమాండ్ చేశారు. చీమకుర్తి సీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్న బాధితులు వెంకటేశ్వరి, దుర్గ, సుబ్బాయమ్మలను ప్రజాసంఘాలతో ఏర్పాటైన నిజనిర్ధారణ కమిటీ సభ్యులు పరామర్శించారు. దాడికి గల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధితులపై దాడి చేసిన వారు ఎదురుకేసులు పెట్టటం సరికాదన్నారు. నిష్పాక్షికంగా విచారణ జరిపి ఎస్టీలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పేరం శ్రీనివాసరావు, పేరం సత్యం, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, ఆరెతోటి రాంబాబు, పిన్నిక శ్రీనివాసరావు, చింతలపాలెం యలమందబాబు, ఇస్తర్ల శంకర్, జంగాల కోటేశ్వరరావు, బత్తుల మల్లిఖార్జునరావు, తొట్టెంపూడి రామారావు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఎస్టీ మహిళలపై దాడి చేసిన సంఘటనలో బక్కిరెడ్డిపాలెంకు చెందిన ముగ్గురు మహిళలపై శనివారం పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఎస్టీ మహిళలు ఇద్దరిపై మరోవర్గం మహిళలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. డీఎస్పీ విచారణ అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ సుబ్బారావు తెలిపారు.



బాధిత మహిళలను పరామర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

## 'తోటపల్లి'కి ఘన సన్మానం

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడుగా ఎన్నికైన తోటపల్లి శ్రీనివాసరావును జిల్లా వ్యవసాయధికారులు, ఉద్యోగులు శనివారం ఘనంగా సన్మానించారు. ఒంగోలులోని వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తోటపల్లిని అభినందించడంతోపాటు, ఆయన ఆధ్వర్యంలో విస్తరణాధికారుల సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ సందర్భంగా తోటపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకముంచి యూనియన్ రాష్ట్ర సహాధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. సంఘ బలోపేతానికి కృషి చేయడంతోపాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ యిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రమణయ్య, శివ గంగప్రసాద్, ఎన్జీవో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.శరత్‌బాబు, కృష్ణారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లి శ్రీనివాసరావును అభినందిస్తున్న ఉద్యోగులు

## విద్యతోనే ఉన్నతస్థాయికి మహిళలు

మార్టూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళలు విద్యావంతులుగా ఎదగాలని, తద్వారా వారు అన్నిరంగాల్లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ అన్నారు. శనివారం మార్టూరులో శ్రీహర్షిణి విద్యాసంస్థల ప్రాంగణంలో ద్వితీయ ఇంటర్, డిగ్రీ ఫైనల్, 10 వతరగతి విద్యా ర్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా చదువు, కోర్సుల్లో ఎన్నో మార్పులు వస్తున్నాయన్నారు. దానికి అనుగుణంగా విద్యార్థులు వారి లక్ష్యాలకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, సతీష్, నాగూర్‌వలి, విజయభాస్కర్, బోసుబాబు, బెంజిమన్ పాల్గొన్నారు.

## మద్రాసు మత్స్యకారులపై ఫిర్యాదు

**హోంమంత్రికి సమస్యను వివరించిన వాడరేవు బాధితులు**

**విచారణ చేస్తామని హామీ**

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మద్రాసు తీరం నుంచి తెలుగు రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడి ట్రావలర్ బోట్లతో వేట చేస్తున్నారని బాపట్ల జిల్లా చీరాల పరిధిలోని వాడరేవు సముద్రతీర మత్స్యకారులు హోం మంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం హోం మంత్రిని మర్యాద పూర్వకంగా మత్స్యకారులు కలిశారు. ఈసందర్భంగా వారు ట్రావలర్ బోట్లతో వేట సాగిస్తున్న ఫొటోలను హోం మం త్రికి అందజేశారు. అంతేకాకుండా తెలుగు రాష్ట్ర మత్స్యకారులపై మద్రాసు మత్స్యకారులు దాడులకు తెగబడి, వలలు లాక్కుంటున్నారని వివరించారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హోం మంత్రి అనిత హామీ ఇచ్చా రు. హోం మంత్రిని కలిసిన వారిలో వాడరేవు మత్స్యకార అభివృద్ధి సంఘం ఉపాధ్యక్షుడు యజ్జల బాబ్జీ, సెక్రటరీ కోడా రవి తదితర మత్స్యకారులు ఉన్నారు.



## జీజీహెచ్‌లో కంగారు మదర్ కేర్ సెంటర్

● కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లో త్వరలోనే కంగారు మదర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారీయా పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని గైనిక్ వార్డులను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే కనిగిరిలో కంగారు మదర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశామని, అలాగే జిల్లా కేంద్రమైన ఒంగోలులోని జీజీహెచ్‌లో ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లు, చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా వార్డులను పరిశీలించిన కలెక్టర్, బెడ్‌లు, బ్రాండింగ్ తదితర మౌలిక సదుపాయాలు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రెండు నెలల క్రితం జీజీహెచ్‌ను తనిఖీ చేసిన సమయంలో ఆదేశించిన పలు అంశాలకు సంబధించి చర్యలు తీసుకోవడంపై వారిని అభినందించారు. కార్యక్రమంలో ఏవో అద్దయ్య, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సంధ్యారాణి, చీమకుర్తి సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవీలత, డాక్టర్ సూరిబాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సంపూర్ణమ్మ, ఎన్టీఆర్ ట్రస్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

## జగనన్న లేఅవుట్లలో భూముల విక్రయంపై విచారణ

సంతనూతలపాడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):సంతనూతలపాడు-1 సచివాలయం పరిధిలో రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు, ఫిర్యాదుల్లో భాగంగా జగనన్న లేఅవుట్లకు భూములను విక్రయించిన రైతులను శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారించారు. రెండు టీములుగా విడిపోయి విచారణను నిర్వహించారు. భూమి విక్రయానికి సంబంధించి నగదు పూర్తిస్థాయిలో అందిందా లేక మధ్యవర్తులు ఎవరైనా తీసుకున్నారా అనేది విచారించారు. భూములు విక్రయిస్తే వచ్చిన నగదు దేనికి వినియోగించారో వాటికి సంబంధించి పూర్తి వివరాలను రైతుల వద్ద నుంచి సేకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు

మద్దిపాడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఓ యువకునిపై పోక్సో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామయ్య తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు నగరం నేతాజీకాలనీకి చెందిన మాగంటి గోపీ పుల్కా పాయింట్‌లో పనిచేస్తూ ఓ బాలికకు మాయమాటలు చెప్పి మభ్య పెట్టి లోబర్చుకున్నాడు. ఈ నెల 9వ తేదీన బాలికను తీసుకుని వెళ్లిపోయాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివరామయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా కృష్ణాజిల్లా నూజివీడు వెళ్లినట్లు గుర్తించిన పోలీసులు బాలికను, యువకుడిని మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. బాలికను శారీరకంగా వేధింపులకు గురిచేశారని నిర్ధారించారు. దీంతో గోపీపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆగిఉన్న కంటైనర్‌ను ఢీకొన్న బైక్

● ముగ్గురికి గాయాలు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఆగివున్న కంటైనర్‌ను బైక్ ఢీకొనడంతో ముగ్గురు కుటుంబసభ్యులకు గాయాలు అయ్యాయి. ఈ సంఘటన శనివారం ఒంగోలులోని మంగమ్మకాలేజీ సమీపంలో జరిగింది. గుంటూరు జిల్లా కాకుమాను మండలం డీకేపాలెంనకు చెందిన తిరువీధుల వీరాస్వామి, ఆయన భార్య దుర్గాభవాని, కుమార్తె లహరి బైక్‌పై కొండపి మండలం అనకర్లపూడిలోని తమ బంధువుల ఇంటికి వెళ్లారు. వారు తిరుగు ప్రయాణంలో ఒంగోలులో ఆగివున్న కంటైనర్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు కాగా క్షతగాత్రులను పోలీసులు ఆసుపత్రికి తరలించారు. అయితే దుర్గాభవాని పరిస్థితి విషయంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలిస్తున్నారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వృద్ధురాలు ఆత్మహత్య

జరుగుమల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వావిలేటిపాడు గ్రామానికి చెందిన గవదగట్ల సుబ్బమ్మ(79) అనే వృద్ధురాలు ఆరోగ్యం బాగా లేక శనివారం పురుగుమందు తాగి గ్రామంలోని పోలేరమ్మ గుడి వద్ద బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబసభ్యులు గుర్తించి ఆమెను ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, అక్కడ వైద్య సాయం పొందుతూ మరణించిందని ఎస్సై బి. మహేంద్ర తెలిపారు.

## రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

బల్లికురవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళుతున్న రెండు మోటార్ బైకులు ఢీకొనడంతో ఇద్దరు గాయాలయ్యాయి. ఈఘటన శనివారం బల్లికురవ గ్రామంలో జరిగింది. అందిన సమాచారం మేరకు బల్లికురవ ఎస్సీ కాలనీకి చెందిన బొంతా శ్యాంబాబు సెంటర్‌కు వచ్చి బైకుపై ఇంటికి వెళుతుండగా, అంబడిపూడి నుంచి బల్లికురవ వస్తున్న అఖిల్ బైకు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో శ్యాంబాబు కాలు నుజ్జునుజ్జయి తీవ్రంగా గాయపడ్డాడు, మరో బైకుపై ఉన్న అఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

# కందుకూరును ప్రకాశంలో కలుపుతాం..

- అందుకు సమయం ఉంది!
- రామాయపట్నం టౌన్ షిప్‌నకు సహకరించండి
- సీఎం చంద్రబాబు
- వినూత్న రీతిలో సాగిన కందుకూరు పర్యటన

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

'కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశంలో కలుపుతామని గతంలో హామీ ఇచ్చిన మాట వాస్తవం. దాన్ని నిలబెట్టుకుంటాం. కానీ అందుకు కొంత కాలం పడుతుంది. తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కందుకూరులో శనివారం ఆయన చంద్రబాబు పర్యటన వినూత్నంగా సాగింది. భారీ సభలు, ఆర్భాటాలు, హంగులు లేకుండా జరిగింది. హామీల విషయంలో కూడా ఆయన ఆచితూచి మాట్లాడడం కనిపించింది. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు కందుకూరు చేరుకున్న ఆయన మునిసిపాలిటీ పరిధిలోని దూబగుంటలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ ఒక గ్రామంలోని గృహస్థుడితో మాట్లాడడంలోనూ ప్రత్యేకతను చూపించారు. తన రాక సందర్భంగా అప్పటికప్పుడు గ్రామాన్ని శుభ్రం చేశారా? అన్న విషయాన్ని ప్రజల ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేశారు. గ్రామంలో విద్యార్థులు ప్రత్యేకించి నిరుద్యోగులు, ఉద్యోగులు తారసపడితే తగిన సమయాన్ని ఇచ్చి వారి అభిప్రాయాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. సుమారు 2 గంటలపాటు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించిన ఆయన.. ఆతర్వాత 2 గంటలపాటు ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ఆ సందర్భంగా భారీగా జనసమీకరణకు ప్రాధాన్యం ఇవ్వలేదు. కేవలం 1,200 మంది కూర్చునే విధంగా అధికారులు వేదికను ఏర్పాటు చేయగా వారితో ముఖాముఖి నిర్వహించాలని సీఎం భావించారు. ఆవరణ మొత్తాన్ని పరిశీలిస్తే ఆరేడు వేల మంది అభిమానులు కనిపించారు. తన ప్రసంగానికే ప్రాధాన్యం ఇవ్వకుండా కార్యక్రమానికి వచ్చిన విద్యాధికులు, ఎన్జీవోలు, ప్రజలు, ఇతర ప్రముఖులు చెప్పే అంశాలను వినేందుకు ఆయన 45 నిమిషాలు కేటాయించారు.

### హామీల విషయంలోనూ అంతే

గతంలో ఎడాపెడా హామీలు ఇచ్చే సీఎం చంద్రబాబు ఈ పర్యాయం ఫుల్‌స్టాప్ పెట్టారు. ఇవ్వాలనుకున్న వాటిని సూటిగా ఇచ్చారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కొన్ని సమస్యలను ప్రస్తావించారు. సీఎం మాత్రం మూడు అంశాలకే ప్రాధాన్యం ఇచ్చారు. కందుకూరు పట్టణాభివృద్ధికి రూ.50 కోట్ల మంజూరుకు హామీ ఇచ్చారు. వాటిని కూడా దశలవారీగా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కందుకూరు, కనిగిరి రహదారి అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇచ్చారు.



కందుకూరు జరిగిన ముఖాముఖిలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



కందుకూరులో సమస్యలను చంద్రబాబుకు వివరిస్తున్న మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసులు

రామయపట్నం పోర్టు విషయాన్ని ప్రస్తావిస్తూ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు సహకరించాలని రైతులను కోరారు. రామాయపట్నం వద్ద టౌన్‌షిప్ ఏర్పాటు గురించి ఆలోచిస్తున్నామని, భూసేకరణకు రైతులు సహకరిస్తేనే అది సాధ్యమని స్పష్టంగా చెప్పారు. మరికొన్ని సమస్యలను ఎమ్మెల్యే ఎంపీలు ప్రస్తావించినా గతంలో వలే వెంటనే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇవ్వలేదు. కొన్ని సమస్యలపై స్పష్టమైన హామీలు ఇవ్వడం సాధారణ ప్రజానీకంలో చర్చనీయాంశమైంది.

## ఒంగోలుకు వస్తా.. స్వచ్ఛాంధ్ర అమలును చూస్తా..

- ఎమ్మెల్యే దామచర్లతో సీఎం చంద్రబాబు
- చుక్కలు చూపుతున్నావ్ అంటూ ఉగ్రపై చలోక్తులు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

చుక్కలు చూపుతున్నావ్‌గా అంటూ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిపై ముఖ్యమంత్రి చంద్రబాబు చలోక్తులు వేశారు. ఒంగోలుకు ఆకస్మికంగా వస్తానని, స్వచ్ఛాంధ్ర అమలును చూస్తానని ఎమ్మెల్యే దామచర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎవరి నియోజకవర్గాల్లో వారు ఉండి పనిచేయండి.. నేను వస్తున్నానని పరుగున ఇతర ప్రాంతాలకు రావద్దు అని జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం ఉమ్మడి జిల్లా పరిధిలోని కందుకూరు నియోజకవర్గానికి చంద్రబాబు వచ్చారు. మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిసేందుకు జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, పార్టీ శాసనసభ్యులు, ఇన్‌చార్జులు వెళ్లారు. తొలుత మంత్రి స్వామిని చూడగానే.. 'అదేంటి ఇక్కడ దాకా వచ్చారు. మీరు కార్యక్రమం చేశారా?' అని సీఎం ప్రశ్నించినట్లు తెలిసింది. ఉదయాన్నే మా నియోజకవర్గంలో కార్యక్రమాన్ని పూర్తిచేశామని, ఇక్కడకు 20 కిలోమీటర్లు కావడంతో వచ్చానని మంత్రి సమాధానం ఇచ్చారు. ఆతర్వాత జనార్దన్‌ను పలుకరించారు. ఆయనతో కొద్దిసేపు మాట్లాడారు.

ఆ సందర్భంగా సీఎం.. 'ఒంగోలుకు ఆకస్మికంగా వస్తా. స్వచ్ఛాంధ్ర అమలును చూశాక మాట్లాడుతా' అని వ్యాఖ్యానించారు. జనార్దన్ కల్పించుకుని ఆరు నెలల తర్వాత రండి ఈలోపు ఒంగోలు రూపురేఖలు మారుస్తానని చెప్పారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ చుక్కలు చూపిస్తున్నావని కామెంట్ చేశారు. ఉగ్ర సమాధానం ఇస్తూ కందుకూరు-కనిగిరి రహదారి అభివృద్ధి గురించి మరోసారి మీ దృష్టికి తీసుకువచ్చేందుకు వచ్చానని చాకచక్యంగా వ్యవహరించారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్యను ఉద్దేశించి ఎందుకు ఇంత దూరం వచ్చారని ప్రశ్నించగా మా స్వగ్రామం ఇక్కడికి దగ్గరేనని, మిమ్మల్ని ఒకసారి కలిసి వెళ్దామని వచ్చానని చెప్పారు. బదులుగా సీఎం మాట్లాడుతూ ప్రస్తుతం మీకు చీరాలే స్వగ్రామమని, అక్కడే మొత్తం సమయాన్ని కేటాయించండని అన్నట్లు తెలిసింది. ఇలా జిల్లా నుంచి మర్యాదపూర్వకంగా కలిసేందుకు వెళ్లిన టీడీపీ ప్రజాప్రతినిధులతో చంద్రబాబు మీ నియోజకవర్గాల్లో కార్యక్రమాలను వదిలి రావొద్దని చెబుతూనే చలోక్తులు విసిరారు.

కందుకూరు వెళ్లి సీఎంను కలిసిన వారిలో మార్కాపురం, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, వై.పాలెం ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ఉన్నారు.

## ఉత్సాహంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర



కనిగిరిలోని బాలికల హాస్టల్ ప్రాంగణంలో చెత్తను శుభ్రం చేసి ఓ చోట కుప్పగా పోస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, ఇతర ప్రజాప్రతినిధులు



దర్శిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మి



ఒంగోలులో అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, మేయర్ సుజాత

జిల్లాలో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో చీపుర్లుపట్టి రోడ్డు ఊడ్చారు. పలు చోట్ల విద్యార్థులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. అనంతరం రోడ్లను, పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు.



మార్కాపురం 15వ వార్డులో మురుగు కాలువలను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, కమిషనర్ నారాయణరావు తదితరులు



ఎర్రగొండపాలెంలో రోడ్డును ఊడుస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, నేతలు

## మద్యానికి బానిసై .. ఆపై ఉన్మాదిగా మారి..

**తల్లిపైనా వేధింపులు**

**మిగిలిన కుమారులతో కలిసి హత్య**

**శ్యాంప్రసాద్ మర్డర్ కేసులో కీలక విషయాలు వెల్లడి**





హత్య జరిగిన ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ నాగరాజు (ఇన్‌సెట్లో) హత్యకు గురైన శ్యాంప్రసాద్ (ఫైల్)

కంభం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కంభం పట్టణంలో సంచలనం సృష్టించిన శ్యాంప్రసాద్ హత్య కేసులో వ్యసనమే కారణమని పోలీసుల విచారణలో తేలింది. మృతుడు శ్యాంప్రసాద్ మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతూ, దొంగతనాలు చేస్తూ ఉండేవాడని పోలీసులు పేర్కొంటున్నారు. దీంతోపాటు పిన్ని వరసయ్యే ఓ మహిళతో, తల్లితోనూ అనుచితంగా ప్రవర్తిస్తుండడంతో మిగిలిన కుమారులతో కలిసి తల్లి హత్య చేయించినట్లు పోలీసులు వివరించారు. పట్టణంలోని తెలుగువీధిలో నివసిస్తున్న కదం శ్యాంప్రసాద్ (34)ను ముక్కలుగా నరికి 3 ప్లాస్టిక్ సంచుల్లో చుట్టి ఇరిగేషన్ కాలువ పక్కన పడవేసిన విషయం విదితమే. ఈ ఘటనలో శ్యాంప్రసాద్‌ను కుటుంబసభ్యులే దారుణంగా హత్య చేశారని తెలుసుకున్న పోలీసులు, ప్రజలు ఆశ్చర్యపోయారు.

కదం సుబ్బారావు, లక్ష్మీదేవిలకు నలుగురు కుమారులు. సుబ్బారావు 10 సంవత్సరాల క్రితం మృతిచెందాడు. తల్లి లక్ష్మీదేవి నలుగురు కుమారులను పోషిస్తోంది. గేదెలను మేపుతూ, పాలు అమ్ముతూ కొడుకులను పెంచింది. కొడుకుల పెంపకంపై సరిగ్గా దృష్టి పెట్టకపోవడంతో వారు ఇరుగుపొరుగు వారితో తరచూ గొడవలకు దిగుతుండేవారు. దీంతో ఆ కుటుంబానికి చుట్టుపక్కల వారు దూరంగా ఉంటున్నారు. నలుగురు కుమారుల్లో సుబ్రహ్మణ్యం, కాశి, మృతుడు శ్యాంప్రసాద్, రఘు చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. ఎప్పుడూ మద్యం సేవించడం, గొడవలు పడడం చేసేవారు. ఈ నేపథ్యంలోనే రఘు సంవత్సరం క్రితం ఇల్లు విడిచి వెళ్లాడు. మిగిలిన ముగ్గురు తల్లితో కలిసి ఉంటున్నారు.

హత్యకు గురైన శ్యాంప్రసాద్ లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. ఆ వచ్చిన డబ్బుతో మద్యం సేవించేవాడు. డబ్బులు లేనపుడు చిల్లర దొంగతనాలు చేసేవాడు. పలుమార్లు పట్టుబడి దెబ్బలు తిన్నాడు. ఇక తాగిన మైకంలో మహిళలను వేధించేవాడు. ఇటీవల నర్సరావుపేటలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లి పిన్ని వరుస అయిన మహిళపై అత్యాచారానికి యత్నించాడు. దీంతో కుటుంబసభ్యులు దేహశుద్ధి చేసి పంపించినట్లు తెలిసింది.

ఏడాది కాలంగా మద్యం కోసం తల్లిని వేధించడమేకాక ఆమెపట్ల కూడా అసభ్యంగా ప్రవర్తించేవాడు. రానురాను శ్యాంప్రసాద్ ఆగడాలు ఎక్కువ కావడంతో అడ్డు తొలగించు కోవాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నారు. ఇందుకోసం తల్లి తన ఇద్దరు కుమారులు సుబ్రహ్మణ్యం, కాశీలతో పాటు ఆటోడ్రైవర్ మోహన్ అనే వ్యక్తిని తోడు తెచ్చుకున్నారు. నలుగురు కలిసి శ్యాంప్రసాద్ హత్యకు ప్రణాళిక రచించారు. బుధవారం రాత్రి తాగి ఇంటికి వచ్చిన శ్యాంప్రసాద్‌పై దాడిచేసి చంపారు. గురువారం పగలంతా మృతదేహాన్ని ఇంట్లోనే దాచారు. మృతదేహాన్ని దూరంగా పడవేయాలని తొలుత ప్రయత్నించారు. అయితే ఆ యత్నం ఫలించలేదు. దీంతో గురువారం రాత్రి ఇంటి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో మృతదేహాన్ని ముక్కలుగా నరికారు. తల, మొండెం ఒక సంచిలో, కాళ్లు, చేతులు మరో రెండు సంచులలో ఉంచారు. ఇంటికి సమీపంలోని నక్కల గండి కాలువ గట్టుపై పడవేసి వచ్చారు. శుక్రవారం ఉదయం కాలువగట్టుపై మృతదేహం శరీర భాగాలు ఉన్న విషయం వెలుగు చూడడంతో పాటు పోలీసుల దృష్టికి వెళ్లింది. దీంతో కంభం సీఐ మల్లికార్జునరావు, ఎస్సై నరసింహారావులు ఘటనా స్థలానికి వచ్చారు. కుటుంబసభ్యులను వారిదైన శైలిలో విచారించారు. దీంతో ఈ హత్య తామే చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. డీఎస్పీ నాగరాజు, సీఐ, ఎస్సై హత్య జరిగిన ప్రాంతాన్ని, మృతదేహం భాగాలను పరిశీలించారు. శనివారం మధ్యాహ్నం ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు.



సంఘటనా స్థలం వద్దే పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
## పంట కాలువ, అనధికార వెంచర్ల పరిశీలన

మార్కాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల సమీపంలో 889 సర్వే నెంబర్‌లో వేసిన అనధికార వెంచర్‌ను, పంటకాలువపై అనుమతులు లేకుండా జరుగుతున్న ఆధునీకీకరణ పనులను శనివారం సాయంత్రం మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. 'పంట కాలువకు ప్రైవేటు సోకులు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి రెండు శాఖల అధికారులు స్పందించారు. ముందుగా ఇరిగేషన్ డీఈ పోలురాజు సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి కాలువను తనిఖీ చేశారు. కాలువపై ఎలాంటి అనుమతులు లేకుండా జరుగుతున్న లైనింగ్ పనులను గమనించారు. సిబ్బందితో కొలతలు వేయించి ఇరిగేషన్ ఉన్నతాధికారులకు నివేదిస్తానని డీఈ పోలురాజు తెలిపారు. అదేవిధంగా ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన వెంచర్‌ను మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. అక్కడ హద్దురాళ్లు పాతి ఉండటాన్ని గమనించారు. వెంచర్ వేసిన వారిని పిలిచి మాట్లాడారు. వెంటనే రాళ్లు తొలగించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్కడే ఉన్న కార్మికులతో వెంచర్ కోసం వేసిన రాళ్లను తొలగించారు. పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా రియల్ వెంచర్‌లు వేస్తే సహించేదిలేదని కమిషనర్ నారాయణరావు హెచ్చరించారు.





పంట కాలువ, అనధికార వెంచర్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ నారాయణరావు, ఇరిగేషన్ డీఈ పోలురాజు (ఇన్‌సెట్లో) అనధికార వెంచర్‌లో రాళ్లు తొలగిస్తున్న కార్మికులు

# దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని, సత్వరమే స్పందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించాలని ఆమె కోరారు. గ్రీవెన్స్‌లో 60 మంది దివ్యాంగులు తమ సమస్యలపై అర్జీలను సమర్పించారని చెప్పారు. అందువల్ల వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారికి ప్రభుత్వపరంగా అందాల్సిన అన్ని సౌకర్యాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, విభిన్నప్రతిభావంతులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అన్సారియా

# అంగన్‌వాడీల వేతనాలను పెంచాలి

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల వేతనాలను పెంచాలని, గ్రాడ్యుటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తూ జీవో విడుదల చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. శనివారం ఒంగోలులో సీడీపీవో రాజకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు వేతనాలు పెరగలేదన్నారు. గత ఏడాదిలో వేతనాల పెంపు కోరుతూ 42 రోజులు అంగన్వాడీలు సమ్మె చేయగా వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 17వ తేదీన ప్రాజెక్టు కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు నెల వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఒంగోలు ప్రాజెక్టు కార్యదర్శి కె.ఎమీమా తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

మంత్రి డాక్టర్ స్వామి

కలెక్టర్ అన్సారియాతో కలిసి ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపనలు

కొండపి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర సాధనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఈ కార్యక్రమంలో ప్రజలు కూడా భాగస్వాములై పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. రాష్ట్ర వ్యాప్త ప్రారంభ కార్యక్రమంలో భాగంగా శనివారం పెదకండ్లగుంట గ్రామ పంచాయతీలోని జాళ్లపాలెంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులతో మంత్రి కలిసి ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి స్వామి మాట్లాడుతూ అపరిశుభ్రత వల్ల రోగాలు ప్రబలుతున్నాయన్న విషయం తెలుసుకోవాలన్నారు. ఇళ్లలోని నీరు రోడ్లపైకి చేరి దోమలు వృద్ధి చెంది ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం జాళ్లపాలేనికి తొలివిడతలో 150 ఇంకుడు గుంతలు మంజూరు చేసిందన్నారు. వీటి తవ్వకం వల్ల నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరగడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని తెలిపారు. ప్రజలు భాగస్వాములై, ఇంకుడు గుంతలు ప్రతి ఇంటికీ నిర్మించుకోవాలని చెప్పారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ గ్రామాలు స్వచ్ఛంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. జాళ్లపాలెం జిల్లాకే ఆదర్శంగా నిలవాలన్నారు.

**రోడ్లు ఊడ్చి స్ఫూర్తి నింపిన మంత్రి, కలెక్టర్**

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా జాళ్లపాలెంలోని పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లను ఊడ్చి గ్రామస్థులలో స్ఫూర్తిని నింపారు. గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలు ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమిపూజ చేసి, ఇంకుడు గుంతల్లో మట్టిపోశారు. రెండు డ్వాక్రా సంఘాలకు మూడు లక్షల రూపాయల చొప్పున మంజూరైన చెక్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, డీపీవో జి.వెంకటనాయుడు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జడ్పీ సీఈవో చిరంజీవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకర్‌రావు, డీఎల్‌పీవో పద్మ, ఎంపీడీవో రామాంజనేయులు, తహసీల్దార్ పి. మురళి, పెద్దకండ్లగుంట మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**స్వచ్ఛాంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే దామచర్ల**

ఒంగోలు కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్రలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. శనివారం ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడమే కాకుండా నగర సుందరీకరణకు సహకరించాలని కోరారు. ప్రత్యేకించి వ్యర్థాలను రోడ్లపై వేయకుండా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్తకుండీలలో వేయాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ స్వచ్ఛనగరంగా తీర్చి దిద్దడం కోసం సమష్టిగా పనిచేయాలన్నారు. కమిషనరు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛ నగరాలలో ఒంగోలును మొదటిస్థానంలో నిలిపేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రహరీలపై పోస్టర్లు అంటించవద్దని తెలిపారు. ఇళ్ళలోని చెత్తను చెత్త సేకరణ ఆటోలలోనే వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈ చెంచయ్య, ఏసీపీ సుధాకర్, శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి, టీడీపీ నాయకులు కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, కార్పొరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంకుడుగుంతలో మట్టిని పోస్తున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా



ఒంగోలులో ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

**దేవాలయాల్లో...**



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న అర్చకులు

స్వచ్ఛ ఆలయాల సాధన కోసం పురోహితులు చీపురు పట్టి స్వచ్ఛత కోసం శ్రీకారం పలికారు. ఈ మేరకు శనివారం స్థానిక కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ రాజరాజేశ్వరీస్వామి దేవస్థానంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. దేవాలయ ఈవో బోడపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, టీడీపీ నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, కార్పొరేటర్ అంబూరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కొత్తపట్నంరోడ్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ప్రభుత్వ కార్యాలయాల్లో..**

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండల పరిషత్ కార్యాలయం, ఉద్యానశాఖ కార్యాలయాల ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజశేఖరరావు మాట్లాడుతూ పరిశుభ్ర వాతావరణం కోసం అందరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ బాలచెన్నయ్య, ఏవో శేషబాబు తదతరులు పాల్గొన్నారు.

**జిల్లా గ్రంథాలయంలో..**

ఒంగోలు కల్చరల్: స్థానిక జిల్లా గ్రంథాలయంలో శనివారం ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. పుస్తకాలను క్రమపద్ధతిలో అమర్చారు. కార్యక్రమంలో కె.సంపూర్ణమ్మ, పి.ఇమ్మానుయేలు, పి.దయామణి, లక్ష్మి పాల్గొన్నారు.

**సంతనూతలపాడు మండలంలో..**

సంతనూతలపాడు: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కొప్పోలు మేజర్ వద్ద ఒంగోలు నీటిసంఘం అధ్యక్షులు నల్లూరిక్రిష్ణారావు, ఒంగోలు ఎన్‌ఎస్‌పీ డిప్యూటీ ఏఈ సతీష్ అధ్వర్యంలో నీటి సంఘం అధ్యక్షులు, రైతులు, సాగర్‌కెనాల్ ఉద్యోగుల ఆధ్వర్యంలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. సంతనూతలపాడు ఎన్‌ఎస్‌పీ కార్యాలయం వద్ద ఉద్యోగులు పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే మండలంలోని మైనంపాడు, గుర్వారెడ్డిపాలెంలో ఇంకుడుగుంతలను ఎంపీడీవో సురేష్‌బాబు ప్రారంభించారు.

**ఏడుగుండ్లపాడులో..**



ఇంకుడుగుంతను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

మద్దిపాడు: స్వర్ణాంధ్ర లక్ష్యసాధనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం ఏడుగుండ్లపాడులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్‌ప్రసాద్ మాట్లాడుతూ మండలానికి 347 ఇంకుడు గుంతలు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కొక్క దానికి రూ.6 వేలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి శిల్పసౌందర్య ఏపీఎం ధనుంజయ్‌వర్మ, దాసరి రమేష్‌బాబు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో వెల్లంపల్లి నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. రాజులుమిట్ట దగ్గర ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని ఆయన ఆయన సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి బి.మాధవి, వెటర్నరీ అసిస్టెంట్ నరసింహారావు పాల్గొన్నారు.

**పాకల తీరంలో..**



తీరంలో చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

సింగరాయకొండ: పాకల పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం సముద్రతీరంలో శనివారం మూలగుంటపాడు విద్యానికేతన్ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు చెత్తను, వ్యర్థాలను తొలగించారు. బీచ్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, మెరైన్ ఇన్‌స్పెక్టర్ మస్తాన్ షరీఫ్, శ్రీవిద్యానికేతన్ హైస్కూల్ డైరెక్టర్ సైకం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలోని చెత్తను, వ్యర్థాలను తొలగించారు. సీఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్ర, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**జమ్ములపాలెంలో..**

టంగుటూరు: జమ్ములపాలెంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో దేవసేనకుమారి పాల్గొని సచివాలయ ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చీపురులు చేతబట్టి రోడ్లను శుభ్రం చేశారు. తహసీల్దార్ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి డిగ్రీ మూల్యాంకనం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయానికి సంబంధించిన మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ మూల్యాంకనం ఆదివారం ఉదయం పది గంటలకు ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రారంభమవుతుందని క్యాంప్ ఆఫీసర్ డి.కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్ సంబంధించిన అన్ని సబ్జెక్టుల పేపర్లు వచ్చాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఒంగోలు మండలం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాల అధ్యాపకులందరూ తమ యూనివర్శిటీ అపాయింట్‌మెంట్ ఐడీకార్డు, పర్సనల్ ప్రొఫైల్, కళాశాల రిలీవింగ్ తీసుకొని హాజరుకావాలన్నారు. యూనివర్శిటీకి సంబంధించిన అపాయింట్‌మెంట్ ఐడీకార్డులు తమ కళాశాలలో ఉన్నాయని, కళాశాల ప్రిన్సిపాల్ లెటర్ ద్వారా నుంచి ఐడీకార్డులు పొందాలని తెలిపారు.

## పేస్‌లో అవగాహన సదస్సు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి షేక్ సమీర్ హౌ టు గ్రూమ్ యువర్ సెల్ఫ్ ఇన్ ఐటీ సెక్టార్ అనే అంశంపై దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుత ఐటీ రంగంలో ఉన్నటువంటి సంక్షోభాన్ని ఎదుర్కొవాలంటే అవసరమైన నైపుణ్యాలను వివరించారు. ఉద్యోగ సాధనలో తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్‌లు సీవీ.సుబ్బారావు, ఆర్.వీరాంజనేయులు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎస్.గిరిబాబు, ఈవెంట్ కో ఆర్డినేటర్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్

మద్దిపాడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కొలచనకోట గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నోటీసులు ఇచ్చిన అనంతరమే రీ సర్వే చేపట్టాలని, ఎటువంటి పరిస్థితుల్లోను జాయింట్ ఎల్‌పీఎం ఇవ్వవద్దని చెప్పారు. ప్రతి రైతుకు ఒక ఎల్‌పీఎం నెంబర్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం మద్దిపాడు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశమై రీ సర్వేలలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో అలసత్వం వహించకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజన్‌కుమార్, ఆర్ఐ రమణయ్య, డిప్యూటీ తహసీల్దార్ అజయ్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఎన్ విద్యార్థులకు ఉద్యోగాలు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంగమూరు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 23 మంది ఉద్యోగాలు సాధించినట్లు ఆ కళాశాల చైర్మన్ యల్లటూరి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఆఫర్ లెటర్లను కూడా ఇచ్చినట్లు చెప్పారు. కాలేజీలో చేరిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ కల్పనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ వైసత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని కంపెనీలతో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామన్నారు. అనంతరం విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సురేందర్, సుభాని, ప్రిన్సిపాల్ టి.రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

## వాసవీ సురక్షా చెక్కు అందజేత



కృష్ణవేణికి చెక్కును అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ కుటుంబ సురక్షా పథకంలో సభ్యులైన ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కొంజేటి శంకరరావు ఇటీవల మరణించగా దాని కింద వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ సహకారంతో మంజూరైన రూ.1,13,600 చెక్కును మృతుడి భార్య కృష్ణవేణికి అందించారు. స్థానిక వాసవీ క్లబ్ కార్యాలయంలో క్లబ్ జిల్లా గవర్నర్ చుండూరి గాయత్రి చేతులమీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఉపాధ్యక్షులు కొంజేటి సురేష్‌బాబు, అమరా వేణు, పులకణం రాజా, రాఘవేంద్రరావు, కొంజేటి జలంధర్, ప్రసాద్, దేసు సుధాకర్, తెలగతోటి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల తరలింపుపై ఎమ్మెల్యేకు వినతి

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తమ ప్రాంతంలోని విజయానంద పాఠశాలను గ్రామంలోని మరో పాఠశాలలో విలీనం చేసే ప్రక్రియను నిలిపి వేయాలని బి.నిడమానూరు గ్రామస్థులు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను శనివారం ఒంగోలులో కలిసి వినతిపత్రం అందించారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే బీఎన్ పాఠశాల సమస్యను పరిశీలించాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్‌కు సిఫార్సు చేశారు.

## రీసర్వేను పారదర్శకంగా చేయాలి : కలెక్టర్

కొండపి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రీసర్వేలో తప్పులు జరగకుండా కార్యక్రమాన్ని జాగ్రత్తగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మండలంలోని చినకండ్లగుంట గ్రామ రెవెన్యూలోని సీపేటీ కండ్రిగలో రీసర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ పి. మురళి, మండల సర్వేయర్ రాజు, రీసర్వే డీటీ కాశయ్య, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటి దారి మూసేశారని వినతి

కొండపి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చోడవరానికి చెందిన చుండి గోవిందమ్మ ఇంటికి వెళ్లకుండా దారిని మూసి ఇబ్బంది పెడుతున్న గ్రామానికి చెందిన అన్నపూర్ణమ్మ, వారి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ మురళిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బాధితులతోపాటు నాయకులు ప్రభాకర్, పీఆర్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగభూషణం పాల్గొన్నారు.

## రహదారి భద్రతా నియమాలపై అవగాహన

చీమకుర్తి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రతా నియమాలపై సీఐ సుబ్బారావు శనివారం చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా బైక్ నడపకూడదని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆయన చెప్పారు. అనంతరం సీఐ స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహాన్ని సందర్శించారు. తన ఫోన్‌నంబర్‌ను అక్కడ గోడపై రాయించారు. ఏ సమస్య తలెత్తినా తనకు సమాచారం ఇవ్వాలని విద్యార్థినులకు సూచించారు.

## 'పోతుల'తో చంద్రబాబు మాటామంతీ



సీఎం చంద్రబాబుతో రామారావు

టంగుటూరు, ఫిబ్రవరి 15 ఆంధ్రజ్యోతి) : వ్యాపార నిమిత్తం విదేశాలలో ఉన్న కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు కందుకూరులో చంద్రబాబు కార్యక్రమం అని తెలిసి హుటాహుటిన శనివారం కందుకూరు చేరుకున్నారు. విదేశాల నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న రామారావుకు చంద్రబాబు నుంచి పిలుపు అందడంతో విమానంలో విజయవాడ చేరుకొని అక్కడి నుంచి కారులో కందుకూరుకు చేరుకున్నారు. సీఎం చంద్రబాబు హెలిప్యాడ్ నుంచి దిగాక అక్కడే ఉన్న రామారావును పిలిచి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగానే ఉందని, వ్యాపారంలో దృష్టిసారించానని పోతుల తెలిపారు. తనను కలవడం లేదుగా, అంతా లోకేష్‌తోనే సరిపోతున్నట్లుందిగా అని చంద్రబాబు చమత్కరించారు. త్వరలో కలుద్దాం అని చెబుతూ చంద్రబాబు అక్కడి నుంచి వేరే వారి వద్దకు వెళ్లారు.

## గ్రామాల్లో జోరుగా అభివృద్ధి పనులు : ఎంపీడీవో

సింగరాయకొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పది గ్రామాల్లో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో పలు రకాల అభివృద్ధి పనులు జోరుగా చేపట్టినట్లు ఎంపీడీవో జయమణి చెప్పారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ కట్టా శోభారాణి మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో గ్రామాల్లో నీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ రవి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో 150 గజాలలోపు గృహనిర్మాణాలు చేసుకున్న పేదల ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులు గ్రామసచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్ ఏఈ శ్రీహరి మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమం కింద 3 కోట్ల 22 లక్షల రూపాయలతో రోడ్లు, డ్రైనేజీలు, పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేసినట్లు తెలిపారు. రూరల్ అర్బన్ పథకం కింద 2కోట్ల 80 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ మాట్లాడుతూ పాతసింగరాయకొండ, మల్లికార్జుననగర్‌లో 100 అడుగుల ఓవర్ హెడ్ ట్యాంకులను రెండింటిని నిర్మించి మిగతా 5 గ్రామాలకు కూడా రామతీర్థం నీరు అందిస్తామని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యులు చైతన్యకృష్ణ మాట్లాడుతూ పీహెచ్‌సీలో సెంట్రల్ ల్యాబ్ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఎంఈవో కత్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## 23న కర్నూలులో మాలల గర్జన

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో ఈనెల 23వతేదీన జరగనున్న మాలల గర్జన సభను విజయవంతం చేయాలని మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని బీఎస్ఎన్ఎల్ సేవా కార్యాలయంలో శనివారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తే అటువంటి పార్టీలకు తగిన గుణపాఠం చెప్తామన్నారు. కార్యక్రమంలో చప్పిడి వెంగళరావు, దండేల కృష్ణ, బిళ్ళా వసంతరావు, సంపత్‌కుమార్, ఉద్యోగుల సంఘం జిల్లా చైర్మన్ యేరిచర్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# వెంకటశ్రీమన్నారాయణ సేవలు ఆదర్శనీయం

● ఆయన మృతి టీడీపీకి తీరని లోటు
● పలువురు నాయకుల సంతాపం

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండవవారిపాలెం సర్పంచ్‌గా కారుమూడి వెంకట శ్రీమన్నారాయణ గ్రామాభివృద్ధికి చేసిన సేవలు చిరకాలం నిలిచిపోతాయని పలువరు వక్తలు కొనియాడారు. శనివారం ఒంగోలు మండలం మండవవారిపాలెం గ్రామంలో మాజీ సర్పంచ్ వెంకటశ్రీమన్నారాయణ సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ మేజర్ పంచాయతీ అయిన త్రోవగుంట నుంచి విడిపోయిన మండవవారిపాలెం గ్రామానికి తొలి సర్పంచ్‌గా వెంక టశ్రీమన్నారాయణను గ్రామస్థులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. ఆయన నిస్వార్థ సేవలు గుర్తించిన గ్రామస్థులు ఆయన సతీమణి సర్పంచ్‌గా ఏకగ్రీంగా ఎన్నుకోవడం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఎన్‌జీ రంగాభవన్ కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని, రంగా భవన్ నిర్మాణం కోసం తన వంతు సహకారం అందించారని గుర్తు చేశారు. టీడీపీ నాయకుడు మండవ వెంకటరావు మాట్లాడుతూ వెంకటశ్రీమన్నారాయణ మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మండవవారిపాలెం గ్రామ పరిధిలో టీడీపీ మహానాడు నిర్వహించటానికి గ్రామస్థులతో మాట్లాడి ఒకేతాటిపైకి తెచ్చిన నేత అని చెప్పారు. సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారని తెలిపారు. సీపీఐ నాయకుడు ఉప్పుటూరి ప్రకాశరావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరితో శ్రీమన్నారాయణ మమైకం అయ్యేవారన్నారు. సీపీఐ కార్యాలయ నిర్మాణంలో ఆయన భాగస్వామ్యం అయ్యారని చెప్పారు. ముందుగా నాయకులు వెంకటశ్రీమన్నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మండవ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు నామినేని మోహనరావు, పోలవరపు సీతారామయ్య, డాక్టర్ నాదెండ్ల చంద్రశేఖరరావు, అడ్వకేట్ అజయ్‌బాబు, చిడిపోతు వెంకటేశ్వర్లు, చుండూరి రవిబాబు, రాయపాటి అంకయ్య తదితరులు పాల్గొన్నారు




మాట్లాడుతున్న ఎన్‌జీరంగా భవన్ కార్యదర్శి చుంచు శేషయ్య

# ఉద్యోగాలకు 21 మంది శ్రీహర్షిణి విద్యార్థుల ఎంపిక

● అభినందించిన చైర్మన్ రవికుమార్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 21మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నిర్వహించిన ఈ ప్రాంగణ ఎంపికలో వీరి సంవత్సర వేతనం మొదటి సంవత్సరం రూ.4.42లక్షలు, రెండో సంవత్సరం రూ.5.10లక్షలు, మూడవ సంవత్సరంలో రూ.6.10లక్షలు, నాల్గవ సంవత్సరం నుంచి బ్యాంకు మేనేజర్‌గా ఉద్యోగోన్నతులు లభిస్తాయని హెచ్‌ఆర్‌లు అంజనకుమార్, నాగార్జున తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా క్రమం తప్పకుండా కాలేజీ స్థాపించిన నాటి నుంచి డిగ్రీ విద్యార్థులకు ఇంజనీరింగ్‌తో పోటీగా ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తూ అందుకు అవసరమైన కోచింగ్‌ను కూడా డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలో ప్రముఖ మల్టీనేషనల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలైన హెచ్‌సీఎల్, క్యాప్‌జెమిని కంపెనీలతో కూడా ప్రాంగణ ఎంపికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపాల్ దాది ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు, గిరీష్, ప్రతాప్, శంకర్ పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

## గ్రామాభివృద్ధి ప్రణాళికలను అప్‌లోడ్ చేయాలి

పొన్నలూరు, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి) : పీఎంఏజీవై పథకం కింద మంజూరైన రాజోలుపాడుకు విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌ను తయారు చేసి వెంటనే ఆ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఎంపీడీవో సుజాత ఆదేశించారు. శనివారం రాజోలుపాడు ఎస్సీ కాలనీలోని ఎంపీ స్కూల్‌లో గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి మంజూరైన రూ.20 క్షల నిధులకు పనులు వెంటనే గుర్తించాలని కార్యదర్శి రవిని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగేశ్వరరావు, ఏపీవో మాచర్ల, ఏపీఎం శ్రీనివాస్, చల్లా శ్రీనివాసులు, కోయ రాంబాబు పాల్గొన్నారు. అనంతరం పెదవెంకన్నపాలెంలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రతిజ్ఞ చేయించారు.

## డీఈవో ఆకస్మిక తనిఖీ

టంగుటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మర్లపాడు జడ్పీ హైస్కూలును శనివారం డీఈవో కిరణ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. 100 రోజులు ప్రణాళికపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఆ తర్వాత డీఈవో గ్రామంలోని సీఈ పాఠశాలను సందర్శించారు. హెచ్‌ఎంలు నరసరాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## అవీ..ఇవీ

### అడవికి నిప్పు.. పర్యావరణానికి ముప్పు

● అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అడవికి నిప్పు పర్యావరణానికి ముప్పు అనే అంశంపై అవగాహన కల్పిస్తూ శనివారం అటవీశాఖ అధికారులు పోస్టర్‌ను విడుదల చేశారు. స్థానిక టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఎండాకాలం సమీపిస్తున్నందున అడవులలో ఎండుగడ్డి రాలుతుందన్నారు. ఆ సమయంలో పొరపాటున నిప్పు రాజుకుంటే గ్రామాల వరకు వ్యాపించి ప్రజలకు ప్రమాదం జరుగుతుందన్నారు. అడవిని నమ్ముకుని జీవించే వన్యప్రాణులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. వన్యప్రాణి నివారణ చట్టం కింద అడవి జంతువులను వేటాడం నేరమన్నారు. వేటాడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప అటవీశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, రేంజ్ అధికారి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

### ఘాట్ రోడ్డును విస్తరించాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు-నంద్యాల మధ్య ఉన్న ఘాట్‌రోడ్డును విస్తరించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టెమల్ల పుల్లయ్య కోరారు ఘాట్‌లోని జాతీయ రహదారిని విస్తరించి రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడాలని కేంద్ర ఉక్కు, కార్మిక శాఖల మంత్రి భూతరాజు శ్రీనివాసవర్మను కలిసి వినతిపత్రం అందచేసినట్లు పేర్కొన్నారు. గిద్దలూరు-నంద్యాల మధ్యన సగానికి పైగా ఘాట్ ఉందన్నారు. ఘాట్‌ను విస్తరించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోందన్నారు. పూర్తిస్థాయిలో రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు.

### ఫేక్‌కాల్, సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ప్రాంతాన్ని సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకున్నారని, వారి వలలో పడవద్దని అర్బన్ సీఐ కె.సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ స్టేషన్ రైటర్ అని చెప్పుకుంటూ ప్రజలను మోసం చేసే ప్రమాదం ఉందన్నారు. అలాగే మీకు ఇంటి స్థలం మంజూరైంది, నేను సంబంధిత అధికారిని మాట్లాడుతున్నానంటూ కేటుగాళ్లు సామన్య ప్రజలకు ఫోన్లు చేసి డబ్బులు వేయండి అంటూ మాట్లాడుతున్నారన్నారు. ఇటువంటి ఫోన్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసులు ఎవరూ డబ్బులు అడుగరని, ఇది సైబర్ నేరగాళ్ల పని అని తెలిపారు. ఒకవేళ మేము పోలీసులమంటూ ఎవరైనా డబ్బులు అడిగితే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ సురేష్ తెలిపారు.

### వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

● విధులకు గైర్హాజరవుతున్నారని ఫిర్యాదు

కంభం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలం యాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహించే డాక్టర్లు, సిబ్బంది తరచూ విధులకు గైరుహాజరు అవుతున్నారని రాష్ట్ర షెడ్యూలుకులాల పరిరక్షణ సంఘం అధ్యక్షులు కాటమాల చెన్నకేశవరావు డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం సాయంత్రం జిల్లా మెడికల్‌హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందచేశారు. మారుమూల ప్రాంతమైన యాచవరం పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన వైద్యశాలలో పనిచేస్తున్న వైద్యులు సక్రమంగా విధులకురావడం లేదన్నారు. గైరుహాజరయ్యే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పేదప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### క్రైస్తవ ఆస్తులలో కట్టడాలను నిలిపివేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

బేస్తవారపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట సీఎస్ఐ హైస్కూల్ పరిధిలోని ఏబీఎం కాంపౌండ్‌కు సంబంధించిన క్రైస్తవ ఆస్తుల క్రయవిక్రయాలు చేయడం నేరమని గతంలో చేసిన రిజిస్ట్రేషన్లు చెల్లవని, అందుకు కోర్టు తమనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, తెలుగు బాప్టిస్ట ఫీల్డ్ చర్చికి సంబంధించిన క్రైస్తవ సంఘం పెద్దలు శనివారం తహశీల్దార్ జీతేంద్రకు వినతిపత్రం అందజేశారు. రీసర్వే నెంబరు 41 నుంచి వనరుగా 50వరకు పూసలపాడు సర్వేనంబరు 96-1లో ఎటువంటి కట్టడాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో చిలకా చంద్రశేఖర్, గంగవరపు భాస్కర్, దయానంద్, తోటకూరి విక్టర్, చల్లగాలి జోసఫ్, కువ్వారపు శామ్యూల్, చిట్టం సైమన్ పీటర్, చల్లగాలి విక్టర్, మట్టెమల్ల రాజేంద్ర, చల్లగాలి విక్టర్, మట్టెమల్ల దానం, తదితరులు పాల్గొన్నారు.

### బంగారు బాల్యంపై అవగాహన

గిద్దలూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో బంగారు బాల్యంపై ఎంఈవో వెంకటేశ్వర్లు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల సాధికారత, వారి హక్కులను కాపాడడానికి, పిల్లలకు సురక్షితమైన సహాయక వాతావరణాన్ని కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.







స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, అధికారులు, మార్కాపురం మండలం నాయుడుపల్లిలో ఇంకుడుగుంతను ప్రారంభిస్తున్న ఎంపీడీవో, పొదిలిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు సిబ్బంది

# స్వచ్ఛ సంకల్పం విజయవంతం

● వీధులను శుభ్రం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

● ఇంకుడు గుంతల తవ్వకంపై అవగాహన

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛ దివాస్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నినాదాలు చేశారు. అనంతరం గాంధీబొమ్మ కూడలిలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సచివాలయ, మెప్మా, అధికారులు, నాయకులు మానవహారంగా ఏర్పడ్డారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి స్వచ్ఛ ఆంధ్ర మిషన్ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ లక్ష్యాలు పెట్టుకోవడమే కాదని, వాటిని ఇచ్ఛితంగా అమలు చేయాలన్నారు. గిద్దలూరు పట్టణంలో పరిశుభ్రత పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటితోపాటు బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రార్థన మందిరాలు, పరిశ్రమలు కూడా పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలలో పాఠశాల విద్యార్థి నుంచి నాయకుల వరకు బాధ్యత తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమూల మార్పులు రావలసిన అవసరం ఉందన్నారు. దీని కోసం అక్కడ పనిచేసే ఉద్యోగులు అంతా కలిసి పరిశుభ్రత, పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం పొందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, మార్తాల సుబ్బారెడ్డి, మున్సిపల్ కమీషనర్ వెంకటదాస్, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, కౌన్సిలర్లు లొక్కు రమేష్, పెద్దవలి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వై.పాలెం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం ఎర్రగొండపాలెం పట్టణంలోని ప్రధాన వీధిలో స్వర్ణఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రోడ్డును ఊడ్చి చెత్తను ఎత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకుంటే అంటువ్యాధులు దూరంగా ఉంటాయన్నారు. పంచాయతీల్లో మురుగును ప్రతి రోజు శుభ్రపరిచే గ్రీన్ అంబాసీడర్లు,పంచాయతీ కార్మికులకు మనం గౌరవించాలని అన్నారు. అనంతరం పంచాయతీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, టీడీపీ ముఖ్య నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, వేగినాటి శ్రీను, గోళ్ల సుబ్బారావు, శనగా నారాయణరెడ్డి, రెంటపల్లి సుబ్బారెడ్డి, మహేష్ నాయుడు , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : ఇంకుడు గుంతల నిర్మాణంతో పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నాయుడుపల్లి గ్రామంలో శనివారం ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంకుడు గుంత ఏర్పాటు ,చేసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇంట్లోని మరుగుదొడ్డి నీరు, కిచెన్ నుండి వచ్చే నీటిని శుద్ధి చేసి నెమ్మదిగా భూమిలోనికి ఇంకుడు గుంత చేరవేస్తుందని తెలిపారు. గృహాలలోని మురుగు నీరు బయట రోడ్ల పైకి రాకుండా ఉంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. నివాస ప్రాంతాలలో మురుగు నీరు నిల్వ లేకుండా ఉంటుందన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంకుడు గుంతను తీసుకున్నవారికి ప్రభుత్వం ఆరువేల రూపాయలు ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జీవరత్నం, వెలుగు ఏపీఎం డి.పిచ్చయ్య, సీసీ నాగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ సోలోమోన్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, వెలుగు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : సీఎం చంద్రబాబు చేపట్టిన స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ విజయవంతమే లక్ష్యంగా పనిచేస్తామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయం, సబ్‌స్టేషన్‌లో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యాక్రమంలో భాగంగా శనివారం పరిసరాలు శుభ్రం చేశారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఈ షియానాయక్, లైన్‌ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, నన్నేసా తదితరులు పాల్గొన్నారు. స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏటీవో కెనడీ, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలి, ప్రసాద్, రంగయ్య పాల్గొన్నారు.

పొదిలి : స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీడీవో గుత్తా శోభన్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని ఈగలపాడు సర్పంచ్ యర్రం సుబ్బులు అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛాంధ్రే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పనిచేస్తున్నారన్నారు. అందులో భాగంగా పట్టణంలో, మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో వీధుల్లో తిరుగుతూ పొడిచెత్త, తడిచెత్తలను వేరు చేయడంపై అవగాహన కల్పించారు. అదే విధంగా పట్టణంలో మున్సిపల్ కమీషనర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి పరిసరాలను శభ్రం చేశారు. మల్లవరం, కుంచేపల్లి, తలమళ్ళ, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : స్వచ్ఛాంధ్రప్రదేశ్ రూపకల్పనకు పాటుపడదామని ఎంపీడీవో నాసర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయినముక్కుల గ్రామంలో, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛాంధ్రప్రదేశ్, స్వర్ణాంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ విజయబాబు అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పరిసరాలు శుభ్రం చేశారు. ఆయా కార్యక్రమాల్లో అధ్యాపక సిబ్బంది, టీడీపీ నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, చంటి, తదితరులు పాల్గొన్నారు.

# నివేశన స్థలాల కోసం భూములు కేటాయించాలి

**జేసీని కోరిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి**

మార్కాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇళ్లులేని నిరుపేదలకు నివేశన స్థలాలు మంజూరు చేసేందుకు భూములు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా మార్కాపురం మున్సిపాలిటిలో సీసీరోడ్లు, డ్రైన్ల కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపిందన్నారు. నిధులు త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కాపురం నియోజకవర్గంలోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జేసీ గోపాలకృష్ణ హామీ ఇచ్చారు.

**15వ వార్డులో పర్యటన**

మన ఊరు- మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి 15వ వార్డు పరిధిలోని ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వార్డు పరిధిలో సీసీ రహదారులు, డ్రైన్‌లు నిర్మించాలన్నారు. పింఛన్లు మంజూరు చేయాలని ఎక్కువ మంది ఎమ్మెల్యేకు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, కౌన్సిలర్ నాలి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.



జేసీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం : ప్రభుత్వం, ప్రజలు అందరూ కలిసి సమష్టిగా కృషి చేస్తేనే స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కల సాకారమవుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమం నిర్వహించడంలో భాగంగా శనివారం పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక 15వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ముందుగా మున్సిపాలిటీ ద్వారా ప్రతి ఇంటికి మూడు రకాల చెత్తలను వేసేందుకు డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. వార్డు పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలుచోట్ల మురికి కాలువల్లో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి స్వయంగా కాలువల్లో చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బత్తుల చెన్నకేశవులు, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, కౌన్సిలర్ నాలి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల అభివృద్ధికి వితరణ



నగదు అందజేస్తున్న దాతలు

పెద్ద దోర్నాల,ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న దోర్నాల మండల ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి కోసం దాతలు శనివారం రూ.30 వేలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు మండ్ల శ్రీనివాసులు అభ్యర్థన మేరకు గ్రామానికి చెందిన మారంరెడ్డి కాశీరెడ్డి రూ.10 వేలు, జడ్డు వెంకటేశ్వరరెడ్డి ఐదు వేలు, జీ వెంగళరెడ్డి రూ.5 వేలు, సచివాలయం ఉద్యోగి పీ సుదర్శన్‌రావు రూ.5 వేలు, అడుసుమల్లి వెంకట నారాయణ రూ.5వేలు మొత్తం రూ.30,000లు నగదును అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటి చైర్మన్ సుబ్బారావు, పాలకవీటి శ్రీనివాసులు, ఉపాధ్యాయసిబ్బంది పాల్గొన్నారు.

### ఓవర్‌హెడ్ ట్యాంకు మంజూరుకు వినతి

● జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు కాండ్లవత్ సేవ్య నాయక్



చంద్రబాబునాయుడితో సేవ్యానాయక్

పుల్లలచెరువు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీలోని తమ తండాకు మంచి నీరు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని తండాకు మంచినీటి కోసం ఓవర్ హెడ్ ట్యాంకును ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కాండ్లవత్ సేవ్యనాయక్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడకి వినతిపత్రం అందజేశారు. శనివారం ఉండవల్లిలో సీఎం ను కలిసి గిరిజనులకు ఉన్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పుల్లలచెరువు మండలంలో వెనుకబడిన మురికిమల్ల తండాలో చెంచులు, సుగాలిలు నివాసం వుంటున్నారన్నారు. వారికి తాగునీటి కోసం శాశ్వత మంచినీటి పథకం లేదని 40 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ఓవర్‌హెచ్ ట్యాంకును మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

### చోరీకి గురైన బైక్ దొరికింది



గుర్తించిన బైకుతో పోలీసులు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన బైక్‌ను 24 గంటల్లోనే దొరికింది. శుక్రవారం ఓ హోటల్ ఎదురుగా సచివాలయం వద్ద పార్కింగ్ చేసి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. సచివాలయంలో ఉద్యోగిగా ఉన్న వ్యక్తికి చెందిన ఆ బైక్ పోవడంతో వెంటనే అర్బన్ సీఐ సురేష్‌కు ఫిర్యాదు చేశాడు. సీఐ సురేష్ సిబ్బందితో గాలింపు చేపట్టారు. దీంతో ప్రశాంత్‌నగర్ వద్ద ఆ బైక్ ఉండడం గుర్తించిన పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఉద్యోగికి వాహనాన్ని అప్పగించారు. గాలించి పట్టుకున్న కానిస్టేబుల్ రసూల్ బృందాన్ని సీఐ సురేష్ అభినందించారు.

### ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి



నివాళి అర్పిస్తున్న డాక్టర్ దశరథ్ తదితరులు

కంభం, ఫిబ్రవరి 15 (ఆంధ్ర జ్యోతి): బంజారాల, సుగాలిల ఆరాధ్య దైవం సంతుశ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని స్థానిక అంజన్ సాంఐ దంత వైద్యశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ ఎం.దశరథ్, అర్ధవీడు ఎంఈవో లక్ష్మీనాయక్ మాట్లాడుతూ బంజారాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేందుకు కృషిచేసిన ఆధ్యాత్మికవేత్త సంతుశ్రీసేవాలాల్ మహారాజ్ అని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కాంతారావు నాయక్, రాము, అంజి, దేవ, సాదు, చందు, రామక్రిష్ణ, భీమా, రవీంద్ర, లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

### ఖాజీపురంలో ప్రతి ఇంటికీ కొళాయి

బేస్తవారపేట,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట మండలంలోని ఖాజీపురం గ్రామంలో ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటుకు పంచాయతీ తీర్మానం చేసినట్లు ఎంపీటీసీ పూనూరు భూపాల్‌రెడ్డి తెలిపారు. ఖాజీపురం కాలనీలో గతంలో ఏర్పాటు చేసిన బోరు నుంచి సమీప ప్రాంత ప్రజలకు కనెక్షన్లు ఇచ్చారన్నారు. గ్రామస్థుల అభ్యంతరాలపై ఎంపీడీవో పరిశీలనతో సమస్య తొలగిందన్నారు. మండల పరిషత్, గ్రామ పంచాయతీ నిధుల ద్వారా కొళాయిలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శనివారం బేస్తవారపేట టీడీపీ కార్యాలయలో జరిగిన సమావేశంలో పూనూరు భూపాల్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో నాయకులు పూనూరు జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెలిగొండకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

**సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ డిమాండ్**

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 15 ఆంధ్రజ్యోతి: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ.2 వేల కోట్లు కేటాయించాలని, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక పూలసుబ్బయ్య భవన్‌లో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. గత 7 దశాబ్దాలుగా పాలకుల నిర్లక్ష్యానికి ప్రకాశం జిల్లా గురవుతూనే ఉందన్నారు. 3 దశాబ్దాలైనా ఈ ప్రాజెక్టు నేటికీ పూర్తి కాలేదంటే కాంగ్రెస్, వైసీపీ, టీడీపీలు నైతిక బాధ్యత వహించాలన్నారు. వెలిగొండ ముంపు గ్రామాల బాధితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు ఈ నెల 17న సీపీఐ ఆధ్వర్యంలో మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం, కనిగిరి ఆర్‌డీవో కార్యాలయా ల వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమారెడ్డి, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కొండయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి చిత్తారి పెద్దన్న, ఏఐటీయూసీ కార్యదర్శి కాశీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

**ఎమ్మెల్యేకు సీపీఎం నేతల వినతి**

మార్కాపురం వన్‌టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం 2025-26కు ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలని సీపీఎం నాయకులు శనివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో మాట్లాడుతూ.. జిల్లాలోని శాసనసభ్యులందరూ కలిసి రూ.2వేల కోట్లు కేటాయించేందుకు కృషి చేయాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్, హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం, గేట్లు బిగించడం పూర్తయిందన్నారు. ఇక మిగిలింది నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లింపు మాత్రమే ఉందన్నారు. స్వల్పమైన నిర్మాణ పనులు కూడా ఉన్నాయని తెలిపారు. వచ్చే సీజన్ నాటికి నీటి విడుదలకు అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం 2025 వరద సీజన్ నాటికి వెలిగొండ జలాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సోమయ్య, రఫీ, బాలనాగయ్య, రూబెన్, రాజు, ఏనుగుల సురేష్, నన్నేసా, నాగరాజు పాల్గొన్నారు.



నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

గిద్దలూరు టౌన్ : వెనుకబడిన పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వెలిగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తి కావలసిన అవసరం ఎంతైనా ఉందని, ఇందుకోసం రానున్న బడ్జెట్‌లో నిధులు 2వేల కోట్లు కేటాయించేలా కృషి చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు శనివారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సిపిఎం నాయకులు టి.ఆవులయ్య, బి.నరసింహులు, జె.అల్లూరుస్వామి, శ్రీను, కె.అరుణ్ తదితరులు ఆమేరకు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు అతిత్వరలో పూర్తవుతుందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేందుకు పశ్చిమ ప్రకాశం ఎమ్మెల్యేలతోపాటు జిల్లా మంత్రులతో కలిసి అడిగేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన

### తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరులో మోటారు దించుతున్న సిబ్బంది

గిద్దలూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరవ గ్రామంలోని ఎస్సీ పాలెంలో నీటిసమస్య పరిష్కారమైంది. ఎస్సీపాలెంలో నీటి సమస్య పరిష్కారం కోసం గతంలో పంచా యతీ నిధులతో బోరు వేయించిన సర్పంచ్ బండి శ్రీనివాసులు శనివారం ఆ బోరుకు మోటార్ ఏర్పాటు చేసి నీటి సమస్యకు పరిష్కారం చూపారు.

### వైభవంగా బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

పొదిలి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఓబులశెట్టివారి వీధిలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉభయ దాతల ద్వారా స్వామివారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఇంకుడు గుంతలతో నీటి సంరక్షణ

వెలిగండ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాల పెంపుదలలో ఇంకుడు గుంతలు కీలక పాత్ర వహిస్తాయని ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మరపగుంట్ల గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిముందు ఇంకుడు గుంత ఏర్పాటుచేసుకోవాలన్నారు.

మండలంలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలని మహబూబ్ బాషా సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నాయక్, అన్నపురెడ్డి కృష్టారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, ఒంగోలు శ్రీను, ముత్తిరెడ్డి శ్రీను, కేలం బాలిరెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

పామూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోతుల ప్రభాకర్ డిమాండ్ చేశారు. పామూరు, దొనకొండ ప్రాంతాల్లో పారిశ్రామిక కారిడార్, నిమ్జ్ ఏర్పాటుచేసినట్లయితే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. శనివారం స్థానిక జీఎన్ఆర్ భవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈనెల 6 నుంచి 8 వరకు శ్రీకాకుళం జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల్లో దాదాపు 31 తీర్మాణాలను ఆమోదించినట్టు చెప్పారు. ఎన్నికల సమయంలో యువకులకు ఇచ్చిన హామీలను అమలుపరచడంలో పాలకులు వైఫల్యం చెందుతున్నారని అన్నారు. వెనుకపడిన ప్రాంతంగా ప్రకాశం జిల్లాను గుర్తించి బడ్జెల్లో నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో మహేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి మృతి

వెలిగండ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పద్మాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలానికి చెందిన ఏనుగు ప్రతాప్‌రెడ్డి (45) జాతీయ రహదారి పనులకు సంబధించి రెండు నెలల క్రితం సూపర్‌వైజర్‌గా చేరారు. పద్మాపురం గ్రామంలో ఇంటిని అద్దె తీసుకుని నివాశం ఉంటున్నాడు. ఈక్రమంలో శనివారం తెల్లవారు జామున రేకుల షెడ్డులో ఉరివేసుకుని మృతి చెందాడు గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ భీమానాయక్, ఎస్ఐ మధుసూదన్‌రావు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు.

కేసు నమోదుచేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు

## ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి

పామూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపుకోసం ప్రతిఒక్కరూ ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని ఏపీవో బి.మాల్యాద్రి అన్నారు. శనివారం మండలంలోని దూబగుంట గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6 వేలు అందిస్తుందని తెలిపారు. మండలానికి 570 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయని చెప్పారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో 110 ఇంకుడు గుంతలకు మార్కింగ్ ఇచ్చినట్టు తెలిపారు. అనంతరం గ్రామస్థులకు ఇంకుడు గుంతల నిర్మాణంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు ధైండే శివశంకర్, ఉడుముల ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జి.నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.





# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాల, బాలికల హాస్టల్ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. ప్రాంగణం అంతా పిచ్చిమొక్కలతో, చెత్త కుప్పలతో నిండి ఉండటంతో ఎమ్మెల్యే దగ్గరుండి శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. రాళ్ళను వేరించి కుప్పలుగా పోయించారు. ప్రాంగణంలోని చెత్తకుప్పలను కాల్పించి బూడిద, చెత్త, రాళ్ళను మున్సిపల్ వాహనంలో తరలించారు. బాలికల హాస్టల్ గదుల వెంబడే ఉన్న చిల్లచెట్లను దగ్గరుండి తీయించారు. దీంతో ప్రాంగణం అంతా శుభ్రంగా మారింది.

అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వల్ల వ్యాధులు దరిచేరవన్నారు. పిచ్చి మొక్కలను పరిసరాల్లో లేకుండా చూడాలన్నారు. పిచ్చి మొక్కల నుంచి వచ్చే గాలి ఆరోగ్యకరమైనది కాదన్నారు. క్యాన్సర్ కారకాలుగా ఆయా పిచ్చి మొక్కలు ఉంటాయని తెలిపారు. పిచ్చి మొక్కలను నరికి వాటిని పొయ్యిల్లో వాడుకుని వంట వండు కోవటం కూడా అనారోగ్యాలకు దారి తీస్తాయన్నారు. చాలామంది పేద కుటుంబాల వారు ఇలాంటి విధానాన్ని అవలంబిస్తుంటారన్నారు. ఇంటి పరిసరాల్లో వాడి పడేసిన వస్తువులను ఉంచుకోరాదన్నారు. నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు, మున్సిపల్ చైర్మన్ గఫార్, ఎంపీపీ ప్రకాశం, టీడీపీ నేతలు సానికొమ్ము తిరుపతి రెడ్డి (ఎస్‌టీఆర్), ఐవీ నారాయణ, నజిముద్దీన్, తిరుపాలు, చిలకపాటి లక్ష్మయ్య, కరణం అరుణ, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, తదితరులు పాల్గొన్నారు.



కనిగిరిలోని బాలికల హాస్టల్ ప్రాంగణంలో జరిగిన పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

### పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

దర్శి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎన్టీఆర్ పల్లెవనం పార్క్‌లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్, స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా అభివృద్ధి చేసేందుకు అందరూ భాగస్వాములు కావాలన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతోపాటు ఆరోగ్యం, పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషిచేస్తున్నట్టు డాక్టర్ లక్ష్మి చెప్పారు. త్వరలో అన్నా క్యాంటిన్, ఆడిటో రియం, డ్రైవింగ్ శిక్షణా పరిశోధన స్థానం, కోల్డ్‌స్టోరేజీ నిర్మాణ పనులు పునఃప్రారంభమవుతాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన వీటి నిర్మాణాలను వైసీపీ పాలకుల అసమర్థతతో ఐదేళ్ళ పునాదులతోనే నిలచిపోయాయన్నారు. నియోజకవర్గంలో నిలిచిపోయిన ప్రాజెక్టులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సంబంధిత మంత్రులకు వివరించి నిధులు మంజూరుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్, నారపుశెట్టి పిచ్చయ్య, డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, సీఐ వై.రామారావు, కమిషనర్ వై.మహేశ్వరరావు, ఎంపీడీవో ఎల్.కృష్ణమూర్తి, ఎంఈవో కె.రఘురామయ్య,. ఈవోఆర్డీ ఆవుల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలోని పార్క్‌లో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

### గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ముండ్లమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఇందులోభాగంగా ప్రతి గ్రామంలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నట్టు చెప్పారు. శనివారం సాయంత్రం మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించుకున్న 20 ఇంకుడు గుంతలను ఆమె ప్రారంభించారు. అనంతరం ప్రధాన వీధికి ఇరువైపులా మొక్కలను నాటారు. ఈసందర్భగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంత ఏర్పాటుచేసుకోవటం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోకుండా ఉంటాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు.

కార్యక్రమంలో ఏపీవో కె.నాగరాజు, టీడీపీ నేతలు కడియాల లలిత్‌సాగర్, కూరపాటి శ్రీనివాసరావు, కొక్కెర నాగరాజు, దేవినేని కోటేశ్వరరావు, కూరపాటి నారాయణ స్వామి, అమరా భానుప్రకాశరావు, కోడెగ మస్తాన్‌రావు, డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పామూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని డీఎల్‌డీవో కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పామూరులో చెత్త సంపద తయారీ కేంద్రంలో క్లాప్ మిత్రల ద్వారా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. ఈసందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.సురేష్, ఉపసర్పంచ్ వైవీ సాయి కిరణ్, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవింద, గ్రామ సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని కంభాలదిన్నెలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్ చుంచు కొండయ్య మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మన్నం రమణయ్య, గద్దె గంగయ్యచౌదరి, గోళ్ళ భాస్కర్, మాజీ ఎంపీటీసీ గోళ్ల కొండయ్య, గోళ్ళ రమణయ్య, ఏలూరి నరసింహారావు, పంచాయతి కార్యదర్శి రాంప్రసాద్, తదితరులు పా ల్గొన్నారు.

**దొనకొండలో..**

దొనకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పౌరసరఫరాల గోడౌన్‌లలో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పారిశుధ్య కార్య క్రమాలు నిర్వహించారు. కార్యాలయాల పరిసరాల్లో చెత్తాచెదారాన్ని తొలగించారు. పలు ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ షేక్ ఆదాంషఫీ, వైద్యాధికారిణి డాక్టర్ సునీత, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



పామూరులో చెత్త సంపద కేంద్రం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి తదితరులు

### గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఆర్.జనార్దన్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రతి పంచాయతీని పరిశుభ్రంగా ఉంచుకొనే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు పెద్దఎత్తున నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.నాగరాజు, ఎంఈవో కె.వెంకటేశ్వర్లు, ఈసీ శివరామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలి

తాళ్లూరు, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని ఎంపీడీవో కార్యాలయ ఏవో సానికొమ్ము సత్యం అన్నారు. మండలంలోని నాగంబొట్లపాలెం పంచాయతీలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం కార్యాలయాలు, గ్రామాలను శుభ్రపరిచి స్వచ్ఛాంధ్రగా నిలపాలని కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామస్థులు చెత్తను మురుగు కాలువల్లో వేయకుండా చెత్తవేసే బుట్టల్లో వేయాలన్నారు. గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న కాలువలో పూడికతీత పనులు చేపట్టారు, వాగుల్లో వేసిన చెత్తను ట్రాక్టర్‌లలో ఎత్తి దూరప్రాంతానికి తరలించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిమటా సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, మండలంలోని వెలుగువారిపాలెం ప్రాథమిక పాఠశాల(ఏపీ)లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ఆవరణలో మొక్కలునాటారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పోలం రెడ్డి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్లు

» ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులకు గురై పనిచేయని వైనం

» తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

తాళ్లూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు ఆర్వో ప్లాంట్లు(నీటి శుద్ధ జలయంత్రాలు) ఏర్పాటుచేశాయి. ఇవి మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద లక్షలాది రూపాయలు వెచ్చించి తాళ్లూరు మండలంలోని 22 పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేసింది. నాసిరకం యంత్రాలతో నాలుగు నెలలు తిరగకుండానే పాడైపోయాయి. దీంతో ఆయా పాఠశాలల్లో తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఏఒక్క ఆర్వోప్లాంటు పనిచేయడంలేదు. ఇవి మరమ్మతులకు గురై నాలుగేళ్లవుతున్నా పట్టించుకొనేవారేలేరు. దీంతో ఆయా పాఠశాలల్లో వాటి పరికరాలు నిరుపయోగంగా వున్నాయి. ప్రారంభంలో వాటి మరమ్మతులకు తక్కువ ఖర్చు తక్కువయ్యేది. సంవత్సరాల తరబడి చేయించకపోవటంతో అవి పూర్తిగా పాడై మరమ్మతుల ఖర్చు రెట్టింపు అయింది. అయితే, కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు అందించేందుకు కొందరు ఉపాధ్యాయులు సొంత నిధులు వెచ్చించి గ్రామంలోని వాటర్ ప్లాంట్‌ల నుండి తెప్పించి మంచినీరు అందిస్తున్నారు. గ్రామంలోని వాటర్ ప్లాంట్లు పనిచేయనప్పుడు బోరు నీటిని సేవిస్తూ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

శివరాంపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం త్రిపురారిబొట్ల శ్రీనివాసరావు సొంత నిధులు వెచ్చించి రెండుసార్లు ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. బొద్దికూరపాడు జడ్పీహైస్కూల్‌లోని ఆర్వో ప్లాంటును పీఎంసీ కమిటీ చైర్మన్ సొంత నిధులతో మరమ్మత్తులు చేయించి విద్యార్థులకు తాగునీరు అందిస్తున్నారు. మిగిలిన 20 పాఠశాల్లో చెడిపోయిన ఆర్వో ప్లాంట్ల మరమ్మతుల ఊసే ఎత్తలేదు. వేసవి కాలం ప్రారంభమైనందున విద్యార్థులు దాహార్తితో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



కస్తూర్బా విద్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంటు

# క్షణికావేశంతో నిండు ప్రాణాలు బలి

» పెద్దదిక్కును కోల్పోయిన పలు కుటుంబాలు

» ఉమామహేశ్వర అగ్రహారంలో రెండేళ్లలో పది మందికిపైగా మృతి

ముండ్లమూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంతో బలవన్మరణాలకు పాల్పడి ప్రాణాలు తీసుకుంటున్నారు. దీంతో ఆ కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోతున్నాయి. కొన్ని కుటుంబాలు యజమాని చని పోవటంతో వారిని ఆదరించేవారు లేకుండా పోతున్నారు. మండలంలోని ఉమా మహేశ్వరఅగ్రహారం గ్రామంలో రెండేళ్లలో పది మందికిపైగా ప్రాణాలు తీసుకున్నారు.

గ్రామానికి చెందిన గొర్రె బాలు అనే యువకుడు ఈ నెల 10న పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 12వ తేదీ మృతి చెందాడు. సాధు అంజమ్మ గత జనవరిలో నెలలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే గ్రామంలో షేక్ అబ్దుల్, షేక్ మస్తాన్‌వలి, చింతల సుబ్బారెడ్డి, చింతల నారాయణ రెడ్డి, చింతల లక్ష్మీనారాయణరెడ్డి, గూడాల కిరణ్మయి, రావులపల్లి తిరుపతమ్మ, షేక్ మస్తాన్‌వలితో పాటు మరికొంత మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయి. మృతి చెందినవారు కుటుంబ యజమానులు కావటంతో ఆ కుటుంబాలన్నీ ప్రస్తుతం మనోవేదన చెందుతున్నాయి. మరి కొందరు పట్టుమని 30 సంవత్సరాలు కూడా లేకపోవటంతో ఆకుటుంబాల బాధ వర్ణనాతీతం. అందివచ్చిన కుమారులు మృతి చెందటం ఒక ఎత్తయితే పెళ్లి అయి భార్య, పిల్లలు ఉండటం మరింత బాధను తెచ్చిపెట్టింది. కూలీకి వెళితే గాని పొట్ట గడవని కుటుంబాలు సైతం ఉన్నాయి. యజమాని చనిపోవటంతో ఆ భారమంతా భార్య, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల మీద పడింది. చిన్న చిన్న మాటలకు ఆవేశాలకు లోనై తమ విలువైన ప్రాణాలను తీసుకోవటం వల్ల ఆ కుటుంబాలు మానసిక క్షోభకు గురవుతున్నాయి.

## కార్మికులు తప్పనిసరిగా బీమా నమోదు చేసుకోవాలి

కనిగిరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కార్మికులు తప్పనిసరిగా బీమా నమోదు చేసుకోవాలని కనిగిరి అసిస్టెంట్ కార్మికశాఖాధికారి సుబ్బరాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పని సమయాల్లో ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉంటే వారికి రూ.2లక్షల వరకు ప్రమాద బీమా వస్తుందని తెలిపారు. ఈ-శ్రమ కార్డు కూడా పొందాలన్నారు. బీమా నమోదు చేసుకోవాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఆధార్ నంబర్ లింక్ అయిన బ్యాంకుపాస్ పుస్తకం, ఫోన్ నంబర్ వెంట తీసుకుని వస్తే స్థానిక బొడ్డుచావిడి వద్ద ఉన్న కార్యాలయంలో నమోదు చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9347946107 నంబరును సంప్రదించాలని కోరారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



బాధితుడిని విచారిస్తున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

## ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

పీసీపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి ఘటనకు సంబంధించి నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ శనివారం విచారించారు. పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వెంగళాపురం గ్రామానికి చెందిన ఉన్నం శ్రీనివాస్ అనే యువకుడు కర్రల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత బుధవారం పెదయిర్లపాడులో అటవీశాఖ సిబ్బందితో లింగన్నపాలెం గ్రామానికి చెందిన దత్తాత్రేయరెడ్డి, కర్రల వ్యాపారి శ్రీనివాస్ మాట్లాడుతున్న సమయంలో ఇద్దరూ ఘర్షణపడ్డారు. అదేరోజు సాయంత్రం శ్రీనివాస్‌పై దత్తాత్రేయరెడ్డి దాడిచేశాడు.

ఈ దాడిలో శ్రీనివాస్ గాయపడ్డాడు. బాధితుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీసీపల్లి పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేశారు. కేసు విచారణలో భాగంగా శనివారం పెదయిర్లపాడు వచ్చిన డీఎస్పీ దాడి జరిగిందని చెప్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం బాధితుడితో పాటు ప్రత్యక్ష సాక్షులను విచారించారు. డీఎస్పీ వెంట ఎస్సై కోటయ్య, సిబ్బంది ఉన్నారు.

## మిస్టరీగా గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతుని జేబులో లభ్యమైన ఫొటో

కనిగిరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం సమీపంలోని అయ్యప్పస్వామి దేవాలయం కొండపై గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం రాత్రి పోలీసులు గుర్తించారు. రాత్రి సమయం కావటంతో చిల్లచెట్ల మధ్య ఉన్న మృతదేహాన్ని బయటికి తీసేందుకు పోలీసుల యత్నం విఫలమైంది. శనివారం చిల్లచెట్లను తొలగించి చూడగా 45ఏళ్ళ వయస్సు ఉన్న వ్యక్తి ఐదు రోజుల క్రితం చనిపోయినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ వ్యక్తి ఎవరు.. కొండపైకి వెళ్ళి . ఎలా చనిపోయాడన్నది మిస్టరీగా మారింది. మృతదేహం వద్ద లభించిన మహిళలకు చెందిన మూడు జతల పాత చెప్పులు ఓ కవర్లో పడి ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తుంది.

మృతుడి వివరాలేవి లభ్యం కాగాపోగా అతను లుంగీ కట్టుకుని బాక్సర్ ధరించి ఉన్నాడు. వాటిలో రెండు పర్సులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వాటిలో ఓ పాస్‌ఫోటో ఉంది. ఆ ఫొటో మృతదేహానికి సంబంధించిన వ్యక్తిదేనా.. లేక మరెవరిదైనానా అని పోలీసులు ఆలోచనలో పడ్డారు. కొండపైకి వెళ్లిన తర్వాత చనిపోవటానికి దారి తీసిన కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఫొటో ఆధారంగా సీఐ ఖాజావలి నేతృత్వంలో ఎస్ఐ మాధవరావు దర్యాప్తు చేస్తున్నారు. గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లుగా పోలీసులు కేసు నమోదు చేశారు.

## నాణ్యతా ప్రమాణాలతో వంతెన నిర్మాణం చేయాలి



బ్రిడ్జి నిర్మాణపనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

వెలిగండ్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలతో వంతెన నిర్మాణ పనులు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని గన్నవరం పంచాయతీలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.20 కోట్లు మంజూరుచేయించారు. ఈక్రమంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శనివారం ఎమ్మెల్యే నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఇంజనీర్లకు సూచించారు. ఇది పూర్తయితే ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న ఈప్రాంత ప్రజల కష్టాలు తీరతాయన్నారు. ఈ మార్గం నుంచి నాగులవరం, జాళ్ళపాలెం, గుడిపాటిపల్లి ప్రాంతాలకు దగ్గరగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, చిలకల వెంకటేశ్వర్లు, దేవిరెడ్డి, రామిరెడ్డి, నాగార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వేధిస్తున్న పంచాయతీ కార్యదర్శుల కొరత

» ఇన్‌చార్జ్‌లతో ప్రజల ఇక్కట్లు » పట్టించుకోని అధికారులు


ముండ్లమూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరత వేధిస్తుంది. పలు గ్రామాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కయ్యారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. మండలంలోని పసుపుగల్లు పంచాయతీకి కొన్ని నెలల నుంచి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేరు. అక్కడ ఇన్‌చార్జ్‌గా ఉమామహేశ్వర అగ్రహారంలో పని చేస్తున్న మౌలాలిని నియమించారు. ఆయనను పోలవరంకు కూడా ఇన్‌చార్జ్‌గా నియమించారు. దీంతో ఒకే కార్యదర్శికి మూడు గ్రామ పంచాయతీలను చూసే బాధ్యత పడింది. జమ్మల మడక కార్యదర్శిగా పనిచేస్తున్న మొలకయ్యను బొప్పూడి వారిపాలెం ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్నారు. పూరిమెట్ల కార్యదర్శి భీమవరంకు కూడా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. వేములకు ఇన్‌చార్జ్‌గా వేములబండలో పనిచేస్తున్న సమీర్‌ను నియమించారు. దీంతో ఆ నాలుగు గ్రా పంచాయతీల్లో సమస్యల పరిష్కారానికి నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం లోపించి దోమలు విపరీతంగా పెరిగి పోయాయి. వాటి ప్రభావం ప్రజలపై పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా కార్యదర్శి సంతకం కావాలంటే కార్యదర్శులు రెండు చోట్ల బాధ్యతలు నిర్వహిస్తుండటంతో ఎక్కడకు వెళ్ళి సంతకం పెట్టించుకోవాలో అర్థంకాక ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ కార్యదర్శులను నియమించి పాలన సజావుగా సాగేలాచూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## అన్న క్యాంటీన్లలో నాణ్యమైన ఆహారం అందించాలి

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లలో పేదలకు నాణ్యమైన ఆహారం అందిచాలని కమిషనర్ ఆఫ్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) సంపత్‌కుమార్ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం ఒంగోలులోని కర్నూలురోడ్‌లో గల అన్న క్యాంటీన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి భోజనాన్ని ఆయన స్వయగా రుచి చూశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు రూ.5లకే అన్నం పెట్టి ఆకలి తీర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులోభాగంగా అన్న క్యాంటీన్ల ద్వారా అందజేస్తున్న ఆహారం బాగుండాలని చెప్పారు. క్యాంటీన్‌లో అందిస్తున్న సేవలు, ఆహార పదార్థాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

నగర కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం ప్రతి అన్న క్యాంటీన్‌ను స్వయంగా తనిఖీ చేసి, ఆహారపదార్థల తయారీ, సేవలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా క్యాంటీన్‌కు విచ్చేసేవారితో మాట్లాడి వారి అభిప్రాయాన్ని స్వీకరిస్తున్నట్లు వివరించారు. ఎక్కడైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే వాటిని సవరించి నాణ్యమైన భోజనం అందిస్తున్నామని ఆయన వెల్లడించారు.







# గ్రిడ్ అనుసంధానంపై.. అధ్యయనం

**30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని..**

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లల పరిధిలోని పట్టణాలు వేగంగా విస్తరిస్తున్నాయి. జనాభాతో పాటు అవసరాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో రానున్న 30 ఏళ్ల వరకు తాగు నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించారు. ఉదాహరణకు నరసరావుపేటలో రోజుకు ప్రస్తుతం 22 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. రానున్న 30 ఏళ్లకు మరో 15 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉంటుందని అంచనా వేశారు. ఇలా 37 ఎంఎల్‌డీ నీటి అవసరం ఉండటంతో ఆ మేరకు పైపులైన్లను నరసరావుపేటకు అనుసంధానం చేస్తారు. ఇదే తరహాలో గుంటూరు కార్పొరేషన్ సహా మూడు జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో ఏ మేరకు నీటి అవసరమో ప్రాథమికంగా గుర్తించారు. నీటి సరఫరా, పైపులైన్ సామర్థ్యం పరిగణనలోకి తీసుకుని గ్రిడ్ వ్యయ అంచనాలు రూపొందిస్తారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్లెలు, పట్టణాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు వాటర్ గ్రిడ్ పల్లెలకే పరిమితం కాగా దానిని మున్సిపాలిటీలకు కూడా అనుసంధానం చేసేందుకు కసరత్తు చేస్తోంది. రూ.1,200 కోట్ల వ్యయం కాగల తొలివిడత పనులకు గ్రామీణ నీటిసరఫరా శాఖ టెండర్లు నిర్వహించి పల్నాడు జిల్లా పరిధిలోని 10 మండలాల్లోని అన్ని గ్రామాలకు రక్షిత నీరు అందించేందుకు సమాయత్తమైంది. ఈ తరుణంలో ప్రభుత్వం కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చింది. పల్లెలతో పాటు పట్టణాల్లో రక్షిత నీటి పథకాలను వాటర్ గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ శాఖలను ఆదేశించింది. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్లు సోమవారం గుంటూరులో భేటీ (మిగతా 8వ పేజీలో)

పల్లెలు.. పట్టణాలు అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ తాగునీటికి అవస్థలే. కొన్ని ప్రాంతాల్లో అయితే ఫ్లోరైడ్ సమస్య.. వీటన్నింటికీ చెక్ చెప్పేలా.. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా.. సురక్షిత నీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ సరఫరా చేసేలా.. వాటర్ గ్రిడ్‌ను మున్సిపాలిటీలకూ అనుసంధానం చేయనున్నారు. ఇప్పటి వరకు వాటర్‌గ్రిడ్ పల్లెలకే పరిమితం కాగా దానిని మున్సిపాలిటీలకు అనుసంధానం చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో అనుసంధానంపై అధ్యయనానికి ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు సోమవారం గుంటూరులో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. ఈ సమావేశంలో వాటర్ గ్రిడ్‌కు తుదిరూపు ఇవ్వనున్నారు. రానున్న 30 ఏళ్ల వరకు తాగు నీటి అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించి నివేదికలను ప్రభుత్వానికి అందించనున్నారు.

- అమృత్ 2.0 పనులూ వాటర్ గ్రిడ్‌లోకి..
- పురాల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ప్రణాళికలు సిద్ధం చేసిన కూటమి ప్రభుత్వం
- రేపు గుంటూరులో పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ల భేటీ
- వారంలో వాటర్ గ్రిడ్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష
- గ్రిడ్‌కు అమృత్ 2.0 జలజీవన్ మిషన్ నుంచి నిధులు



### గ్రిడ్ నిర్మాణం.. గ్రావిటీ ద్వారా సరఫరా

రక్షిత తాగునీటిని అందించడమే వాటర్ గ్రిడ్ లక్ష్యం. చాలా గ్రామాల్లో తాగునీటి పథకాలు బోరు నీటిపై ఆధారపడ్డాయి. బోరు నీటిని వినియోగించరాదని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో గ్రామాలకు, పట్టణాలకు నాగార్జున సాగర్ నుంచి కృష్ణా జలాలను సరఫరా చేసే విధంగా వాటర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టారు. సాగర్ వద్ద నీటి శుద్ధి ప్లాంట్‌ను నిర్మించి పైపులైన్ల ద్వారా నీటిని గ్రామాలకు సరఫరా చేయాలని గ్రిడ్‌ను రూపకల్పన చేశారు. అయితే ప్రస్తుతం గ్రిడ్‌ను మున్సిపాలిటీలకూ అనుసంధానం చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు పైపులైన్ నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. సాగర్ నుంచి కారంపూడి వరకు ప్రధాన పైపులైన్ నిర్మించి అక్కడ వినుకొండ, నరసరావుపేట, పిడుగురాళ్ల వైపునకు పైపులైన్లు ఏర్పాటు చేస్తారు. ఇలా ప్రతి పట్టణానికి, గ్రామాలకు పైపులైన్లను అనుసంధానం చేస్తారు. దీంతో ప్రత్యేకంగా చెరువుల్లో తాగునీటిని నిల్వ చేసే అవసరం ఉండదు. పైపులైన్ ద్వారా నేరుగా ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని ఎక్కిస్తారు. ఆ ట్యాంకు నుంచి డిస్ట్రిబ్యూషన్ లైన్ల ద్వారా ఇంటింటికి నీటిని సరఫరా చేస్తారు. దీని వల్ల వేసవిలో కూడా తాగు నీటి ఇబ్బందులు ఉండవు. పుష్కలంగా తాగునీటి సరఫరాకు వాటర్‌గ్రిడ్ దోహదపడు తుంది. ఈ బృహత్తర పథకానికి కూటమి ప్రభుత్వం నడుంకట్టింది. గ్రావిటీపై నీటి సరఫరా చేయవచ్చని ఇంజనీర్లు చెబుతున్నారు.

మునిసిపాల్టీల వారీగా అమృత్ పథకంలో చేపట్టే పనులకు వ్యయం అంచనా వివరాలు..

| మునిసిపాల్టీ | వ్యయం అంచనా రూ కోట్లలో |
|---|---|
| **పల్నాడు జిల్లా..** | |
| నరసరావుపేట | 23.82 |
| చిలకలూరిపేట | 116.80 |
| వినుకొండ | 29.57 |
| దాచేపల్లి | 6.11 |
| పిడుగురాళ్ల | 24.77 |
| గురజాల | 3.17 |
| మాచర్ల | 37.53 |
| **గుంటూరు జిల్లా..** | |
| గుంటూరు | 363.23 |
| మంగళగిరి, తాడేపల్లి | 60.63 |
| తెనాలి | 2.25 |
| పొన్నూరు | 19.06 |
| **బాపట్ల జిల్లా..** | |
| చీరాల | 31.43 |
| బాపట్ల | 23.38 |
| రేపల్లె | 41.64 |



# పోషణ.. అంతంతే



- 72 శాతం మందికే పోషకాహారం
- ధర పెరిగిందని కోడిగుడ్లలో కోత
- అంగన్వాడీలకు అరకొరగా సరుకులు
- సరుకులు అందక లబ్ధిదారులు ఇబ్బందులు

(గుంటూరు -ఆంధ్రజ్యోతి)

మంగళగిరిలోని అంగన్వాడీ కేంద్రానికి కోడిగుడ్లు తక్కువగా వచ్చాయి. ఒక్కో లబ్ధిదారుకు నెలకు 25 గుడ్లు చొప్పున ఇవ్వాల్సి ఉండగా తక్కువ సంఖ్యలో గుడ్లు రావడంతో వచ్చినవాటినే సరిపుచ్చి సిబ్బంది చేతులెత్తేశారు. కందిపప్పు, బియ్యం కూడా తక్కువగా రావడంతో వాటినే సర్దుబాటు చేయాల్సి వచ్చింది.

గుంటూరులోని ఓ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఇచ్చే బాలామృతం తక్కువగా వచ్చింది. మిగిలినవారికి, కొత్తగా చేరిన వారికి బాలామృతం అందలేదు.

ఇది ఏదో ఒక్క అంగన్వాడీ కేంద్రంలో సమస్య అనుకుంటే పొరపాటే. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే పోషణ ప్రక్రియ నెలనెలా నీరసించిపోతోంది. ఐసీడీఎస్ లెక్కలు చూస్తే గత కొన్ని నెలలుగా మూడు జిల్లాల్లోని అంగన్వాడీ లబ్ధిదారుల్లో 72 శాతం మందికి మాత్రమే పోషకాహారం అందుతుందని తెలుస్తోంది. వైసీపీ హయాంలో దెబ్బతిన్న పోషణ వ్యవస్థ కూటమి ప్రభుత్వం రాకతో ఇప్పుడిప్పుడే గాడిన పడుతుందనుకుని లబ్ధిదారులు భావిస్తున్నారు. సరిగ్గా ఈ సమయంలోనే తిరిగి పాత సమస్యలే తలెత్తుతుండడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది.

**● ఈ- కేవైసీతో అందకుండా పోతున్న బాలామృతం**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ- కేవైసీ విధానంతో చిన్నారులకు బాలామృతం అందకుండా పోతోంది. చిన్నారులకు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ వంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో చిన్నారులకు ఈ-కేవైసీ జరగడం లేదు. దీంతో వారికి బాలామృతం అందకుండానే పోతోంది. ఒక వేళ ఈ కేవైసీ పూర్తయినా అది ప్రతి నెలా 20 లోపే చేయాలి. అలా నమోదైతేనే ఆ మరుసటి నెలలో చిన్నారికి బాలామృతం అందుతుంది. లేదంటే మరో నెల వేచి చూడాల్సిందే. అలా ప్రతి నెలా 20 నుంచి 25 శాతం మందికి బాలామృతం అందడం లేదని తెలుస్తోంది. సగటున ఒక్కో అంగన్వాడీ కేంద్రంలో 50 మంది చిన్నారులు ఉంటే, 38 బాలామృతం ప్యాకెట్లు మాత్రమే వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. గతంలో ఏ నెలకి ఆ నెల అంగన్వాడీ (మిగతా 8వ పేజీలో)

### ● యాప్ ట్రాకింగ్‌తో.. అరకొర సరుకులు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 5,339 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో మూడున్నర లక్షల మంది మహిళలు, 1.50 లక్షల మంది చిన్నారులు పోషణ పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం యాప్ ద్వారా పోషణను అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని, ఎఫ్ఎర్ఎస్ ద్వారా పోషణ అందిస్తోంది. ఆయా యాప్‌లలో నమోదైన వారికి మాత్రమే ప్రతి నెలా పోషణ అందుతుంది. ప్రతి నెలా 20 నుంచి 25వ తేదీ లోపు నమోదు కాని పక్షంలో రెండో నెల నుంచి వారికి పోషణ సరఫరా అవుతుంది. సాధారణంగా బాలింతలు, గర్భిణులు విశ్రాంతి కోసం, సంప్రదాయం ప్రకారం పుట్టిళ్లకు వెళుతుంటారు. అలా వెళ్లిన సందర్భంలో వారికి అక్కడ సమీపంలో ఉన్న అంగన్వాడీల్లో పోషణ పొందే అవకాశం ఉంటుంది. గతంలో వారి పేర్లు రిజిస్టర్లో నమోదు చేసుకుని వెంటనే బాల సంజీవని, రాగిపిండి, చిక్కీలు, అటుకులు, ఎండు ఖర్జూరం అందించేవారు. తాజా విధానం ప్రకారం వారు పుట్టింటికి వెళ్లినా, అక్కడి నుంచి తమ ఇంటికి తిరిగి వచ్చిన సందర్భాల్లో ఆయా అంగన్వాడీల్లోని యాప్‌లలో నమోదైన మరుసటి నెల నుంచి మాత్రమే సరుకులు అందుతాయి. ఈ విధానంతో అనేకమంది మహిళలు, చిన్నారులు నష్టపోతున్నారు.





### షేర్ ధనం పది శాతం.. వడ్డీ భారం

సహకార పరపతి సంఘాల్లో రైతులకు దీర్ఘకాలిక రుణాలు, క్యాష్ క్రెడిట్, పంట రుణాలు ఇస్తున్నారు. వీటిలో పంట రుణం కింద రూ.3 లక్షలు, దీర్ఘకాలిక రుణాల కింద రూ.10 లక్షలు ఇస్తున్నారు. తీసుకున్న రుణంలో 10 శాతం షేర్ ధనం కింద సహకార బ్యాంకు మినహాయించుకుంటుంది. ఉదాహరణకు రైతు రూ.10 లక్షలు దీర్ఘకాలిక రుణం తీసుకుంటే రూ.లక్ష వరకు షేర్ ధనం కింద మినహాయిస్తారు. బ్యాంకు మినహాయించిన రూ.లక్షకు కూడా రైతే వడ్డీ చెల్లించాలి.

# సహకారం మాకొద్దు

- సొసైటీలకు రైతులు గుడ్‌బై
- ఖాతాలు రద్దు చేసుకుంటోన్న వైనం
- మోయలేని భారంగా సహకార రుణాలు
- జీవో 472కు విరుద్ధంగా పెద్దఎత్తున వసూళ్లు

జగన్ ప్రభుత్వం వచ్చాక అదనపు ఫీజులు మోత

(గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

స్టాంపు డ్యూటీ రూ.1500.. బాండ్‌కు రూ.1500.. రూ.3 లక్షల రుణానికి రూ.30 వేలు షేర్ ధనం.. రుణం రద్దు కోసం రూ.4500 చెల్లింపు.. ఇవి కాక రుణం కోసం బ్యాంకుల చుట్టూ పలుసార్లు తిరుగుడు.. ఆ పత్రాలు.. ఈ పత్రాల వ్యయం అదనం.. ఇదీ సహకార సంఘాల్లో రుణం తీసుకునే రైతులపై పడుతున్న భారం. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి రైతులకు రక్షణ కోసం ఏర్పాటైన సహకార సంఘాలు అందుకు పూర్తి విరుద్ధంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. రుణాలకు పడే భారాన్ని భరించలేక సహకార సంఘాలకు రైతులు గుడ్‌బై చెప్పేస్తున్నారు. పెదకాకాని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) నుంచి సుమారు 80 మంది రైతులు ఏకకాలంలో వైదొలగారు. అంతేగాక అక్కడ ఉన్న రుణ ఖాతాలను కూడా రద్దు చేసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు ఆకస్మికంగా బయటకు వెళ్లిపోయారు. నాలుగైదేళ్లుగా ఈ సంఖ్య క్రమేపీ పెరుగుతూ వస్తుంది. ఇందుకు కారణంపై ఆరా తీస్తే.. గతంలో ఎన్నలూ లేనివిధంగా సొసైటీల్లో రైతులకు ఇచ్చే రుణాలపై ఎడాపెడా ఫీజులు వసూలు చేయడమేనని తెలుస్తోంది. వ్యవసాయ రుణాల మంజూరు సమయంలో స్టాంపు డ్యూటీ, బాండ్, షేర్ ధనం ఇలా వివిధ రకాల పేర్లతో రైతుపై అదనపు భారాన్ని మోపడమే ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వంలో వసూళ్ల పర్వానికి తెరలేవగా కూటమి ప్రభుత్వంలోనూ అది కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో రుణాల నిమిత్తం చెల్లించే ఫీజుల భారాన్ని మోయలేక రైతులు సొసైటీలకు గుడ్‌బై చెప్పేస్తున్నారు. వందల సంఖ్యలో రైతులు ఖాతాలు రద్దు చేసుకుంటే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల మనుగడ కష్టమేనని పలువురు అంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటికే 60 సహకార పరపతి సంఘాలు తీవ్ర నష్టాల్లో ఉన్నాయి. ఒకేసారి వందలాది మంది రైతులు బయటకు వెళ్తే మిగిలిన సొసైటీలు కూడా అదే బాట పట్టాల్సి వస్తుంది.

### రైతుపై భారం తగ్గించాలి



సహకార పరపతి సంఘాల్లో రుణాలు పొందడానికి రైతులు చాలా భారం భరిస్తున్న మాట వాస్తవమే. ఇప్పటికైనా రైతులపై పడే భారాన్ని తగ్గిస్తే బాగుం టుంది. దానివల్ల సొసైటీల మనుగడకు కూడా ఇబ్బంది కలగదు. రైతులు బయటకు వెళ్లిపోతే ఇబ్బందులకు దారి తీస్తుంది.

**- ముప్పా వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు, సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్**

### జీవోకు జగన్ పాతర

సహకార పరపతి సంఘాల ద్వారా రైతులు తీసుకునే రుణాలకు స్టాంపు డ్యూటీ వసూలు చేయవద్దని 1982లో జీవో 472ను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఆ జీవోను అమలు చేస్తూ వచ్చాయి. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత జీవోకు పాతర పడింది. సహకార సంఘాల ద్వారా రైతులు తీసుకునే రుణాలకు 0.5 శాతం స్టాంపు డ్యూటీ వసూలు చేయడం ప్రారంభించారు. రూ.3 లక్షల రుణానికి రూ.1500 వరకు చలానా కట్టిస్తున్నారు. గతంలో రుణం పొందేందుకు అవసరమైన బాండ్‌కు కూడా ఏవిధమైన ఫీజు వసూలు చేయలేదు. వైసీపీ ప్రభుత్వం బాండ్‌కు రూ.1500 ఫీజుగా నిర్ణయించింది. సహకార సంఘాల్లో రైతులు తీసుకున్న రుణాన్ని రద్దు చేసుకునే సమయంలో కూడా ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది. రుణాన్ని రద్దు చేసే సమయంలో రూ.4500 వరకు చెల్లించాల్సి వస్తోంది. కొన్ని సంఘాల్లో అయితే అంతకంటే ఎక్కువే ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇన్ని విధాలా ఖర్చులు ఉండటం వల్ల రైతుపై ఎక్కువ భారం పడుతుంది. ఫీజులు, ఇతర ఖర్చులను లెక్కేస్తే తీసుకున్న రుణానికి వడ్డీ ఎక్కువగానే పడుతున్నట్లు అర్థం అవుతుంది.

# 466.35 ఎకరాలు.. రూ.181 కోట్లు

- పంప్‌హౌస్‌ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం
- పోలవరం - బనకచర్ల అనుసంధానంలో ముందడుగు

నకరికల్లు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధానంలో ముందడుగు పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పనులు వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ పనుల్లో కదలిక వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి మెగా, నవయుగ ఇంజనీరింగ్ కంపెనీలకు అప్పగించింది. తొలి దశలో కృష్ణా నది నుంచి సాగర్ కుడి కాల్వలోకి నీటిని ఎత్తి పోసే పనులు మొదలయ్యాయి. ఐదు పంపుహౌస్‌ల నిర్మాణం దిశగా చర్యలు చేపట్టారు. గోదావరి నీటిని ప్రకాశం బ్యారేజీకి తరలించి న వైకుంఠపురం వద్ద కృష్ణా నది నుంచి తోడి నకరికల్లు మండలం నరసింగపాడు వద్ద 80వ కిలోమీటరు సాగర్ కుడి కాల్వలో పోస్తారు. ఇందుకోసం ఐదు చోట్ల పంపు హౌస్‌లను నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. తొలుత పంపుహౌస్‌ల నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఐదు పంపుహౌస్‌ల నిర్మాణానికి 466.35 ఎకరాలు సేకరించాల్సి ఉంది. ఈ భూసేకరణకు రూ.181 కోట్లతో ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం ఆ మోదించింది. దీంతో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది.

**నకరికల్లు మండలంలో భూసేకరణ**

ఈ ప్రాజెక్టు కింద నకరికల్లు మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో 78 ఎకరాల ప్రభుత్వ భూమి వినియోగించనున్నారు. నకరికల్లు పరిధిలో 283 ఎకరాలు, నరసింగపాడులో 341.91 ఎకరాలను సేకరించాల్సి ఉంది. నరసింగపాడులో పంపు హౌస్ నిర్మాణానికి జలవనరుల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రావిటీ ద్వారా కాల్వ తీసేందుకు 190 ఎకరాలను సేకరించాల్సి ఉంది. కాగా జలవనరుల శాఖ అధికారులు రెవెన్యూ అధికారులతో భూసేకరణకు చర్చలు జరుపుతున్నారు.

**పంప్‌హౌస్‌లు ఇలా..**

- **మొదటిది:** అమరావతి మండలం వైకుంఠపురం వద్ద
- **రెండోది:** లింగాపురంలో 11.5 కిలో మీటరు వద్ద
- **మూడోది:** క్రోసూరులో 35.25 కిలో మీటరు వద్ద
- **నాల్గోది :** రాజుపాలెంలో 47.25 కిలో మీటరు వద్ద
- **ఐదోది:** నకరికల్లు మండలం నరసింగపాడులో 65.45 కిలో మీటరు వద్ద

**ఎకరాకు రూ.50 లక్షలు కావాలి**

ఎకరాకు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని పోలవరం-బనకచర్ల అనుసంధానంలో భూములు కోల్పోతున్న నరసింగపాడు రైతులు కోరుతున్నారు. తమ భూములు సారవంతమైనవే కాకుండా తమ జీవనాధారమని రెండు పంటలు పండుతాయని ప్రభుత్వం ఇచ్చే పరిహారం తమకు ఆమోదయోగ్యం కాదంటున్నారు. భూముల పరిహార విషయంపై రైతులు అధికారులపై, ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు.

# ధాన్యం సేకరణ 70 వేల టన్నులు

- 50,000 టన్నుల నుంచి దఫదఫాలుగా పెంపు
- పెద్దసంఖ్యలో కొనుగోలు కేంద్రాల బాట పడుతున్న రైతులు
- ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో లక్ష టన్నులకు చేరే అవకాశం
- గడచిన ఐదేళ్లలో ఎప్పుడూ 30,000 టన్నులకు మించని సేకరణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఈ సారి మద్దతు ధరకు ధాన్యం సేకరణ రికార్డులను అధిగమిస్తోంది. 48 గంటల్లోగానే ఖాతాల్లో నగదు జమ.. తేమ శాతం నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరిస్తుండటంతో రైతులు తమ ధాన్యాన్ని ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. మరోవైపు బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధర తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు మద్దతు ధరపై ఆశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వంలో మద్దతుధరపై రైతుల్లో ఆశలు చిగురించడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. అంచనాలకు మించి ధాన్యం రావడంతో ఓ దశలో అధికారులు ఒత్తిడికి లోనయ్యారు. సేకరణ లక్ష్యాల పెంపుదలపై రైతుల నుంచి ప్రజాప్రతినిధులకు ఒత్తిడి తీవ్రమైంది. ఇప్పటికే 70,000 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించిన సివిల్ సప్లయిస్ విభాగం, ప్రక్రియ ముగిసే నాటికి లక్ష టన్నులను సేకరిస్తామంటోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క సీజన్‌లో కూడా 30,000 టన్నులకు మించని ధాన్యం సేకరణ.. కూటమి ప్రభుత్వ హయాంలో ఖరీఫ్‌లోనే లక్ష టన్నుల వరకు సేకరించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఆది నుంచీ సవాళ్లే...**

సరిగ్గా ధాన్యం సేకరణ ప్రారంభమయ్యే నాటికి అప్పటి వరకు సివిల్ సప్లయిస్ డీఎంగా విధుల్లో ఉన్న అధికారిపై ఆరోపణలతో ఆయనను కలెక్టర్ వెంకటమురళి సరెండర్ చేశారు. డీఎస్‌వోకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. సరిపడా సిబ్బంది లేరు. ప్రభుత్వం తొలుత ఇచ్చిన ధాన్యం సేకరణ లక్ష్యం 50,000 టన్నుల నెల రోజులకే పూర్తి అయింది. రైతుల అభ్యర్థనలతో అదనంగా కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని డీఆర్సీలో తీర్మానం చేయాల్సి వచ్చింది. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌పై అధికారులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చారు. దీంతో దఫాదఫాలుగా మరో 20,000 సేకరణకు అనుమతి తేగలిగారు. దీంతో 70,000 టన్నుల ధాన్యాన్ని సివిల్ సప్లయిస్ విభాగం సేకరించగలిగింది. ఇంకా 90,000 టన్నుల ధానం రైతుల వద్ద ఉంది.

ఈ క్రమంలో మరో 30,000 టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ పరిస్థితుల్లో మరో మూడు వారాలు కొనుగోలు కేంద్రాలు ఉంటాయని సేకరణ లక్ష టన్నుల వరకు చేరుతుందనే ధీమాను అధికారులు వ్యక్తం చేస్తున్నారు.





ముఖ్యమంత్రికి సమస్యను చెప్తున్న బాల అంకమ్మరావు దంపతులు

## ముఖ్యమంత్రిని కలిసిన బాలఅంకమ్మరావు దంపతులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చీరాలకు చెందిన వల్లెపు బాల అంకమ్మరావు దంపతులు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చీరాల మునిసిపల్, రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు చేశారు. ఇటీవల చీరాల పరిధిలో దంపతులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. ఈక్రమంలో దీనిపై స్థానిక నాయకులు, అధికారుల నుంచి సమగ్ర సమాచారం సేకరించాలని సిబ్బందికి సీఎం సూచించినట్లు దంపతులు తెలిపారు.

### శాస్త్ర, సాంకేతికతపై ఆసక్తి కలిగేలా బోధన చేయాలి



కొండమంజులూరు స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులకు బోధనాపరమైన అంశాలపై సూచనలిస్తున్న బాపట్ల డిప్యూటీ ఈవో వెంకటరావు

పంగులూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాల పట్ల ఆసక్తి కలిగేలా పాఠ్యాంశ బోధన కొనసాగించాలని బాపట్ల డిప్యూటీ ఈవో గల్లా వెంకటరావు కోరారు. మండలంలోని కొండమంజులూరు, పంగులూరు, చందలూరు ఉన్నత పాఠశాలలల్లో శనివారం ఆయా క్యాడర్ల ఉపాధ్యాయులకు సముదాయ శిక్షణ తరగతులు నిర్వహించారు. కొండమంజులూరులో జరిగిన స్కూల్ కాంప్లెక్స్‌లో బాపట్ల డిప్యూటీ ఈవో గల్లా వెంకటరావు పాల్గొని పాఠ్యాంశ బోధనపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో వీరాంజనేయులు, కాంప్లెక్స్ ఛైర్మన్లు ఐ.అనిత, రమాదేవి, గిరిజ, స్కూల్ హెచ్.యం.లు, ఎస్ఏలు, ఎస్జీటీలు, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రిడ్ అనుసంధానంపై.. అధ్యయనం

(5వ పేజీ తరువాయి)

కానున్నారు. వాటర్ గ్రిడ్‌కు తుదిరూపు ఇవ్వనున్నారు. పల్లెల కోసం వాటర్ గ్రిడ్ చేపట్టగా దీనిని పట్టణాలకు అనుసంధానం చేస్తుండడంతో పథక వ్యయ అంచనాలను మళ్లీ రూపొందిస్తున్నారు. ఈ నివేదికలను ప్రభుత్వానికి అందిస్తారు. సీఎం నారా చంద్రబాబునాయుడు వాటర్ గ్రిడ్‌పై ఇంజనీర్లతో రానున్న వారంలో సమీక్షించనున్నట్లు అధికారులు తెలిపారు.

**నిలిచిన పనులకూ అంచనాలు**

మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు అమృత్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆయా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇక పల్నాడు జిల్లాలోనూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన వాటర్ గ్రిడ్ పథకానికీ వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు విడుదల చేయలేదు. ఈ పథకాన్ని అటకెక్కించింది. ఈ పరిస్థితుల్లో అటు అమృత్, ఇటు వాటర్‌గ్రిడ్ పథకాల్లో నిలిచిపోయిన పనులు తిరిగి చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం వ్యయ అంచనాలను రూపొందించింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీలలో నిలిచిపోయిన పనులు చేపట్టేందుకు తాజాగా డీపీఆర్‌లను రాష్ట్రస్థాయి సాంకేతిక కమిటీ ఆమోదించింది. కేంద్రం, రాష్ట్రప్రభుత్వం, మున్సిపాల్టీలు దామాషా ప్రకారం నిధులు సమకూర్చనున్నాయి. రూ.783.39 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు కూడా సిద్ధమయ్యాయి. ఈ పనులు అమృత్ నిధులతో చేపడతారు. అయితే అమృత్ పనులను వాటర్ గ్రిడ్‌కు అనుసంధానం చేసి అటు పల్లెల్లో, ఇటు మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ దిశగా అధ్యయనానికి అధికారులను ఆదేశించింది. సాగర్ నుంచి ఏ ప్రాంతానికి ఎంత సామర్థ్యం కలిగిన పైపులైన్లు అవసరమో అధికారులు నిర్ధారిస్తారు.

**అమృత్.. జలజీవన్ మిషన్ నిధులు అందుబాటులో**

వాటర్ గ్రిడ్‌కు అమృత్ 2.0 జలజీవన్ మిషన్ పథకం నుంచి నిధులు సమకూరనున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాలకు పెద్ద పీట వేస్తోంది. జలజీవన్‌ను 2028 వరకు పొడిగించింది. మున్సిపాల్టీలకు అమృత్ పథకం కింద నిధులు మంజూరు చేసింది. పట్టణాల్లో అమృత్ కింద రూ.783.39 కోట్లతో డీపీఆర్‌లు సిద్ధం చేశారు. ప్రతి మున్సిపాల్టీలో నీటి పథకాలను అభివృద్ధి చేయాల్సి ఉండగా వాటర్ గ్రిడ్ వల్ల వ్యయం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నిధులను వాటర్ గ్రిడ్‌కు మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నారు. వాటర్ గ్రిడ్‌తో పట్టణాలు, పల్లెల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

## పోషణ.. అంతంతే

(5వ పేజీ తరువాయి)

సిబ్బంది కేంద్రంలో ఉన్న చిన్నారుల సంఖ్య, కొత్తగా చేరినవారి సంఖ్య ఆధారంగా 45 రోజులకు సరిపడా ఇండెంట్ ఇచ్చేవారు. అలా 15 రోజుల సరుకులు అదనంగా ఉండడంతో కొత్తగా చేరిన వారికి చేరిన రోజు నుంచే పోషణ అందేది. ఆ పరిస్థితి ఇప్పుడు లేకుండాపోయింది.

**నెలాఖరుకు పాలు**

అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి నెలా మొదటి వారంలో లబ్ధిదారులకు సరుకులు అందిస్తున్నారు. పాలు మాత్రం నెలాఖరు వరకూ రావడం లేదు. అన్ని సరుకులతోపాటు పాలు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రతి నెలా గుడ్ల సంఖ్య తగ్గుతోంది. గుడ్ల ధరల్లో వచ్చే మార్పును బట్టి సరఫరా జరుగుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. కాంట్రాక్టు సంస్థ ధర, రవాణా వ్యయంను బట్టి గుడ్ల సంఖ్యను తగ్గిస్తోందని సిబ్బంది చెబుతున్నారు. ధర పెరిగిన ప్రతి సందర్భంలో గుడ్ల సంఖ్య తగ్గిపోతోందని, ఆ కారణంగా వచ్చిన వాటినే అందరికీ సరిపెడుతున్నామని చెబుతున్నారు.

**యాప్‌లను బట్టే ఇండెంట్**

ప్రభుత్వం నిర్వహిస్తున్న యాప్‌లలో నమోదైన వారి సంఖ్య ఆధారంగా ఇండెంట్ ఇస్తున్నాం. నమోదు కానివారికి సరుకులు రావు. అంగన్వాడీ సిబ్బంది ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. సక్రమంగా నమోదు చేస్తే అందరికీ సరుకులు వస్తాయి. సిబ్బంది యాప్‌లను సక్రమంగా నిర్వహించాలి. - కేపీఎస్.విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, గుంటూరు.

# విజన్ బిల్డింగ్‌తో ప్రయోజనం..అభివృద్ధి

**2047తో చిగురిస్తున్న పేదింట ఆశలు**



శిక్షణ ఇస్తున్న ఏసీ సుబ్బారావు

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. మహిళలు ప్రగతి పథంలో ఉంటే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని నినదించింది. అలాగే గ్రామ స్థాయిలో ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ అంశాలను ప్రణాళిక చేస్తూ విజన్-2047 ప్రారంభించి పొదుపు సంఘాల ద్వారా ఆయా గ్రామాల్లో అవసరాలున్న మౌలిక వసతుల కల్పనకు నివేదికను సిద్ధం చేయనున్నారు. అలాగే మహిళల ఆర్థిక స్వావలంబన కోసం టైలరింగ్, వ్యాపార దుకాణాలకు రుణాలను అందించి ఉపాధి అవకాశాలను పెంచనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ఫేజ్-1లో భాగంగా బల్లికురవ, భట్టిప్రోలు, చీరాల, కొరిశపాడు, ఇంకొల్లు, నిజాంపట్నం, పిట్లవానిపాలెం, రేపల్లె, చుండూరు, యద్దనపూడి, అద్దంకి, అమృతలూరు, చినగంజాం, పర్చూరు మండలాలను ఎంపిక చేశారు. అందుకు అనుగుణంగా గత మూడు రోజులుగా ఎంపికైన మండలాలకు చెందిన వెలుగు ఏపీఎం, సీసీలకు డీఆర్‌డీఏ పీడీ పద్మ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన అధికారులు ఆయా మండలాల్లోని పొదుపు సంఘాలకు శిక్షణ ఇచ్చి అవసరాలను గుర్తిస్తారు. ఎంపికైన యూనిట్లకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవుతాయి. దీంతో సమాఖ్యల అభివృద్ధి సాధ్యమవుతుంది. వీరు పొందిన రుణాల చెల్లింపులో వచ్చిన వడ్డీని పెద్ద మొత్తంలో అభివృద్ధికి ప్రణాళిక చేసేందుకు వీలుంటుంది.

**మూడు రోజుల శిక్షణతో బంగారు భవిత**



మూడు రోజులుగా శిక్షణ పొందుతున్నాం. దీంతో పొదుపు సంఘాల ఆర్థిక ఉపాధికి వెసులుబాటు ఉంటుంది. అలాగే రుణ సాయం ద్వారా వచ్చిన వడ్డీతో అభివృద్ధికి అవకాశం ఉంటుంది.

- బుజ్జి, సీసీ, సాల్మన్ సెంటర్ క్లస్టర్

**రహదారి భద్రత అందరి బాధ్యత**

**కలెక్టర్ తమీమ్ అన్సారియా**

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రత అందరి బాధ్యత అని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధలను పాటించాలని సూచించారు. స్థానిక రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపవద్దన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని వివరించారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వాహనచోదకులు రోడ్డు భద్రత నిబంధలను విధిగా పాటించాలన్నారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల నెల రోజుల్లో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, రైజ్ కాలేజీ ప్రిన్సిపాల్ భాస్కరరావు, మార్కాపురం ఆర్టీవో అమర్ నాయక్, వాహన తనిఖీ అధికారులు పాల్గొన్నారు.


# ట్రాన్స్‌ఫార్మర్‌లతో పొంచి ఉన్న ముప్పు



రక్షణ వలయం లేకుండా పర్చూరులోని శారదా హైస్కూల్ సమీపంలో, పోలీసు స్టేషన్ ఎదురుగా, ప్రధాన కూడలిలో, నాగులపాలెం హైస్కూల్ సమీపంలోని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు

- రక్షణ చర్యలు తీసుకోవడంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం
- ప్రజల ఆందోళన

పర్చూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌లకు రక్షణ వలయం లేకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశారు. అయితే వీటికి రక్షణగా కంచెలను వేయలేదు. ఇటీవల పర్చూరు పరిధిలో అనేక విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు చోటుచేసుకోవడం, పలువురు ప్రాణాలు కోల్పోవడం ప్రజలను కలవరానికి గురిచేస్తుంది. ఆయా ప్రధాన రహదారుల కూడలి నుంచి ప్రైవేటు స్కూల్ బస్సులు చిన్నారులతో రాకపోకలు సాగించడం ఆందోళనకరంగా మారింది. పర్చూరులోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారితోపాటు, ఆయా పాఠశాలలకు వెళ్లే ప్రధాన కూడలిగా ఉన్న శారదా హైస్కూల్ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌కు లేక ప్రమాదకరంగా ఉంది. దశాబ్దకాలాలు గడుస్తున్నా విద్యుత్ వైర్లను మార్చక పోవడం, దెబ్బతిన్న ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ పోల్స్‌ను ఏర్పాటు చేసి దెబ్బతిన్న ఇనుప స్తంభాలను మాత్రం అలానే ఉంచారు. దీంతో ఎప్పుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఏం ప్రమాదాలు ముంచుకొస్తాయోనని ప్రజలు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వైర్లు సాగిపోయి కిందికి జారి వేలాడుతున్నాయి. మనిషి పట్టుకునే దూరంలో ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. సమస్యను విద్యుత్ అధికారులకు విన్నవించుకుంటున్న పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్కడా ప్రమాదాలు చోటుచేసుకోక ముందే విద్యుత్ శాఖ అధికారులు వాటిపై దృష్టి సారించి ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ వలయాలను ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




## రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

- మీసేవా కేంద్రాల చుట్టూ ప్రజల ప్రదక్షిణలు
- సాఫ్ట్‌వేర్‌లో సమస్యతో జాప్యం
- త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తామంటున్న అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ ప్రక్రియను సక్రమంగా సాగలేదు. దరఖాస్తులు చేసుకున్న ఆరు నెలల తర్వాత కొత్తకార్డులు ఇస్తామని చెప్తూ కాలయాపన చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్ కార్డులు లేని ప్రజల్లో ఆశలు చిగురించాయి. అందుకు అనుగునంగా నూతన సంవత్సరం కానుకగా కొత్త రేషన్ కార్డుల జారీతోపాటు చేర్పులు, మార్పులకు అవకాశం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాఫ్ట్‌వేర్‌లో ఉత్పన్నమైన కొన్ని సమస్యలతో ఆ ప్రక్రియ చేపట్టడంలో జాప్యమవుతోంది. విషయం తెలియని ప్రజలు రేషన్ కార్డుల కోసం మీసేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. వాటి నిర్వాహకులు ఇంకా సైట్ ఓపెన్ కావడం లేదని చెప్పి పంపుతున్నారు.

**అధికారులకు పెద్దఎత్తున అర్జీలు**

ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటుండటంతో కొత్తవి కోరుతూ మండల, జిల్లాస్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం లేకపోవడంతో ఇప్పుడు అందుకోసం అనేక మంది అటు తహసీల్దార్, ఇటు పౌసరఫరాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కుటుంబంలో ఒకరు చనిపోయి ఉంటే వారి తొలగింపు, పుట్టిన వారి పేర్ల చేర్పు, కుటుంబంలో ఐదారుగురు గతంలో కలిసి ఉండి ఇప్పుడు విడిపోయి ఉంటే అటువంటి వారు కొత్త కార్డుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల పౌరసఫరాల ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్‌కార్డులతోపాటు చేర్పులు, మార్పుల కోసం వస్తున్న అర్జీల విషయాన్ని జిల్లా అధికారులు వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఆవిషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నదని, త్వరలోనే ప్రకటన వస్తుందని ఉన్నతాధికారులు చెప్పినట్లు సమాచారం.




## భళా.. బాలోత్సవం

జిల్లాస్థాయి బాలోత్సవం శనివారం ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వివిధ పాఠశాలలు, డ్యాన్స్ అకాడమీలకు చెందిన చిన్నారులు చేసిన నృత్యాలు, వేషధారణలు, ఏకపాత్రాభినయాలు అదుర్స్ అనిపించాయి.

# బయోమెట్రిక్ బేఖాతర్!

- సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు
- పలు ప్రాంతాల్లో మూడో వంతు డుమ్మా
- అనధికారికంగా కొందరు విధులకు గైర్హాజరు
- వారంవారం ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నా 70శాతం మించని హాజరు
- పనితీరూ అంతంతమాత్రమే

ఒంగోలు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల తీరులో ఏమాత్రం మార్పు కన్పించడం లేదు. వారిని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ కొందరు 'మేమింతే.. మారమంతే' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. వారు ఏమేరకు విధి నిర్వహణలో సక్రమంగా పనిచేస్తున్నారు, పౌర సేవలు అందించడంలో ఎంత క్రియాశీలకంగా ఉంటున్నారన్న విషయాన్ని అలా ఉంచితే అనేక మంది అసలు సచివాలయానికే రాని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయగా గ్రామీణ ప్రాంతాల్లో 14 మంది, పట్టణాలలో 10 మంది ఉద్యోగులను సగటున నియమించారు. వివిధ శాఖల పనుల కోసం ఈ సిబ్బంది నియామకం జరిగింది. అయితే వారి పర్యవేక్షణ విషయంలో స్పష్టత లేకపోవడం, ఉద్యోగుల వారీ విధుల నిర్వహణపై సరైన శిక్షణ ఇవ్వకపోవడంతో పనితీరు అస్తవ్యస్తంగా మారింది. పేరుకు సచివాలయ అడ్మిన్ సెక్రటరీ ఉన్నప్పటికీ మిగతా సిబ్బంది నియంత్రణ ఆచరణలో సక్రమంగా లేదు.

**గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు**

ఈ విషయాలను గుర్తించిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈక్రమంలో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల తరహాలో వీరు కూడా సచివాలయానికి ఉదయం 10 గంటలకల్లా వచ్చి బయోమెట్రిక్ హాజరు వేయాలి. ఒకవేళ వివిధ సర్వేలు, ఇతర పనులకు క్షేత్రస్థాయిలో ఉంటే మొబైల్ యాప్‌లో హాజరు వేయాలి. వారంవారం కలెక్టర్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ హాజరును సమీక్షిస్తున్నారు. ప్రభుత్వం కూడా అన్ని జిల్లాల హాజరును పరిశీలిస్తోంది. అయినా అనేక మంది బయోమెట్రిక్ హాజరును బేఖాతర్ చేస్తున్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ నిర్వహించే సమీక్ష నివేదికలను పరిశీలిస్తే బయోమెట్రిక్ హాజరును సచివాలయ ఉద్యోగులు ఏస్థాయిలో బేఖాతరు చేస్తున్నారన్న విషయం అర్థమవుతోంది.

- జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో కలిపి మొత్తం 719 సచివాలయాలు ఉన్నాయి. ఈనెల 3వ తేదీ నుంచి 10 వరకు వారం రోజుల్లో 718 సచివాలయాల సిబ్బంది హాజరు వివరాలు అధికారులకు అందాయి. వాటిలో 6,078 మంది ఉద్యోగులు ఉంటే కేవలం 4,292 మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు వేశారు. దాదాపు 30 శాతం మంది బయోమెట్రిక్ గురించి పట్టించుకోలేదు.
- ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం నగరంలోని గాంధీనగర్, శివప్రసాద్ కాలనీ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాంధీనగర్‌లోని సచివాలయంలో పనిచేసే సెక్రటరీల్లో ఒక్కరు కూడా అక్కడ కన్పించలేదు. దీంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ నోటీసులు ఇవ్వాలని నోడల్ ఆఫీసర్ బాషాను ఆదేశించారు.
- జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనేక మంది విధులకు అతిథులుగా మారారు. మరికొంత మంది సమయపాలన పాటించడం లేదు. ఈ విషయాలను గుర్తించిన ప్రభుత్వం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని ప్రవేశపెట్టినా చాలా మంది బేఖాతరు చేస్తున్నారు. వారంవారం సచివాలయ ఉద్యోగుల హాజరుపై కలెక్టర్ నిర్వహిస్తున్న సమీక్షలో ఈ విషయం స్పష్టమవుతోంది. అధికార వర్గాల సమాచారాన్ని బట్టి జిల్లాలో దాదాపు 30 శాతం మంది సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరును పట్టించుకోవడం లేదన్న విషయం వెల్లడవుతోంది.

**70.76 శాతం మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు**

జిల్లాలో ఉన్న 719 సచివాలయాలలో నెట్ సౌకర్యం లేనివి 11 ఉన్నాయి. వాటిలో రిజిస్టర్ హాజరు నమోదు చేయాలి. అందిన సమాచారం మేరకు 718 సచివాలయాలలోని మొత్తం 6,078 మంది ఉద్యోగులలో ఈనెల 3తో ముగిసిన వారానికి 70.76 శాతం మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు వేశారు. 10వతేదీతో ముగిసిన వారానికి 70.62 శాతంతో 4,292 మంది మాత్రమే హాజరైనట్లు సమాచారం. ఆయా ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. ఎస్.ఎన్.పాడు మండలంలో గరిష్ఠంగా 3వ తేదీ నాటికి 47.27 శాతం హాజరు ఉంది. 10వతేదీ నాటికి 51.35 శాతానికి మెరుగుపడింది. ఈ మండలంలో రెండు సచివాలయాలు ఆఫ్‌లైన్‌లో ఉన్నాయి. ఇక ఈ నెల 10 నాటికి వారం రోజుల హాజరు శాతాన్ని పరిశీలిస్తే అర్థవీడు మండలంలో 50 శాతం మంది హాజరు మాత్రమే కనిపిస్తోంది. ఆ మండలంలోని 8 సచివాలయాల్లో నాలుగు చోట్ల మాత్రమే ఆన్‌లైన్ సౌకర్యం ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇక అన్ని సచివాలయాలకు నెట్ సౌకర్యం ఉన్నప్పటికీ కొత్తపట్నం మండలంలో 15 సచివాలయాల పరిధిలో 139 మంది ఉద్యోగులు ఉంటే 56.12 శాతంతో 78 మంది మాత్రమే బయోమెట్రిక్ హాజరు వేశారు. పెద్దారవీడులో 62.04 శాతం, తర్లుపాడులో 65.03, పొదిలిలో 65.48, కురిచేడులో 65.48, సింగరాయకొండలో 65.97, ఒంగోలు రూరల్‌లో 66.02 శాతం హాజరు ఉంది. పట్టణాలలో పరిశీలిస్తే.. మార్కాపురం పట్టణంలో 81.87 శాతం మంది హాజరు ఉండగా ఒంగోలులో 74.92, చీమకుర్తిలో 72.68, కనిగిరిలో 72.58, గిద్దలూరులో 79.78 శాతం కనిపిస్తోంది. సెలవులో ఉండేవారు సైతం మొబైల్ ఫోన్‌లో ఆ విషయం నమోదు చేసే అవకాశం ఉన్నప్పటికీ అనేక మంది అలా చేయకుండా అనధికారికంగా గైర్హాజరవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే అంశాన్ని కలెక్టర్ అన్సారియా ఏడు రోజుల క్రితం వీసీలో గుర్తించి అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు.



ఒంగోలులోని సచివాలయం

## నాణ్యమైన విద్యా బోధన చేయాలి

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన చేయాలని జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటరు సత్యసాగర్ అన్నారు. శనివారం యద్దనపూడి పాఠశాల క్లస్టరు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంప్లెక్స్ చైర్మన్ ఎం.దేవేంద్రరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యసాగర్ మాట్లాడుతూ విద్యార్థుల బోధనపై ఉపాధ్యాయులకు ప్రత్యేక సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోపి పాల్గొన్నారు.

## నేడు ఉచిత మెడికల్ క్యాంప్

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) :చీరాల ఆర్వోబీ సమీపంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. 9:30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ క్యాంపులో ఎముకలు, కీళ్లు, మోకాళ్లు, భుజాలు నొప్పికి పరీక్షలు చేస్తారు.

## జిల్లా అధికారులకు జర్నలిస్టుల ఫిర్యాదు

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాలలో వైద్యులు జర్నలిస్టులను చులకన భావంతో చూస్తున్నారని ఆరోపించారు. ఈక్రమంలో శనివారం జేసీ ప్రకర్‌జైన్, డీసీ శేషకుమార్‌ను వేర్వేరుగా కలిసి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

# మంత్రి ఆదేశించినా నీటిని చల్లడం లేదు



బల్లికురవలో గ్రానైట్ లారీలు వెళ్తున్న సమయంలో లేస్తున్న దుమ్ము



నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీ వద్ద దెబ్బతిన్న రోడ్డుపై నుంచి వస్తున్న ధూళి

- దుమ్ముతో అల్లాడుతున్న ప్రజలు
- బల్లికురవ నుంచి నక్కబొక్కలపాడు వరకు గ్రానైట్ లారీల తాకిడికి లేస్తున్న ధూళి
- రోడ్డును తడపాలని నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీవాసుల వినతి
- ఆందోళనలో ప్రయాణికులు

బల్లికురవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ మండల కేంద్రం నుంచి నక్కబొక్కలపాడు వరకు ఉన్న రోడ్డు పూర్తి స్థాయిలో దెబ్బతినడంతో గ్రానైట్ లారీల రవాణాతో లేస్తున్న దుమ్ముతో కిడ్నీలు దెబ్బతింటున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగే వరకూ రోడ్డుకు నీటిని చల్లించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పది రోజుల కిందట అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇంత వరకు నీటిని చల్లించే పనులు మెదలు కాలేదు. ఈ రోడ్డులో నిత్యం వందలాది గ్రానైట్ ముడిరాయి లారీలు మార్టూరు వరకు వెళుతుంటాయి. ఈ వాహనాలు వెళ్లే సమయంలో రోడ్డు నుంచి లేస్తున్న దుమ్ము గృహాలలోకి వెళుతుందని ఈ ప్రభావంతో డస్టు అలెర్జీలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీకి వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను పలువురు కలిసి తమకు దుమ్ము బాధ నుంచి విముక్తి కల్పించాలని త్వరగా రోడ్డు నిర్మాణం లేయాలని, రోడ్డు వేసే వరకు ప్రతి రోజు ట్యాంకర్ల ద్వారా నీటిని రోడ్డుకు చల్లించాలని వారు ఆయనకు విన్నవించారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి మండల పరిషత్ ఎంపీడీవో కుసుమకుమారికి రోడ్డుకు నీటిని చల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు నీటిని చల్లించేందుకు నిధులు ఎలా సమకుర్చాలా అనే అలోచనలో ఉన్నారు. రోడ్డుపై నిత్యం తిరిగే గ్రానైట్ లారీలు, ఫ్యాక్టరీల యజమానులు అందరు కలిసి వేసవి కాలం ముగిసే వరకు బల్లికురవ నుంచి నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీ వరకు దుమ్ము లేవకుండా నీటిని చల్లించేలా స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మార్గంలో ముందు గ్రానైట్ లారీ వెళుతుంటే వెనుక వచ్చే వారు కొంత సేపు కనిపించనంత దుమ్ము వస్తుందని ప్రజలు వాపోతున్నారు. రానున్న వేసవి ఎండల ప్రభావంతో మరింత రోడ్డు నుంచి దుమ్ము లేచే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దుమ్ము ప్రభావంతో నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనికి చెందిన పలువురుకి అనారోగ్యం బారిన పడ్డారని వారు అంటున్నారు. కిడ్నీలు చెడిపోతున్నాయని పలు రకాల అంటు వ్యాధులు వస్తున్నాయని వారు తెలిపారు. అధికారులు వెంటనే రోడ్డు నుంచి దుమ్ము లేవకుండా ప్రతి రోజూ మూడు పూటలా నీటిని చల్లించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



పంగులూరులో ఇంకుడు గుంత పనులను పరిశీలిస్తున్న ఏపీవో సంతోషం

## ఇంకుడు గుంత పనులను చేపట్టాలి

పంగులూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : హౌసింగ్ లే అవుట్లలో నిర్మితమైన గృహ సమాదయాల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సంతోషం అన్నారు. సచ్చాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పంగులూరులో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణ పనులను శనివారం ఏపీవో పరిశీలించారు. మండలంలోని పంగులూరు, కొండమూరు గ్రామాలలో 23 ఇంకుడు గుంతలను గ్రౌండింగ్ చేసినట్లు ఏపీవో తెలిపారు. లబ్ధిదారులు ఇంకుడు గుంతల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీవో సూచించారు. కార్యక్రమంలో ఈసీ మురళి, టెక్నికల్ అసిస్టెంట్ సుధారాణి, ఎఫ్ఏ వెంకటేష్ పాల్గొన్నారు.

## బాలబాలికలకు హోమియో మాత్రల పంపిణీ



హోమియో మందులను వేయిస్తున్న డాక్టర్ అంజమ్మ

మార్టూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మార్టూరులోని అంబేడ్కర్‌నగర్‌లో ఎంపీపీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హోమియో మాత్రలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మార్టూరు హోమియో ఆస్పత్రి వైద్యులు అంజమ్మ, సిబ్బంది తనూజ, కాంపౌండర్ శేషసాయి, ఎస్‌కే ఖాజాబీ పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

బల్లికురవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళుతున్న రెండు మోటార్ బైకులు ఢీకొనడంతో ఇద్దరు గాయాలయ్యాయి. ఈఘటన శనివారం బల్లికురవ గ్రామంలో జరిగింది. అందిన సమాచారం మేరకు బల్లికురవ ఎస్సీ కాలనీకి చెందిన బొంతా శ్యాంబాబు సెంటర్‌కు వచ్చి బైకుపై ఇంటికి వెళుతుండగా, అంబడిపూడి నుంచి బల్లికురవ వస్తున్న అఖిల్ బైకు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో శ్యాంబాబు కాలు నుజ్జునుజ్జయి తీవ్రంగా గాయపడ్డాడు, మరో బైకుపై ఉన్న అఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షత గాత్రులను 108లో ప్రథమ చికిత్స అనంతరం ఒంగోలు వైద్య శాలకు తరలించారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లతో ఎస్ఐ వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. అర్ధరాత్రి జాతీయ రహదారిలో ఇసుక రవాణా జరుగుతుందన్న సమాచారంతో ఎస్సై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈక్రమంలో రెండు ట్రాక్టర్‌లను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

## విద్యతోనే ఉన్నతస్థాయికి మహిళలు

మార్టూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మహిళలు విద్యావంతులుగా ఎదగాలని, తద్వారా వారు అన్నిరంగాల్లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని శ్రీహర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవి కుమార్ అన్నారు. శనివారం మార్టూరులో శ్రీహర్షిణి విద్యాసంస్థల ప్రాంగణంలో ద్వితీయ ఇంటర్, డిగ్రీ ఫైనల్, 10 వతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా చదువు, కోర్సుల్లో ఎన్నో మార్పులు వస్తున్నాయన్నారు. దానికి అనుగుణంగా విద్యార్థులు వారి లక్ష్యాలకు అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకోవాలన్నారు. అదేవిధంగా యువతులు కోరుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి చదువును నిచ్చెనగా చేసుకోవాలన్నారు. మార్చి నుంచి ఏడుగుండ్ల పాడు వద్ద యువతులు కోసం ప్రత్యేకం గా ఇంజనీరింగ్, ఎంసీఏ, ఎంబీఏ కాలేజీలను శ్రీహర్షిణి విద్యా సంస్థల ఆధ్వర్యంలో నూతనంగా కాలేజీలను ఏర్పాటు చేస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, సతీష్, నాగూర్‌వలి, విజయభాస్కర్, బోసుబాబు, బెంజిమన్ పాల్గొన్నారు.

## ఉచిత ఇసుక పాలసీని అమలు చేయండి

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చీరాలలో ఉచిత ఇసుక పాలసీను పారదర్శకంగా అమలు చేయాలని పలువురు వైసీపీ నాయకులు కోరారు. ఈసందర్భంగా శనివారం తహసీల్దార్ గోపీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.

## నీటి వనరుల సరళిని అంచనా వేయండి

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : భూమిలో ఉన్న నీటి తేమ, చెరువులు, పంపింగ్ స్కీముల సరళిని నిశితంగా పరిశీలించి అంచనా వేయాలని సహాయ గణాంకాల అధికారులు రామకృష్ణ, ప్రేమ కుమారి, సురేష్ అన్నారు. శనివారం మండల సమావేశ కార్యాలయంలో చీరాల, వేటపాలెం, కారంచేడు మండలాలకు సంబంధించిన వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జల ఉపరితలం, నీటి మట్టం, సాగునీటి కాలువలు, తేమ శాతం, బావులు, గోటపు బావులు, లిఫ్ట్ఇరిగేషన్ వంటి వాటిపై అంచనాలు వేయాలన్నారు. గత ఖరీఫ్‌లో వినియోగించిన నీటి శాతం వంటి వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో మూడు మండలాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు



బల్లికురవ బస్‌స్టాండ్ వద్ద పేరుకుపోయిన చెత్త

## తూతూమంత్రంగా స్వచ్ఛాంధ్ర

- ఫొటోలతో ముగించిన అధికారులు
- పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టని అధికారులు
- ఎక్కడ చెత్త అక్కడే



రోడ్డు పక్కన ఉన్న వ్యర్థాలు



ఎంపీడీవో కార్యాలయంలో ఆరకొరగా ఉన్న చెత్తను తొలగిస్తున్న అధికారులు

బల్లికురవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర పేరుతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు తూతూ మంత్రంగా సున్నం చల్లించి శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టిన్లు ఫొటోలకు దిగి వాటిని ఉన్నతాధికారులకు అప్‌లోడ్ చేసి చేతులు దుపులుకుంటున్నారు. మండల కేంద్రంలో పారిశుధ్యం పడకవేసి ఉన్నప్పటికీ ప్రత్యేక శానిటేషన్ డే మాత్రం ఫొటోలకే పరిమితం అయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. బల్లికురవకు నలువైపులా కూడలిలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి ఉండగా, అధికారులు కేవలం మండల కార్యాలయంలో ఉన్న పిచ్చి మొక్కలను తీయించి, 11 గంటల సమయంలో పాఠశాల విద్యార్థులో 10 నిమషాలు ర్యాలీతో కార్యక్రమాన్ని మమ అనిపించారు. పెద్ద ఎత్తున చెత్తను వేస్తున్న దుకాణదారులతో కనీసం అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించలేదు. ఇలాంటి తూతూ మంత్రం కార్యక్రమాలతో స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా నూరుశాతం పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు ముగిసిన శిక్షణ

బల్లికురవ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నుంచి పోషణ్‌బీ, పడాయిబీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు జరుగుతున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణలో కేంద్రాల నిర్వహణ, వారికి అందించాల్సిన పౌష్టికాహారంపై ప్రత్యేకంగా వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు సలోమి, విజయనిర్మల పాల్గొన్నారు.

### పిల్లల చదువుపై దృష్టి సారించాలి

పంగులూరు : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలలో అక్షరాస్యతను పెంపొందించి, పాఠశాలకు సంసిద్ధులను చేయడంపై కార్యకర్తలు దృష్టి సారించాలని ముప్పవరం సెక్టార్ సూపర్‌వైజర్ పద్మజ సూచించారు. మండలంలోని కొండమంజులూరు గ్రామంలో మూడు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల ఆరోగ్యం, పోషకాహారంతో పాటు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ శిక్షణలో మండలంలోని 55 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

### దివ్యాంగుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి

చినగంజాం : అంగన్‌వాడీ కేంద్రాల్లో దివ్యాంగ చిన్నారుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఇంకొల్లు ప్రాజెక్ట్ సీడీపీవో టీ.ఝాన్సీ అన్నారు. మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర పథకాలైన పోషణ్ భీ, పడాయిభీపై ఇంకొల్లు, చినగంజాం మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. దివ్యాంగ చిన్నారులకు సంబంధిచిన విషయాలపై సంతరావూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్ అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కే.వాణిశ్రీ, ఎన్.సుమలత, కే.ఉషాకుమారి, చినగంజాం, ఇంకొల్లు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

యద్దనపూడి : మూడురోజులుగా అంగన్వాడీ కార్యకర్తలకు జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. యద్దనపూడిలో జరుగుతున్న శిక్షణకు పర్చూరు సీడీపీవో సుభద్ర ముఖ్య ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి హర్ష, సూపర్ వైజరు సుజాత పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్ పద్మజ

# పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

### ఘనంగా స్వచ్ఛాంధ్ర..స్వచ్ఛ దివస్

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలు విధిగా పెంచాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు. డీఎల్‌డీవో పద్మావతి, తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో గోపీకృష్ణ అన్నారు. శనివారం చీరాల మండల పరిధిలోని జాండ్రపేట హైస్కూల్ వద్ద స్వచ్ఛ అంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. చీరాల మండల పరిధిలోని తోటవారి పాలెం పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సెక్రటరీ మేడికొండ భారతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు గ్రామంలో చెత్తా చెదారాన్ని తొలగించారు. వీధుల్లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

### వేటపాలెంలో..

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం వలన ప్రాంతం సస్యశ్యామలంగా ఉంటుందని వేటపాలెం ప్రత్యేక అధికారి రాజా దెబోర, ఎంపీడీవో రాజేష్ అన్నారు. శనివారం వేటపాలెంలో స్వచ్ఛ అంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చెత్తా చెదారాలను తొలగించారు. వర్మీ కంపోస్ట్ తయారీకి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలోసెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

యద్దనపూడి, (మార్టూరు) : స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామాలలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. యద్దనపూడి మండలంలోని వింజనంపాడు గ్రామంలో మొక్కలను నాటడంతోపాటు, గ్రామస్థులకు చెత్త సేకరణ బుట్టను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాదినేని సుధీర్, పెదరంగారావు పాల్గొన్నారు. యద్దనపూడి గ్రామంలో హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంపీడీవో లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహించారు. గన్నవరంలో ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ప్రకాష్ రావు,నల్లపనేని రంగయ్యచౌదరి పాల్గొన్నారు. మార్టూరులో కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు.

పంగులూరు : చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన డం పింగ్ యార్డులను సంపద కేంద్రాలుగా వినియోగించుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి పి.బాలమ్మ సూచించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రామకూరు గ్రామంలోని డంపింగ్ యా ర్డ్‌ను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో, నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాలమ్మ, ప్రత్యేకాధికారి అనంతరాజు శనివా రం అధికారులతో కలసి పరిశీలించారు. తడి, పొడి చెత్తలను ఇంటివద్దనే వేరు చేసి క్లాప్ మిత్రలకు అందచేయాలని సూచించారు. ఈ సందర్భంగా డంపిం గ్ యార్డ్ ప్రాంగణంలో మొక్క లు నాటారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.స్వరూపారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివ య్య, ఈవో ఆర్డీ సుమంత్, ఏపీవో సంతోషం, ఈసీ మురళి, కార్యదర్శి శిరీష, వీఆర్వో బాపయ్య, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.భీమలింగేశ్వరస్వామి ఆలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీ పీ నాయకులు బాచిన చెంచు ప్రసాద్, ఈవో శ్రీనివాసరావు, అర్చక స్వాములు సునీల్, సాంబశివరావు పాల్గొన్నారు.



రామకూరులో డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున ప్రత్యేకాధికారి బాలమ్మ

పర్చూరు : మనిషిలో స్వచ్ఛమైన మార్పు కోసమే స్వచ్ఛ కార్యక్రమం అని హోమియో వైద్యుడు దాసరి చంద్ర శేఖర్ అన్నారు. ఉప్పుటూరులో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

చినగంజాం : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పర్చూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని మహాలక్ష్మి కాలనీలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలానికి 60 సోపిట్లు(ఇంకుడుగుంతలు) మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. కాలనీవాసులకు చెత్త సేకరణ డబ్బాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఆత్మారావు, రాఘవయ్య, గృ హ నిర్మాణ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు రాజశేఖర్, బసవ రాణి, ఏపీవో లక్ష్మీదేవి, కారదర్శి అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



వింజనంపాడులో చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న నాయకులు

## విట్ జాతీయ పోటీల్లో సెయింట్ ఆన్స్ ప్రతిభ

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఫెస్టివల్ వాలీబాల్ పోటీలలో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఏకంగా 30 జట్లతో తలపడి విజేతలుగా నిలిచారు. ఈక్రమంలో శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అమరావతిలోని విట్ వర్సిటీ పోటీలు జరగగా ఉత్తమంగా రాణించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జగదీష్, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, డా.సి సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, విజేతలు విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలతో కళాశాల ప్రతినిధులు

# మద్రాసు మత్స్యకారులపై ఫిర్యాదు

- హోం మంత్రికి సమస్యను వివరించిన వాడరేవు జాలర్లు
- విచారణ చేస్తామని హామీ

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : మద్రాసు తీరం నుంచి తెలుగు రాష్ట్రంలోకి అక్రమంగా చొరబడి ట్రావలర్ బోట్లతో వేట చేస్తున్నారని బాపట్ల జిల్లా చీరాల పరిధిలోని వాడరేవు సముద్రతీర మత్స్యకారులు హోం మంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం హోం మంత్రిని మర్యాద పూర్వకంగా మత్స్యకారులు కలిశారు. ఈసందర్భంగా వారు ట్రావలర్ బోట్లతో వేట సాగిస్తున్న ఫొటోలను హోం మంత్రికి అందజేశారు. అంతేకాకుండా తెలుగు రాష్ట్ర మత్స్యకారులపై మద్రాసు మత్స్యకారులు దాడులకు తెగబడి, వలలు లాక్కుంటున్నారని వివరించారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు. హోం మంత్రిని కలిసిన వారిలో వాడరేవు మత్స్యకార అభివృద్ధి సంఘం ఉపాధ్యక్షుడు యజ్జల బాబ్జీ, సెక్రటరీ కోడా రవి తదితర మత్స్యకారులు ఉన్నారు.



హోం మంత్రి అనితకు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకారులు




తీరంలోకి చొరబడిన మద్రాసు బోటు ఫొటో

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

ఆదివారం 16 ఫిబ్రవరి 2025


## స్వర్ణభారత్ ట్రస్ట్‌కు నేడు ప్రముఖుల రాక

వెంకటాచలం (ఆంధ్రజ్యోతి): వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు ఆదివారం పలువురు ప్రముఖులు రానున్నారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మనుమడు విష్ణుకు ఇటీవల సాత్వికతో మహాబలిపురంలో వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో నెల్లూరులోని ఆత్మీయుల కోసం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు.

### రామాయపట్నం పరిసరాల్లో

# టౌన్‌షిప్!



- అమరావతి రైతులను ఆదర్శంగా తీసుకోండి
- భూసేకరణకు సహకరిస్తే అభివృద్ధికి నాదీ భరోసా
- నష్టపరిహారంతోపాటు వారు నిలదొక్కుకునేలా చర్యలు
- నైపుణ్యంలో యువతకు శిక్షణ ఇప్పిస్తాం
- ఉద్యోగాలు కాదు.. పారిశ్రామిక వేత్తలుగా మారండి
- కందుకూరు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

కందుకూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు పరిసరాల్లో టౌన్‌షిప్ అభివృద్ధికి చర్యలు తీసుకోబోతున్నామని, భూసేకరణ ప్రక్రియకు రైతులు సహకరిస్తే వారికి తగిన పరిహారం ఇవ్వడంతోపాటు వారు నిలదొక్కుకునేలా అండగా ఉండి ముందుకు నడిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కందుకూరులో జరిగిన వివిధ కార్యక్రమాలలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. పట్టణంలోని దూబగుంట గ్రామంలో స్వచ్ఛాంధ్రపై ప్రజలకు అవగాహన కార్యక్రమంతోపాటు చెత్తను ప్రాసెస్ చేసే (మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్) ప్లాంట్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ రాజధాని అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులను ఆదర్శంగా తీసుకుని రామాయపట్నం పోర్టు పరిసర గ్రామాల వారు కూడా భూసేకరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అందుకోసం రైతులు సహకరిస్తే వారి భూములకు తగిన పరిహారం ఇవ్వడంతోపాటు వారు తిరిగి రైతులుగా నిలదొక్కుకునేలా ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా అండదండలు అందించి ముందుకు నడిపిస్తామని తెలిపారు.



### భూసేకరణకు సహకరిస్తే..

భూసేకరణ ప్రక్రియకు మీరు సహకరిస్తే రాష్ట్రం, మీరు అభివృద్ధి చెందుతారు. అలా కాకుండా అడ్డంకులు సృష్టిస్తే మీరు నష్టపోతారు. రాష్ట్ర భవిష్యత్తు దెబ్బతింటుంది. రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా భారీ పరిశ్రమలు రాబోతున్నాయి. ఇప్పటికే ఇండోసోల్ సోలార్ ఎనర్జీ పరిశ్రమ రాగా త్వరలోనే రమారమి రూ.లక్ష కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ భారీ రిఫైనరీ కమ్ పెట్రో కెమికల్స్ కర్మాగారం రాబోతున్నది. మరికొన్ని పరిశ్రమలు కూడా రామాయ పట్నం పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు సిద్ధంగా ఉన్నారు. బీపీసీఎల్ ఏర్పాటుకు అన్ని రకాల అనుమతులు ఇచ్చేశాము. డీపీఆర్ సిద్ధమయ్యాక భూసేకరణ ప్రక్రియ చేపడతాము. ఈ పరిశ్రమల్లో వేలాదిమందికి ఉద్యోగాలు రాబోతున్నందున రామాయపట్నం పోర్టు పరిసరాల్లో టౌన్‌షిప్ అభివృద్ధికి ఆలోచన చేస్తున్నాం.' అని చంద్రబాబు వెల్లడించారు.

### ● కందుకూరులో స్కిల్‌సెంటర్

రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా వచ్చే పరిశ్రమల్లో వేలాది మందికి ఉద్యోగాలు రానున్నందున ఈ ప్రాంతం వారికే ఆ ఉద్యోగాలు దక్కేలా తగిన నైపుణ్య శిక్షణను ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇందుకోసం కందుకూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (నైపుణ్య శిక్షణ కేంద్రం) ఏర్పాటుకు త్వరలోనే శ్రీకారం చుడతామన్నారు. యువత కేవలం ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా తాము పారిశ్రామికవేత్తలుగా మారాలన్న సంకల్పంతో ఆలోచనలు చేయాలని సూచించారు. ఒకప్పుడు కష్టపడి పనిచేస్తేనే ఆదాయం వచ్చేదని మారిన పరిస్థితుల్లో కష్టపడటం కాకుండా స్మార్ట్‌గా పని చేయగలిగితే సంపద సృష్టి జరుగుతున్నదని తెలిపారు. అలాగే ఇంట్లో కూర్చొని నాలెడ్జ్ ఎకానమీలో పరిశ్రమలు స్థాపించే పరిస్థితులు వచ్చాయని, యువత ఆ దిశగా దృష్టి సారించి పరిశ్రమల స్థాపన ద్వారా మరికొందరికి ఉపాధి కల్పించాలని సూచించారు.

ఆయా కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### చెత్తతో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు

చెత్తతో విద్యుత్ ఉత్పత్తి చేసేలా పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని, తొలివిడతగా నెల్లూరు, రాజమహేంద్రవరంలో వీటిని ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. నెల్లూరులో 10 మెగావాట్లు, రాజమహేంద్రవరంలో 12 మెగావాట్ల సామర్థ్యంతో ఈ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఈ ప్లాంట్ల కోసం నెల్లూరులో ప్రతిరోజు 600 టన్నుల చెత్తను, రాజమండ్రిలో 640 టన్నుల చెత్తను వినియోగించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని, ఇందులో 36 లక్షల టన్నుల చెత్తను ఇప్పటికే శుభ్రం చేయగలిగామని తెలిపారు. ఈ ఏడాది గాంధీ జయంతి (అక్టోబరు 2వ తేదీ) నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త ఉండకూడదన్న లక్ష్యంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

### గర్భకండ్రిక భూ సమస్య పరిష్కరించాలి

కందుకూరు ప్రాంతంలో గర్భకండ్రిక భూ సమస్యను తక్షణం పరిష్కరించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. శనివారం కందుకూరులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కందుకూరు మండల పరిధిలోని నాలుగు గ్రామాలలో 1829 ఎకరాల రైతుల భూమిని మ్యూటేషన్లు నిలిపివేశారని, కుటుంబ అవసరాల కోసం భూమిని అమ్ముకోవాలన్నా వీలుకాక రైతులు అవస్థలు పడుతున్నారని వివరించారు. దీంతో సీఎం స్పందించి ఆయా గ్రామాలలో తక్షణం గ్రామసభలు పెట్టి సమస్యను పరిష్కరించాలని, రైతులకు సంబంధించిన భూములు మ్యూటేషన్లు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టరును ఆదేశించారు.

### ● దూబగుంట వీధుల్లో తిరుగుతూ..

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కందుకూరు పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు దూబగుంట గ్రామంలో గ్రామస్థులతో మమేకమై కలివిడిగా వీధుల్లో నడుస్తూ పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, మహిళలు, విద్యార్థినులతో హుషారుగా సెల్ఫీలు దిగుతూ ముందుకు సాగారు. వీధులు, డ్రైనేజీలను పరిశీలించిన చంద్రబాబు భీమని హరికృష్ణ ఇంటివద్ద ఏర్పాటుచేసిన ఇంకుడుగుంతను పరిశీలించారు. అనంతరం గొర్రెపాటి సుశీల ఇంటి వద్ద ఆగి తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా చెత్త రహిత ప్రాంతంగా మార్చుకునేందుకు పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు అనే వృద్ధుడి యోగక్షేమాలు అడిగిన సీఎం పెన్షన్ అందుతుందా లేదా అని ఆరాతీశారు. నెల నెలా 1వ తేదీ పెన్షన్ వస్తున్నదని ఆ వృద్ధుడు ఆనందం వ్యక్తం చేశారు.

### ● అనసూయమ్మను ఆదర్శంగా తీసుకోండి

బెల్లంకొండ అనసూయమ్మ అనే మహిళ సేంద్రియ పద్ధతిలో తన ఇంటివద్ద పండించిన అరటిగెలను సీఎంకు బహూకరించి ఆయనపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఆ అరటి గెలను చంద్రబాబు కూడా ఆనందంగా స్వీకరించారు. ఈ సందర్భంగా సేంద్రియ పద్ధతిలో ఆహారపదార్థాలను, కూరగాయలను పండించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించిన చంద్రబాబు అనసూయమ్మను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం దూబగుంట కుంటవద్ద ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. గ్రామ మహిళలు అత్తంటి గోవర్ధిని, సుమలత, రమాదేవి, వీణ, భారతిలతో ముఖ్యమంత్రి మాటామంతీలో ఊరు, వీధి, ఇంటి పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలని నిర్దేశించారు.



కందుకూరులోని మార్కెట్ యార్డులో జరిగిన 'స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర' బహిరంగ సభలో వేదికపై కూర్చొని అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పాల్గొన్న ప్రజలు

# కందుకూరుకు 50 కోట్లు

- ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా
- అమృత్ కింద ఇంటింటికీ తాగునీరందిస్తాం
- ఎక్కడికక్కడ మురుగునీరు శుభ్రం చేసే ప్లాంట్లు : సీఎం హామీ

కందుకూరు (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని, అభివృద్ధి పనుల కోసం తక్షణం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మార్కెట్ యార్డులో జరిగిన సభలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కోసం విజ్ఞప్తి చేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ కందుకూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటున్నానని ప్రకటించారు. ఇకపై పట్టణంలో ఎక్కడా చెత్త కనిపించకుండా చేస్తామని, ప్రతిరోజు వచ్చే చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్‌చేసేలా ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ప్లాంటులో తడి, పొడిచెత్తను వేరు చేసి రీయూజ్‌కు అవకాశం ఉన్న చెత్తను తరలించి సంపదగా మారుస్తామని, అలాగే రీయూజ్‌కు పనికిరాని చెత్తను కంపోస్టుగా మార్చి విక్రయించనున్నట్లు చెప్పారు. చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దటంతోపాటు అన్నివిధాలా అభివృద్ధి కోసం రూ.50 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం జరిగేలా చూడటంతోపాటు అమృత్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే కాలువల్లో మురుగు నీటిని శుద్ధిచేసే ప్లాంట్లు ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ మురుగులేకుండా చేస్తామని సీఎం తెలిపారు.

● కందుకూరు నుంచి కనిగిరికి వెళ్లే రోడ్డును కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నందున తక్షణం తగినచర్యలు తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ రోడ్డును అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తానని తెలిపారు.



'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఫొటోలో మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

### 'ప్రకాశం'లో కలయిక..

## సరైన సమయంలో నిర్ణయం

- సీఎం చంద్రబాబు నాయుడు
- తక్షణం కలపాలని ప్రజల నినాదాలు

కందుకూరు (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే విషయంలో సీఎం చంద్రబాబునాయుడు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలని ఇది మాప్రాంత ప్రజల బలమైన ఆకాంక్ష అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రస్తావించినప్పుడు ప్రజలు పెద్దఎత్తున కేరింతలు కొడుతూ నినాదాలు చేశారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించే సమయంలోను ప్రజలు అదేరీతిలో స్పందించారు. కొందరు యువకులు లేచి తక్షణం ప్రకాశం జిల్లాలో కలపాలని నినాదాలు చేశారు. దీంతో చంద్రబాబు మీ ఆకాంక్ష నాకు తెలుసు.. అయితే మీలాగే రాష్ట్రంలో అనేక ప్రాంతాలకు ఈ సమస్య ఉంది.. అన్నీ లోతుగా పరిశీలన చేశాక సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. దీంతో కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేయటం ఇప్పట్లో జరగదన్న అభిప్రాయం ఏర్పడింది.



దూబగుంటలో అభివాదం చేస్తూ నడుస్తున్న చంద్రబాబు



రెండు చేతులు లేవు.. పింఛను ఇప్పించాలని చంద్రబాబును కోరుతున్న దివ్యాంగుడు



ఫొటో ప్రదర్శనను తిలకిస్తూ..

### మెటీరియల్ రీసైక్లింగ్ సెంటర్ ప్రారంభం

కందుకూరులో ప్రతిరోజు 25 టన్నుల చెత్తను ప్రాసెస్ చేసేందుకు కండి మినరల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.45 లక్షల వ్యయంతో దూబగుంట సమీపంలో మెటీరియల్ రీసైకిలింగ్ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు ఆ యంత్రాలను నిశితంగా పరిశీలించడంతోపాటు వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం తదితరులున్నారు.

### ఎయిర్‌పోర్టు మంజూరు చేయండి

● నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి

గత పాలకుడు చెత్తమీద పన్నువేసిన ఘనుడు. ఆయన చెత్తమీద పన్ను వేస్తే నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు పన్ను నుంచి విముక్తి కల్పించడమేగాక ఆ చెత్తనే సంపదగా మార్చి చూపిస్తున్నాడని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు ఎవరి చేతిలో సురక్షంగా ఉంటుందో, ఇద్దరి మధ్య ఎంత తేడా ఉందో ప్రజలు కూడా గమనించాలని విజ్ఞప్తి చేశారు. తన పార్లమెంటు పరిధిలో రామాయపట్నం పోర్టుతో పాటు అనేక భారీ పరిశ్రమలు వస్తుండటం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. సమీప భవిష్యత్తులోనే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుండటమేగాక భారీ టౌన్‌షిప్‌గా రూపాంతరం చెందనున్నందున దగదర్తి వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. దగదర్తి విమానాశ్రయం ప్రతిపాదన ఎంతోకాలంగా ఉన్నందున ప్రస్తుత పరిస్థితుల్లో తక్షణం ఏర్పాటు చేయటం అవశ్యమని పేర్కొన్నారు.



పద్మజ అనే మహిళను, ఆమె బృందాన్ని కందుకూరులో జరిగిన సభావేదికపై సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

### చెత్తరహిత ఆంధ్ర కోసం ముందుకు రావాలి

● స్వచ్ఛంద సంస్థలకు సీఎం పిలుపు

కందుకూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): చెత్తరహిత ఆంధ్రప్రదేశ్ కోసం చేపడుతున్న ఉద్యమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని సీఎం చంద్రబాబునాయుడు కోరారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా కందుకూరుకు సీఎం స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్న మన్యం జిల్లా పార్వతీపురం వెనిగండ్ల పద్మజ, అలాగే ఇంటిలోని వ్యర్థాలతో కంపోస్టు తయారు చేస్తూ ఆర్గానిక్ పద్ధతిలో టెర్రస్ గార్డెన్‌లో అన్నిరకాల కూరగాయలు, పండ్లు పండిస్తున్న మచిలీపట్నం ముంతాజ్‌బేగం, కందుకూరు ప్రాంతానికే చెందిన యశ్వంత్, పువ్వాడి మౌనిక తదితర సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఐటీసీ ప్రతినిధులను సత్కరించారు. అనంతరం వారితో ముఖాముఖి నిర్వహించారు. వారు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంగా మీ కార్యక్రమాలు విస్తరింపజేయాలని అందుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని అభయమిచ్చారు. ఈ సందర్భంగా పాత పేపర్లు, పాత పుస్తకాలపై ఐటీసీ చేస్తున్న కృషి శ్లాఘనీయమని సీఎం చంద్రబాబు ప్రశంసించారు.

## కీటి దుమ్ము ఎప్పుడు దులుపుతారో!?

కలువాయి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీలు, కార్యక్రమాల్లో ఒక్క ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రమేష్ తప్ప మిగిలిన మండల స్థాయి అధికారులు ఎవ్వరూ పాల్గొనక పోవడం విశేషం. అలాగే కలువాయి తహసీల్దారు కార్యాలయం గదుల్లో మూటలు కట్టిన ఫైళ్లు, రికార్డులు దుమ్ముకొట్టు కుని, బూజుపట్టి ఉన్నా వాటిని ఎవ్వరూ దులిపిన పాపాన పోలేదు. ఇక హౌసింగ్, వెలుగు కార్యాల యాలు నిర్వహించే భవనంలోని మెట్ల కింద పాత గోతాలు, చెత్తా చెదారం దిబ్బలా పడి ఉండడం పట్ల అధికారుల పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- కలువాయి, (ఆంధ్రజ్యోతి)



హౌసింగ్, వెలుగు కార్యాలయ భవనంలోని మెట్ల కింద ఉన్న చెత్త దిబ్బ



తహసీల్దారు కార్యాలయంలో దుమ్ముకొట్టుకుని మూలన ఉన్న ఫైళ్లు

## గుంతలతో ప్రమాదాలు

స్థానిక మద్దూరుపాడు జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న సర్వీస్ రోడ్డులో ఏర్పడిన గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. పట్టణా నికి వచ్చే ప్రధాన మార్గం కావటంతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంద న్నారు. రోడ్డు జాయింట్ వద్ద తరచూ గుంతలు ఏర్పడు తుండ టంతో పనులు నాసి రకంగా చేపట్టి చేతులు దులుపు కుంటున్నారు. ఇప్పటికైనా హైవే అధికా రులు స్పందించి సమస్య పరిష్కా రానికి చర్యలు తీసుకో వాలని కోరుతు న్నారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)



మద్దూరుపాడు సర్వీస్ రోడ్డులో ఏర్పడిన గుంతలు



## పచ్చాకు కూలీల ట్రాక్టర్ ట్రాలీ బోల్తా

**మహిళ దుర్మరణం.. ఇద్దరికి తీవ్ర గాయాలు**

లింగసముద్రం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఆర్.పాలెం సమీపం పొలాల్లో శనివారం ఉదయం 11గంటల సమయంలో పచ్చాకు లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ఈ సంఘటనలో మొగిలిచెర్ల గ్రామానికి చెందిన పోతినేని కుమారి (45) మృతి చెందగా.. అదే గ్రామానికి చెందిన అర్థాకుల లక్ష్మి, పడిదపు వెంకటేశ్వర్లు గాయపడ్డారు. వీరిని చికిత్సనిమిత్తం 108లో కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగిలిచెర్ల పంచాయతీ నారసింహాపురానికి చెందిన ట్రాక్టర్‌లో లింగసముద్రం, మొగిలిచెర్లకు చెందిన 12మంది కూలీలు వేకువజామున ఆర్‌ఆర్.పాలెం సమీపంలోని పొగాకు పొలంలో పచ్చాకు రెలుపు చేసేందుకు వెళ్లారు. పచ్చాకు ట్రాలీకి లోడ్ చేసిన అనంతరం ట్రాక్టర్ ట్రాలీకి ఇరువైపులా ఉన్న డోర్లపై కూలీలు కూర్చొని వస్తున్నారు. అయితే ట్రాక్టర్ నారసింహాపురం వెళుతుండగా ఆర్‌ఆర్.పాలెం సమీపంలోని వంకలో దిగి రోడ్డు ఎక్కేక్రమంలో వంకలోని రాయిపై ట్రాలీ టైరు ఎక్కడంతో ట్రాలీ ఒక వైపుకు పడిపోయింది. దీంతో డోర్‌పై కూర్చున్న ముగ్గురు కూలీలపై పచ్చాకు పడింది. ఇది గమనించిన ఇతర కూలీలు వారిని బయటకు లాగి కాపాడారు. కింద ఉన్న కుమారిని బయటకు తీసేందుకు వారు ఎక్స్‌కవేటర్‌ను రప్పించి ట్రాలీ.. పచ్చాకును తొలగించారు. అయితే అప్పటికే కుమారి మృతి చెందింది. కుమారి బంధువు పోతినేని మధు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్



మృతురాలు పోతినేని కుమారి

## ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్

- చీపురు పట్టి రోడ్లు శుభ్రం చేసిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలతో ప్రతిజ్ఞ

నెల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే ధ్యేయంగా, ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమానికి జిల్లాలో శనివారం విశేష స్పందన లభించింది. తొలి కార్యక్రమం జిల్లాలో జరగడం, సీఎం చంద్రబాబునాయుడు కందుకూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొనడంతో ఇది మరింత ప్రాధాన్యతను సంత రించుకుంది. జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, గ్రామాల్లో ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ జరిగింది. ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజలు కూడా ఈ కార్యక్ర మంలో పాల్గొని తమ బాధ్యతను చాటుకున్నారు. పరిసరాల పరిశుభ్రతను పాటిస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఆత్మకూరులో జరిగిన కార్యక్రమంలో దేవదాయశా ఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నా రు.పరిసరాల పరిశుభ్రతతోపాటు తడిచెత్త, పొడిచెత్త వేరుచేయడం, వర్మికంపోస్ట్‌పై అవగాహన కల్పించారు. స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. టీపీగూడూరు మండలం నరుకూరులో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటి ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో జరిగిన కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని స్థానికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కావలిలో ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటకృష్ణా రెడ్డి పాల్గొ న్నారు. పరిసరాల పరి శుభ్రతపై పట్టణంలో భారీ ర్యాలీ జరిగింది. జలదంకి మండలం బ్రాహ్మణ కాకలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టడంతోపాటు శానిటరీ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని మాదరాజు గూడూరుతో పాటు 37వడివిజన్‌లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు జరిగాయి. ఇక్కడ టీడీపీ నాయకులు, అధికారులు, శానిటేషన్ సిబ్బందితో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నెల్లూరు లోని పలు డివిజన్లలో కూడా టీడీపీ నాయకులు, మునిసి పల్ సిబ్బంది స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాలు నిర్వహించారు. కాగా అన్నీ ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. జడ్పీ కార్యాలయ ఆవరణలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో డీఆర్‌వో ఉదయ్‌భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



టీపీ గూడూరు : నరుకూరులో వీధులను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



కొడవలూరు : నార్తురాజుపాళెంలో పారిశుధ్య పనులు చేపడుతున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కావలి : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి తదితరులు



వింజమూరు మండలం చాకలికొండలో విద్యార్థుల ర్యాలీ



ఆత్మకూరు : స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ భాగంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

## సీఎంలా కాదు... సగటు మనిషిలా...!

- చంద్రబాబులో కనిపించిన కొత్త కోణం
- రక్షణ వలయాన్ని దాటి ప్రజలతో మమేకం

నెల్లూరు, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): పరదాల చాటున ప్రయాణం... ఎవరూ పలకరించినా.... ఒకటే ఎక్స్‌ప్రెషన్. ఎంతటి నాయకులకైనా ఆమడదూరంలో ఉంచే వ్యక్తిత్వం.. ఎంత దగ్గరగా ఉన్నా సామాన్యుల పిలుపునకు అందనంత దూరం..!! ఇది గత ముఖ్యమంత్రి ధోరణి.

ముభావం..! ముక్తసరి సమాధానం..!! గంభీర వదనం..!!! ప్రియనేత చిరునవ్వుకు కూడా నోచుకోలేని నాయకుల దైన్యం..! ఏళ్లు గడిచినా ఎన్నిసార్లు సీఎం హోదాలో ప్రజల మధ్యకు వచ్చినా ఏ మాత్రం కొత్తదనం కనిపించనివ్వకపోవడం చంద్రబాబుతత్వం. కానీ... ఈసారి చంద్రబాబు మారిపోయారు. ఓ ముఖ్యమంత్రిలా కాకుండా సగటు మనిషిగా కందుకూరు ప్రజలతో కలిసిపోయారు.

శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు దూబగుంట లో అడుగుపెట్టిన సీఎం చంద్రబాబు సుమారు 2 గంటల సేపు ఆ గ్రామంలో గడిపారు. ఊరి మొగదాలకు వచ్చిన వెంటనే వాహనం నుంచి కిందకు దిగారు. సుమారు కిలోమీటరు దూరం నడిచారు. గ్రామంలో హారతులిచ్చిన మహిళను ఆప్యాయంగా పలకరించారు. తన బొమ్మ గీసి చేతికిచ్చిన విద్యార్థినిని నవ్వుతూ దగ్గరకు తీసుకున్నారు. ఆ చిన్నారితో ఫొటో దిగడానికి ఆసక్తి చూపారు. తన తోటలో పండిన అరటి గెలతో స్వాగతం పలికిన దంపతులను ఆత్మీయంగా పలకరించారు. పక్షవాతంతో చక్రాల కుర్చీకి పరిమితమైన ఓ రైతు తండ్రి పరిస్థితిని వివరించి దివ్యాంగుల పింఛను ఇప్పించాలని కోరడంతో కాదనలేక పోయాడు. డ్వాక్రా మహిళలు రీసైక్లింగ్ ప్లాస్టిక్‌తో తయారు చేసిన బెంచీలను చూసి ముచ్చట పడ్డారు. దానిపై కాసేపు కూర్చున్నారు. కాస్త దూరంగా నిలబడి ఉన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని పిలిచి మరీ పక్కన కూర్చోబెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు ఈ మోడల్స్ చూపించి మోటివేట్ చేయాలని పక్కనున్న మంత్రి నారాయణకు సూచించారు. సార్... మీతో ఒక ఫొటో.. అని అడిగిన డ్వాక్రా మహిళలను నవ్వుతూ రండమ్మా.. అంటూ వారితో ఫొటోలు దిగారు. 'మీ దేవాన్ష్ పుట్టిన రోజే పుట్టాడు సార్, వీడి పేరు దేవాన్షే'... అంటూ ఓ తల్లి తన బిడ్డను పరిచయం చేస్తే ప్రేమగా ఆశీర్వదించి ముందుకు కదిలారు. తన కోసం వచ్చిన నాయకులను చంద్రబాబు ప్రత్యేకంగా గుర్తించుకున్నారు. ఏయ్..!! ప్రభాకరరెడ్డి (ఎంపీ), నారాయణ(మంత్రి)... ఇంకా మనవాళ్లు ఉన్నారు చూడు. వాళ్లు భోజనాలు చేశారా..!? వారిని నా దగ్గరకు తీసుకురండి, కలిసి తింటాం..! అంటూ అనురాగాన్ని కురిపించారు. హెలిప్యాడ్ వద్దకు వచ్చిన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, దగుమాటి కృష్ణారెడ్డి తదితరులను నవ్వుతూ పలకరించారు. హెలిప్యాడ్ వద్ద కనిపించిన ప్రతి నాయకుడితో ఫొటోలు దిగారు. మొత్తంపై దూబగుంటలో చంద్రబాబు ప్రజలతో మమేకం అయిన తీరును చూసి పలువురు ఆశ్చర్యపోయారు.



దూబగుంట గ్రామంలో మహిళలతో సీఎం చంద్రబాబు నాయుడు

## పొగాకు బ్యారన్ దగ్ధం

- రూ.7లక్షల ఆస్తి నష్టం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తూర్పుపోలినేనిపాలెంలో పందిళ్ల శింగయ్యకు చెందిన పొగాకు బ్యారన్ శనివారం ఉదయం 6 గంటల సమయంలో దగ్ధం అయ్యింది. క్యూరింగ్ సమయంలో పొగాకు కర్రలు జారి గొట్టాలపై పడడంతో మంటలు వ్యాపించడంతో 10క్వింటాళ్లు పొగాకు మంటల్లో కాలి బూడిదైనట్లు బాధితుడు వాపోయాడు. ఈ ప్రమాదంతో రూ.7లక్షల ఆస్తినష్టం జరిగిందన్నారు. పొగాకు బోర్డు అధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలని కోరారు. కాకర్లవారిపాలెంలో దాసరి తిరుమలరావు, పెయ్యిల మాలకొండయ్యలకు చెంది న జాయింట్ పొగాకు బ్యారన్ శనివారం రాత్రి 9గంటల సమయంలో దగ్ధం అయ్యింది. ఈ ప్రమా దంలో రూ.7లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. బ్యారన్ క్యూరింగ్ జరుగుతున్న సమయంలో పొగాకు కర్రలు జారి గొట్టాలపై పడడంతో మంటలు వ్యాపించాయన్నారు.



దగ్ధమవుతున్న పొగాకు బ్యారన్

## అ'పూర్వ' సహకారం!

- విద్యాబుద్ధులు నేర్పిన బడిని మరవని విద్యార్థులు
- గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కల్పన

ఒకరు డాక్టరు.. మరొకరు ఇంజనీరు.. ఇంకొందరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు.. మరికొందరు విదేశాల్లో వ్యాపా రాలు, ఉద్యోగ రీత్యా స్థిరపడిన వారు. ఇలా ఎవరికి వారు తీరిక లేకుండా వివిధ ప్రాంతాల్లో ఉంటున్నారు. అయితేనేం.. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, సరస్వతీ నిలయాన్ని మరిచి పోలేదు. ఏడాదిలో ఒకరోజు తప్పనిసరగా అందరూ కలుస్తూ పాతరోజులను నెమరు వేసుకుంటున్నారు. అంతేకాదు... తమ చదువుల గుడి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. వారే ఉదయగిరి మండలం గండిపాళెం బాలుర గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు.




పూర్వ విద్యార్థులు సుందరంగా తీర్చిద్దిన ఇండోర్‌స్టేడియం



పూర్వ విద్యార్థి దాతృత్వంతో నిర్మించిన స్టేజీ

ఉదయగిరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): చదువు నేర్పిన బడిని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. దీంతో 2019లో అలుమిని అసోసియేషన్ ఆఫ్ ఏపీఆర్‌ఎస్ స్కూల్ గండిపాళెం (ఏఏఏజీ) పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను సమకూరుస్తూ శాస్త్ర, సాంకేతిక రంగాలపై అవగాహన కల్పిస్తున్నారు. అలాగే పాఠశాల ఆవరణలో పచ్చదనం సంతరించుకునేలా మొక్కలు పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు పాఠశాల పూర్వ విద్యార్థులు.

**పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి ఇదీ..**

- పాఠశాల ఆవరణలో శిథిలావస్థకు చేరిన ఇండోర్‌స్టేడియాన్ని 1999 సంవత్సరానికి చెందిన విద్యార్థులు రూ.2.50 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టడంతోపాటు రేకులు, ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దారు.
- ఏఏఏజీ సలహాదారు వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ఫౌండే షన్ ద్వారా 40 కంప్యూటర్లు అందజేయడంతోపాటు పాఠశాలలో రూ1.80 లక్షలు వెచ్చించి కంప్యూటర్ ల్యాబ్‌ను సమకూర్చి, సౌండ్ సిస్టంను అందుబాటులోకి తెచ్చారు.
- ప్రభుత్వం నీటిశుద్ధి పరికాలను మంజూరు చేయగా పూర్వ విద్యార్థులు దానికి సుమారు రూ.లక్ష వెచ్చించి షెడ్ ఏర్పాటు చేశారు. పాఠశాలలో వివిధ కార్యక్రమాలు నిర్వహించుకొనేందుకు వీలుగా స్టేజీ నిర్మాణం చేపట్టారు.
- పూర్వ విద్యార్థుల్లో కొందరు వైద్యులు ఉండటంతో పాఠశాలలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.
- విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం, ప్రతిభ చూపిన వారికి క్రీడా సామగ్రి, నగదు బహుమతులు అందజేస్తున్నారు.
- పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలను సమకూర్చారు. ప్రతి ఏడాది పదో తరగతి పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు.
- 2023లో 680 మంది పూర్వ విద్యార్థులు కలిసి రూబీ జూబ్లీ వేడకలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడకల్లో గురువులు, వివిధ స్థాయిల్లో ఉన్న పూర్వ విద్యార్థులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యక్రమాలను తీర్మానించుకున్నారు.



శుద్ధిజల కేంద్రానికి ఏర్పాటు చేసిన షెడ్



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచి పర్చూరు విజయమ్మ

## ఉత్తమ ఓడిఎఫ్ ప్లస్ గ్రామ పంచాయతీగా చిత్తలూరు ఎంపిక

**సర్పంచి పర్చూరు విజయమ్మకు సీఎం చంద్రబాబు సన్మానం**

చేజర్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మల మూత్ర విసర్జన రహిత (ఓడిఎఫ్ ప్లస్) గ్రామ పంచాయతీగా మండలంలోని చిత్తలూరు ఎంపిక యింది. ఈనేపథ్యంలో శనివారం కందుకూరులో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తలూరు గ్రామ సర్పంచ్ పర్చూరు విజయమ్మను అభినందించి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పర్చూరు విజయమ్మ మాట్లాడుతూ రాష్ట్ర దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో చిత్తలూరు గ్రామ పెద్దలు మోదేపల్లి నవకృష్ణ చౌదరి, మోదేపల్లి పెంచల నాయుడు ఆధ్వర్యంలో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

# కావలి
## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



దూబగుంటలో మహిళతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి



హెలిప్యాడ్ వద్ద సీఎం చంద్రబాబుకు శ్రీవారి శిల్పాన్ని అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



సీఎంకు గులాబీ ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఆనంద్



ఇంకుడుగుంతను పరిశీలిస్తూ..

# కందుకూరు అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి

- ముని్సపాలిటీ అభివృద్ధి, సాగు, తాగునీటి కోసం నిధులు ఇవ్వండి
- ప్రజల ఆకాంక్ష మేరకు కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపాలి
- సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఇంటూరి వినతి

కందుకూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):పూర్తిగా వెనుకబడిన ప్రాంతమైన కందుకూరు నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సీఎంకు విజ్ఞప్తి చేశారు. శనివారం కందుకూరులో వివిధ కార్యక్రమాలతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కెట్‌యార్డులో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ మున్సిపాలిటీకి 13 ఏళ్లుగా పాలకవర్గం లేనందున ఆర్థికసంఘం నిధులు రాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని తెలిపారు. పట్టణం విస్తరిస్తున్నా అనేక ప్రాంతాలలో సరైన మట్టిరోడ్లు కూడా లేవని 9వేల మీటర్ల సీసీ డ్రైన్లు, 4వేల మీటర్ల సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉందని వివరించారు. ఈ స్థితిలో మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులిస్తే రానున్న మే, జూన్ నెలల్లో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేసి మీకు బహుమతిగా అందిస్తామని విన్నవించారు. అలాగే రాళ్లపాడు రిజర్వాయరుకు సోమశిల జలాశయం నుంచి ఏటా 1.5 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా కాలువ సక్రమంగా లేనందున మూడవ వంతు కూడా రావటం లేదని అన్నారు. సోమశిల ఉత్తర కాలువ విస్తరణ పనులు వేగంగా జరిగి రాళ్లపాడుకు సక్రమంగా నీరందేలా చూడాలని, అలాగే వెలుగొండ జలాశయం నుంచి కూడా రాళ్లపాడుకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పుటేరు, మన్నేరు, పాలేరులపై చెక్‌డ్యాంల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కందుకూరులో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా ఉత్తర బైపాస్ నిర్మాణంకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కందుకూరు రూరల్ మండలంలో 19 గ్రామ పంచాయతీలు తీవ్రమైన తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నందున ఆ గ్రామాలన్నింటికీ ఓ భారీ మంచినీటి పథకం మంజూరు చేయాలని కోరారు. కందుకూరు మండలంలోని 4 గ్రామాలలో రమారమి 1829 ఎకరాలు గర్భకండ్రికగా రెవిన్యూ రికార్డులలో నమోదుచేసి మ్యూటేషన్లు చేయకపోతున్నందున ఆ సమస్యకు పరిష్కారం చూయించాలని, నియోజకవర్గ ప్రజల బలమైన ఆకాంక్షగా ఉన్న కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేందుకు చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు సీఎంకు విన్నవించారు.



సభకు వచ్చే వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు



బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

**● 'ప్రకాశం' విద్యార్థినుల అభివాదం**

సీఎం చంద్రబాబునాయుడు కందుకూరు విచ్చేసిన సందర్భంగా దూబగుంట సమీపంలో ఉన్న ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఆయనకు అభివాదం చేశారు. ఎమ్మెల్సీ కుప్పం నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న కంచర్ల శ్రీకాంత్ కుటుంబం నిర్వహిస్తున్న కళాశాల కావటంతో చంద్రబాబు కూడా వారికి ఉత్సాహంగా అభివాదం చేస్తూ ముందుకు సాగారు. జైజై చంద్రబాబు నినాదాలతో హోరెత్తించిన విద్యార్థులు ఫీజు రీఇంబర్స్‌మెంట్ ఇచ్చినందుకు థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు.

## న్యూస్ బాక్స్

### హెల్మెట్‌తో ప్రాణరక్షణ

కలువాయి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యవంతులను చేస్తూ శనివారం వివేకానంద పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించండి- ప్రాణాలను రక్షించుకోండి అంటూ నినాదాలు చేశారు. అనంతరం బస్టాండులో విద్యార్థులు మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### మద్యం దుకాణం వద్దు

కలువాయి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిడ్డంగివారి వీధిలోని చిలుకూరి ప్రసాద్ ఇంట్లో కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చూడాలని కాలనీవాసులు శనివారం తహసీల్దారు శ్యామ్‌సుందర్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. అసలే ఇరుకుగా ఉన్న వీధిలో వెళ్లేందుకు మహిళలు ఇబ్బంది పడుతున్నారని, దుకాణం ఏర్పాటుచేస్తే ఉండలేమని, వెంటనే చర్య తీసుకోవాలని తహసీల్దారును కోరారు.

### ఆదర్శంగా రాచవారిపల్లె

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి):రాచవారిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకే దత్తత తీసుకున్నట్లు విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అందజేసిన ఆర్వో సిస్టంను ప్రారంభించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జయరాజ్, గ్రామపెద్దలు నంబూరి రోశిరెడ్డి పాల్గొన్నారు.

### ఎరువు తయారీ పరిశీలన

కలిగిరి: ఎంపీడీఓ ప్రత్యూష పంచాయతీ ఆధ్వర్యంలోని సంపదతయారీ కేంద్రానికి వెళ్లి వర్మీకంపోస్టు ఎరువు తయారీని విధానాన్ని పరిశీలించారు. ఆమె వెంట కార్యదర్శి రవిచంద్ర సర్పంచ్ రాగి దివ్య, వార్డుమెంబరు పుల్లా వేమయ్య, పుల్లా రవి, జిర్రా మస్తాన్‌రెడ్డి ఉన్నారు. అలాగే అయ్యపరెడ్డిపాలెం విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల ఆవరణంను శుభ్రం చేసి మొక్కలు నాటి స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞ చేశారు.

### శైవక్షేత్రాలకు బస్సు సౌకర్యం

ఉదయగిరి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రాలైన ఘుటిక సిద్ధేశ్వరం, భైరవకోనలకు ప్రతి సోమవారం బస్సు సర్వీసు నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎం శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సూచన మేరకు ఏర్పాటు చేశామన్నారు. డీఎంను నియోజకవర్గ బీజేపీ నాయకులు ముడమాల రమేష్ రెడ్డి, బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మోటపోతుల చెన్నయ్య, సిద్ధేశ్వరం ప్రధానార్చకులు సిద్ధయ్యస్వామి, సమరసత ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### విగ్రహ పతిష్ఠ

అనంతసాగరం ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బొమ్మవరం పంచాయతీ అగ్రహారంలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో శనివారం విగ్రహ పతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. సీతారాములు, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, వైసీపీ నాయకులు రాపూరు వెంకట సుబ్బారెడ్డి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం

బిట్రగుంట, ఫిబ్రవరి 15: ఐసీడీఎస్ సీడీపీఓ సౌజన్య విశ్వనాథరావుపేట హైస్కూల్ ప్రాంగణం లో శనివారం ముగిసిన పోషణ్ బీ పఢా యి బీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు కోటేశ్వరి, సుభాషిణి, ఇన్‌చార్జి సూపర్‌వైజర్ సుప్రజ ఉన్నారు.

# పరిశుభ్రతలో అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయం

- వాడవాడలా స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్ ర్యాలీలు
- పాల్గొన్న మంత్రి ఆనం, కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగుమాటి, కాకర్ల



సంగం: ర్యాలీలో పాల్గొన్న అధికారులు



ఉదయగిరి: దుత్తలూరులో జరిగిన ర్యాలీలో అధికారులు



ఆత్మకూరు: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయం అని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన పట్టణంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా సత్రం సెంటర్‌లో తడిచెత్త-పొడిచెత్త హోమ్ కంపోస్టింగ్‌పై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. తదనంతరం అలఘునాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆర్ అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నిబంధనల ప్రచార స్టిక్కర్లు వాహనాలకు ఏ ర్పాటు చేసే కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేశారు. తదనంతరం బాలికల గురుకులంలో మినరల్ వాటర్ యూనిట్ ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రతినెలా మూడవ శనివారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశమన్నారు. మన ఇల్లు, పరిసరాలు, ఊరు పరిశుభ్రంగా ఉంటే దేశం శుభ్రంగా ఉంటుందన్నారు. అధికారులు, కూటమి పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజలను జాగృతం చేయాలని సూచించారు.

**● అభివృద్ధిని పరుగులు తీయిస్తాం**

నియోజకవర్గంలో గతంలో నిలిచిన అభివృద్ధిని పరుగులు తీయిస్తామని మంత్రి ఆనం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మకూరులో పలు అభివృద్ధి పనులకు రూ.29 కోట్ల నిధులు మంజూరు చేశామని వాటితో పనులన్నింటినీ చేపడతామన్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్, చైర్‌పర్సన్ వెంకటరమణ్మ, టీడీపీ నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, ఇందూరు వెంకటరమణారెడ్డి, దావా పెంచలరావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● కావలి: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దరిచేరవని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 10వ వార్డులో నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర- స్వచ్ఛ దివస్ ర్యాలీలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెత్త వేసుకునేందుకు మూడు రకాల డస్ట్‌బిన్‌లను ప్రజలకు పంపిణీ చేశారు. దేశంలోనే పరిశుభ్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని సీఎం ఈ కార్యక్రమంను చేపట్టారని తెలిపారు. ఇళ్లలోని చెత్తను రోడ్లు, కాలువల్లో వేయకుండా తడి చెత్త, పొడిచెత్తను వేరుచేసి డస్ట్‌బిన్‌లో ఉంచిచెత్తసేకరణకు వచ్చిన మున్సిపల్ కార్మికులకు అందజేయాలన్నారు. పట్టణంలోని ప్రతి ప్రతిసెంటర్‌లో ఐరన్ మెస్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో ఫణికుమార్, డీఈ సాయిరాం, శానిటరీ ఇన్ స్పెక్టర్ బషీర్, మధుబాబు నాయుడు, వల్లేరి వెంకట కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, షేక్ అలహర్, సారథి, అభిషేక్ పాల్గొన్నారు.

● జలదంకి: మండలకేంద్రాలతో పాటు మేజర్ పంచాయతీల్లో స్వచ్ఛకాంప్లెక్స్‌లు నిర్మించి స్వచ్ఛ ఉదయగిరిగా మార్చుకుందాం అని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బ్రాహ్మణక్రాక పంచాయతీ బి.కె అగ్రహారం సచివాలయ ప్రాంగణంలో రూ.3లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన స్వచ్ఛకాంప్లెక్స్‌ను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ ఇండ్ల సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఉపసర్పంచ్ దగుమాటి మాల్యాద్రిరెడ్డి, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో బ్రహ్మయ్య, ఉపాధిహామీ ఏపీవో శ్యామల, కార్యదర్శి నీరజ, వీఆర్వో తిరుపతిరావు పాల్గొన్నారు.

● సంగం: ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించి మండల కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. చెత్తసంపద కేంద్రం తొట్టిలో తడి, పొడిచెత్త వేసి వానపాములను వదిలారు. కార్యక్రమంలో వీవోఆర్డీ వరప్రసాద్, కార్యదర్శి నరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వెంగారెడ్డిపాళెంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే తలుపూరుపాడులో సర్పంచు నాజున్ని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు ఉన్నారు.

● కలువాయి: చిన్నగోపవరంలో సర్పంచు ఓబులమ్మ కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (సామాజిక మరుగుదొడ్లు)ను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల శుభ్రతపై గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్, మండల రిసోర్సు కోర్డినేటర్ సునీల్, కార్యదర్శి శివనాగేంద్ర పాల్గొన్నారు. తెలుగురాయపురంలో హెచ్‌ఎం మురళీకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

● కొండాపురం: గానుగపెంటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, నేతలు కిలారి నరేంద్ర, ఏపీవో మురళీధరరావు, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● బిట్రగుంట: ఎంపీడీవో సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది మండల కార్యాలయ ఆవరణలోని చెత్తచెదారాన్ని తొలగించారు. కార్యక్రమం ఏఈ పీఆర్ శ్రీనివాసులు ఉన్నారు.

● కావలి రూరల్: గ్రామాల పరిశుభ్రతకు రాష్ట్ర ప్రభుత్వం చెత్త సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొచ్చినట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. రుద్రకోటలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివస్‌లో పాల్గొన్నారు. అనంతరం చెత్త కుండీలను అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సమద్, కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● ఆత్మకూరు: ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ నాగులపాడు, రావులకొల్లు, చెర్లోయడవల్లిలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఈవోపీఆర్డీ డేవిడ్‌రాజు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో శిరీషా, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● ఉదయగిరి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండాలని ఎంపీడీవో అప్పాజీ సూచించారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గండిపాళెంలో అవగాహన కల్పించారు. వైద్యశాల పరిసరాలను శుభ్రం చేసి ఉదయగిరి అటవీశాఖ కార్యాలయంలో రేంజ్‌అధికారి బీఎస్ కుమార్‌రాజా ఆధ్వర్యంలో ఆవరణను శుభ్రం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినీత, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

● దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌లోని 565 జాతీయ రహదారిపై ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు విద్యార్థులతో కలిసి మానహారం ఏర్పాటుచేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు నజీముల్లా, నాగేంద్ర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



జలదంకి: స్వచ్ఛకాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కొండాపురం: ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో ఆదినారాయణ, తదితరులు



బిట్రగుంట: చెత్త తొలగిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

## ముగిసిన శిక్షణ తరగతులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మూడురోజులుగా జరిగిన పోషణ-బీ అడాయి-బీ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కార్యకర్తలు ప్రదర్శించిన టీఎల్‌ఎంను ఎంపీడీఓ నరేంద్రదేవ్, ఎంఈఓ మల్లికార్జునరావులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరేంద్రదేవ్ మాట్లాడుతూ ప్రీ స్కూల్ పిల్లలను గుర్తించి కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత ఉన్నారు.

## నిందితులను తక్షణం అరెస్టు చేయాలని ధర్నా



అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న దళితవర్గాలు

కావలి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో అగ్రవర్ణాల ఇంటి ముందు బులెట్ నడిపారని దళిత యువకుడి చేతులు నరికిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండు చేశారు. శనివారం ఈ విషయంపై స్థానిక మాగుంట పార్వతమ్మరోడ్డులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సంఘం సభ్యులతో కలిసి ధర్నా చేశారు. ఇంత దారుణం జరిగినా తమిళనాడు ప్రభుత్వం, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవటం బాధకరమన్నారు. కార్యక్రమంలో వెంకటరత్నం, లక్ష్మయ్య, నరసింహులు, నరసింహం, మధన్, వాసు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మరమ్మతులకు నిధుల మంజూరు

కలువాయి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు సాంఘీక సంక్షేమశాఖ హాస్టళ్లలో అవసరమైన మరమ్మతు పనులు చేసేందుకు ప్రభుత్వం రూ.67లక్షలు నిధులు మంజూరు చేసినట్లు మండల పంచాయతీరాజ్ ఏఈ జయరామిరెడ్డి తెలిపారు. దాచూరు ఎస్సీ బాలుర హాస్టల్‌కు రూ.32.70 లక్షలు, కలువాయి ఎస్సీ బాలుర హాస్టల్‌కు రూ.14.25 లక్షలు, ఎస్సీ బాలికల హాస్టల్‌కు రూ.20.25 లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఈ నిధులతో మరుగుదొడ్లు, కిటికీలు, తలుపుల మరమ్మతు పనులు టెండర్ల ప్రక్రియ పూర్తయిన తరువాత చేపడతామని తెలిపారు.

## దాతల సహకారంతో శైవక్షేత్ర నిర్మాణం

బిట్రగుంట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీ మణికంఠవీధిలో స్థానికుల ఆధ్వర్యంలో శైవక్షేత్ర నిర్మాణ పనులు శరవేగవంతగా జరుగుతున్నాయి. ఈ ఆలయంలో విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్య, అయ్యప్ప, అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయల కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా దీటచ్చువేణు, దేవరాళ్ళ తిరుపతియాదవ్, జొన్నలగడ్డ విజయలక్ష్మీలు ఆలయ రాతిద్వారబంధాలకు ఏర్పాటుకు శనివారం కమిటీ సభ్యులకు విరాళాలు అందజేశారు. అలాగే తాళ్లూరు సురేష్, పోలిశెట్టి దామోదర్, యన్నాబతిన్న కోటేశ్వరావు, కొర్రా చంద్రశేఖర్‌లు నిర్మాణ పనులకు ఆర్థికసాయం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

## కనీస వేతనం రూ.26వేలు చేయాలి

కావలి టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ26వేలకు పెంచాలని అంగన్‌డీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె రెహానాబేగం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 17న జరుగనున్న ధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ సంఘం నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. మెనూ బిల్లులు, సెంటర్ అద్దె బిల్లులు సక్రమంగా అందడం లేదన్నారు. మెను చార్జీలు పెంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు పెంచులయ్య, సుభాషిణి, విజయలత పాల్గొన్నారు.

● ఉదయగిరి: ఈనెల 17న ఉదయగిరి అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు నాగేశ్వరరావు, ప్రమీల, రజియా తెలిపారు. ఈ మేరకు సీడీపీవో సునీతకు ముందస్తుగా నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సీడీపీవోకు ధర్నా నోటీసు అందిస్తున్న నాయకులు

## బోధన నైపుణ్యాలు పెంచుకోవాలి



కొండాపురం: మాట్లాడుతున్న ఎంఈవో-1 కే.రవికుమార్



ఉదయగిరి: విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు అందజేస్తున్న ఎంఈవో

కొండాపురం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు తమ వృత్తిలో నైపుణ్యాలను పెంచుకోవాలని మండల ఎంఈవో-1 రవికుమార్ తెలిపారు. శనివారం సాయిపేట, కొండాపురం, కొమ్మి, తూర్పు ఎర్రబల్లి కాంప్లెక్స్ సమావేశాల్లో జరిగాయి. సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంఈవో-1 పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాలల బోధనలో పాటించాల్సిన విధానాలను వీడియో ప్రదర్శనతో వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఆనందరావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

● సంగం: మండలకేంద్రంతో పాటు గాంధీజన సంఘం, దువ్వూరులో శనివారం మధ్యాహ్నం ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల అభ్యసన స్థితిని మెరుగుపరిచే వ్యూహం, విద్యా ప్రమాణాల పెంపు అంశాలపై చర్చించారు.

● ఉదయగిరి: క్లస్టర్ సమావేశాల్లో ఉపాధ్యాయులు పాల్గొని బోధననైపుణ్యాలు మెరుగుపర్చుకుని విద్యార్థులకు బోధన చేయాలని ఎం ఈవో-2 శ్రీనివాసులు సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో క్లస్టర్ సమావేశాన్ని సందర్శించారు. అలాగే స్థానిక దళితవాడ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ కలీం అందజేసిన మిఠాయిలు, పండ్లను విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బాలకేశవులు, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల భద్రతపై శ్రద్ధ చూపాలి

ఏఎస్ పేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల భద్రతపై శ్రద్ధ చూపాలని బాలికా శిశు అభివృద్ధి అధికారిణి టి మమత సూచించారు. శనివారం ఆమె స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యాలయ పరిసరాలను పరిశీలించి పలు సూచనలు అందించారు. అనంతరం వంటగది, రికార్డులను తనిఖీ చేశారు. పంచతంత్ర కార్యక్రమాన్ని పరిశీలించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లలో 100 శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, అకౌంటెంట్ సరోజ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.